# ఆంధ్రప్రదేశ్

½/PM

27261

జనవరి - ఫిబ్రవరి 1973 | 50 పైసలు

Jan 73
to
June 73.



# ఆంధ్రప్రదేశ్ గురించి

- 1971 జనాభా లెక్కల ప్రకారం, ఆంధ్రప్రదేశ్ జనాభా భారతదేశ జనాభాలో 7.93 శాతానికి, ఆంధ్రప్రదేశ్ విస్తీర్ణం భారతదేశ విస్తీర్ణంలో 9 శాతానికి సమానం.

- ఆంధ్రప్రదేశ్ విస్తీర్ణం 2.75,109 చ. కి. మీటర్లు.

- 1971 లో సేకరించిన లెక్కల ప్రకారం. ఆంధ్రప్రదేశ్ జనాభా 4,33,94,951 మంది. దేశజనాభా 54,69,55,945.

  1971 లెక్కల ప్రకారం, రాష్ట్ర జనాభాలో అక్షరాస్యులు 24.56 శాతం మంది వున్నారు. 1961 లో 21.19 శాతం. భారతదేశం మొత్తంమీద వున్న అక్షరాస్యుల శాతం 1971 లో 29.35. 1961లో 24,03 శాతం.

- మన రాష్ట్రంలో జనాభా సాంద్రత చ. కి. మీ. 1కి 157 మంది హైదరాబాదు జిల్లాలో సాంద్రత చ. కి. మీ. 1కి, 362. అన్ని జిల్లాల కంటే యిది ఎక్కువ. ఆదిలాబాద్ జిల్లాలో జనాభా సాంద్రత 79 మంది. అన్నింటి కంటే యిది తక్కువ.

- రాష్ట్రంలో తలసరి సగటు ఆదాయం (1960-61 నాటి ధరలు) మొదటి ప్రణాళిక అంతానికి రూ. 281లు, రెండవ ప్రణాళిక అంతానికి రూ. 306లు, మూడవ ప్రణాళిక అంతానికి రూ. 333 ల చొప్పున వుంది. నాలుగవ ప్రణాళిక ముగింపు నాటికి తలసరి సగటు ఆదాయం రూ. 430 లకు పెరుగుతుంది.

- రాష్ట్రంలో 1,000 అడుగుల లోతు మేరలో సుమారు 1,000 మిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలు వున్నాయి. 2,000 అడుగుల లోతు మేరలో 1,320 మిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలు లభించగలవని అంచనా.

- భారతదేశంలో బారైట్స్ ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్‌దే అగ్రస్థానం. దేశంలో ఉత్పత్తి అయ్యే బారైట్స్‌లో 90 శాతం మొదలు 95 శాతం వరకు రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్నది.

- అభ్రకం ఉత్పత్తిలో బీహారు, రాజస్థాన్ రాష్ట్రాల తరువాతి స్థానం ఆంధ్రప్రదేశ్‌ది.

# ఆంధ్రప్రదేశ్

సంపుటి : 17

జనవరి-ఫిబ్రవరి, 1973
పుష్య-మాఘ, 1894 శా. శ.

సంచికలు : 3, 4

ప్రధాన సంపాదకులు :
పెండ్యాల వామనరావు

సంపాదకులు :
ఈరంకి వెంకట సుబ్బారావు

దేశమును ప్రేమించుమన్నా
మంచియన్నది పెంచుమన్నా
వట్టిమాటలు కట్టిపెట్టోయ్
గట్టిమేల్ తలపెట్టవోయ్

సాలు చందా ఆరు రూపాయలు

వెల : 50 పైసలు

రిజిస్టర్డు నెం : 133

ఈ సంచికలోని రచయితలు వెలిబుచ్చిన అభిప్రాయాలు తప్పనిసరిగా ప్రభుత్వానికి సంబంధించినవిగా భావించనక్కరలేదు.

## సంచికలో

పేజీ

## రిపబ్లిక్ దినోత్సవాలలో

# ఆంధ్రప్రదేశ్ ప్రదర్శన శకటం

భారత స్వాతంత్ర్య రజతోత్సవ సందర్భంగా దేశంలో యీయేడు రిపబ్లిక్ దినోత్సవం. స్వాతంత్ర్య సంగ్రామ కాలం నాటి కథాంశాలకు ప్రత్యేక ప్రాధాన్యంతో జరుపబడింది. స్వాతంత్ర్య సమర ఘట్టాలను ప్రదర్శించే వివిధ రాష్ట్రాల ప్రదర్శన శకటాలు కన్నుల పండువగా యీ ఉత్సవాలలో పాల్గొన్నవి.

ఆంధ్రప్రదేశ్ ప్రదర్శన శకట నిర్వహణకు కథాంశం **"సైమన్ కమీషన్ బహిష్కరణోద్యమం."**

సైమన్ కమీషన్‌రాక సందర్భంగా, యావద్భారత ప్రఖ్యాతి వహించి, స్వాతంత్ర్యోద్యమపు తీరుతెన్నులను ప్రభావితంచేసిన ప్రధాన సమర ఘట్టాలు ప్రదర్శన శకటం ద్వారా ప్రదర్శించబడినవి.

సర్ జాన్ సైమన్ అధ్యక్షత క్రింద తొమ్మండుగురు సభ్యులుగల కమీషన్ 1928 సంవత్సరం ఫిబ్రవరి 3వ తేదీన భారత దేశానికి వచ్చింది. దీనిలోని సభ్యులందరూ శ్వేతజాతీయులే. పార్టీవిభేదాలతో నిమిత్తం లేకుండా దేశమంతటా హర్తాళ్లతో, పూర్తి బహిష్కరణోద్యమంతో సైమన్ కమీషన్‌కు ప్రజలు స్వాగతం యిచ్చారు!

"సైమన్ వెనక్కి వెళ్లిపో" అని భారతీయులందరూ ఏక కంఠంతో చేసిన గర్జారావం దేశమంతటా ప్రతిధ్వనించింది. కమీషన్‌వారు దేశంలోని ముఖ్యనగరాలను సందర్శించారు. ఎక్కడికి వెళ్లినా నల్లజెండాలే ఎదురైనాయి వారికి.

పంజాబ్ కేసరి లాలా లజపత్‌రాయ్‌ని లాహోర్‌లో పోలీసులు కొట్టారు. లక్నోలో బహిష్కరణోద్యమానికి నాయకత్వం వహించిన శ్రీ జవహర్‌లాల్ నెహ్రూకు లాఠీదెబ్బలు తగిలాయి. అలాగే పండిత గోవిందవల్లభ పంత్, శ్రీ ప్రకాశంపంతులుగారికికూడా.

మద్రాసులో ఆంధ్రకేసరి ప్రకాశం పంతులుగారు పోలీసులు ఎక్కుపెట్టిన తుపాకులకు తన ఛాతీ ఎదురొడ్డి నిలిచారు. లక్నోలోని కైజర్‌బాగ్‌లో కమీషన్ సభ్యులకు స్థానిక భూస్వామ్య వర్గం విందుచేసిన సందర్భంలో—పోలీసులు ముందుజాగ్రత్త చర్యలు ఎన్ని తీసుకున్నప్పటికీ "సైమన్ వెనక్కి వెళ్లిపో", "ఈ దేశం మాది" అనే నినాదాలు రాసిన నల్లరంగు రబ్బరు బెలూన్లు, గాలిపటాలు ఆకాశంలో అసంఖ్యాకంగా ఎగిరాయి.


ఒక గొడుగు క్రింద నిలబడివున్న లాలా లజపత్‌రాయ్‌ని ఒక ఆంగ్ల అధికారి ఛాతీమీద చేతికర్రతో కొట్టి నానా హింసలపాలు చేశాడు. తరువాత కొలది రోజుల్లోనే ఆయన మరణించారు. ఆయన మరణవార్త దేశంలోని యువక రక్తాన్ని ఉడికింపజేసి, యువకుల హృదయాలలో విప్లవ చైతన్యం వెల్లువలై పారింది. "భారత దేశంలో రవి వెలిగినంతకాలం లాలాజీవంటి వారికి మృత్యువు లేద"ని గాంధీజీ ప్రకటించారు. ఆ తరువాత వరుసగా రోజురోజు లక్నోలో జరిగిన బహిష్కరణోద్యమ ప్రదర్శనలను భావిభారత ప్రధానమంత్రి శ్రీ నెహ్రూ అగ్రశ్రేణిలో నిలిచి స్వయంగా నడిపారు. అశ్విక పోలీసుదళం, మామూలు పోలీసుదళంవారు లాఠీలతో, చేతిబెత్తాలతో చెదరగొట్టే సందర్భంగా నెహ్రూకు దెబ్బలు తగిలాయి. మద్రాసులో 'సైమన్ వెనక్కి వెళ్ళిపో' అనే నినాదాలు చేసిన ప్రదర్శకుల మీద పోలీసుకాల్పులు జరిపినప్పుడు ఒక వ్యక్తి మరణించి నడిరోడ్డుమీద పడిపోయాడు. హైకోర్టు ఆవరణకు ఎదురుగావున్న భవనాల పై అంతస్థులమీద నుండి ప్రజలు రోడ్డుమీది శవాన్ని చూస్తూవున్నారు. అక్కడికి ప్రకాశంగారు వచ్చేటప్పటికి ఆంగ్ల సైనికులు తుపాకులు ఎక్కుపెట్టి, హైకోర్టు, ఆర్మీనియన్ వీధికి మధ్యగా, వరుసల్లో అడ్డంగా నిలబడివున్నారు. సైనికుల వరుసల్లోకి తోసుకొని వెళ్ళి ప్రకాశంగారు శవం దగ్గరకు తానువెళ్లడానికి దారి యివ్వమని కోరారు. "వీల్లేదు" అన్నారు సైనికులు. ఒక సైనికుడు తుపాకీని ప్రకాశంగారి గుండెకు ఎక్కుపెట్టి "కదిలావా, కాలుస్తాం" అని బెదిరించాడు. ఆయన ప్రక్కనేవున్న ఒక మహమ్మదీయ యువకుడు, "కాల్చండి దమ్ములుంటే! మేమందరమూ ఆయనతో వస్తాం. ఆయన ఎవరో తెలుసా?" అని అరిచాడు. ప్రకాశంగారు తనఛాతీ చూపించారు. "కావలిస్తే కాల్చండి" అని గర్జించింది ఆంధ్రకేసరి. సైనికులు ప్రక్కకు తొలగి ఆయన వెళ్ళడానికి దారియిచ్చారు.

హైదరాబాదులో జరిగిన రిపబ్లిక్ దినోత్సవ విన్యాసాలలో గవర్నరు శ్రీ ఖండూభాయ్‌దేశాయి వందన స్వీకారం చేశారు. ఆ సందర్భంగా ప్రసంగిస్తూ, హింసాకాండను విసర్జించి, రాష్ట్రంలో సాధారణ ప్రశాంత పరిస్థితులు నెలకొల్పడంలో తోడ్పడవలసిందని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రపతి తరఫున రాష్ట్ర ప్రభుత్వ నిర్వహణ బాధ్యతను స్వీకరించిన సందర్భంగా ప్రసంగిస్తూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎంతటి క్లిష్టమైన రాజకీయ సమస్యలనైనా, "చర్చలు, సంప్రదింపులు, అవగాహన"లు ఆధారంగా పరిష్కరించుకో వలసిన ఆవశ్యకతను గురించి గవర్నరు నొక్కిచెప్పారు.

గవర్నరు సలహాదారు శ్రీ హెచ్. సి. సరీన్ కూడా ప్రభుత్వం ప్రస్తుతం చేస్తున్న ప్రయత్నం మేరకు రాష్ట్రంలో మామూలు ప్రశాంత పరిస్థితులు తిరిగి నెలకొల్పుకో వలసిన అవసరాన్ని గురించి వివరించారు.

రాష్ట్రపతి శ్రీ వి.వి. గిరి, ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ, సమస్య పరిష్కారానికై హింసాత్మక చర్యలకూ, పబ్లిక్ ఆస్తుల విధ్వంస కాండకూ దిగడాన్ని గర్హించారు. ప్రశాంత పరిస్థితులలో, హేతుబద్ధమైన చర్చలద్వారా పరిష్కారాలు సాధించుకో వచ్చునని వారుభయులు సూచించారు. ఆందోళనలో నష్టపడిన వారిపట్ల తమ సానుభూతిని ప్రకటించారు.

—పి.వి.ఆర్.



రిపబ్లిక్ దినోత్సవ సందర్భంగా

# ఆంధ్రప్రదేశ్ ప్రజలకు రాష్ట్రపతి విజ్ఞప్తి

రాష్ట్రపతి శ్రీ వి. వి. గిరి రిపబ్లిక్ దినోత్సవ సందర్భంగా ఆకాశవాణి ద్వారా ప్రసారం చేసిన తమ సందేశంలో ఆంధ్రప్రదేశ్ లోని ప్రస్తుత పరిస్థితులను గురించి ప్రస్తావించి, ఇలా అన్నారు:

"ఆంధ్రప్రదేశ్ లో ఇప్పటి పరిణామాలు నాకు తీవ్రమైన ఆందోళనను కలిగిస్తున్నవి. ముల్కీ సమస్యవల్ల ప్రజలలో ఇరుపక్షాలవారిలో సహజమైన ఆవేశాలు కలగడం బహుశః అనివార్యం కావచ్చు. కాని మనది బాధ్యతా యుతమైన ప్రజాస్వామిక వ్యవస్థ. దీనిలో గట్టిగా మన లక్ష్యాన్ని ప్రకటించడానికి ప్రజాస్వామిక విధానం ఒక్కటే ఏకైక మార్గం. ఆంధ్రలోగానీ అస్సాంలోగానీ దేశంలో మరే ప్రాంతములోగానీ, హింసాకాండ, ప్రభుత్వ ఆస్తుల విధ్వంసం వల్ల ఏ సమస్యా పరిష్కారం కాదు. పైగా అట్టి చర్యలు అసంతృప్తి, ద్వేషాలను రేకెత్తించి, అసలు లక్ష్యసాధనకే అవరోధంగా పరిణమించగలవు. ఇటువంటి పనులు దేశ శ్రేయస్సుకు హానికరమైనవని నేను పదే పదే అంటిస్తూనే వున్నాను.

ఆంధ్ర ప్రదేశ్ లో సాధ్యమైనంత త్వరలో సాధారణ ప్రశాంత పరిస్థితులు నెలకొనడం అవసరం. ఆంధ్ర ప్రదేశ్ భవిష్యత్తుకు సంబంధించి తలయెత్తిన అన్ని సమస్యలనూ అన్ని కోణాలనుంచి జాగ్రత్తగా పరిశీలించవలసిన అవసరం వుంది. వాటిని గురించి చర్చించే సమయంలో ముందుగా ఎట్టి షరతులు మినహాయింపులు లేకుండా, అన్ని అభిప్రాయాలను గురించి స్వేచ్ఛగా, కూలంకషంగా చర్చించుకోవడం అవసరం. మనం అనుసరిస్తున్న ప్రభుత్వ వ్యవస్థలో బెదిరింపులు, ఒత్తిడులు, బల ప్రయోగం ద్వారా ఒక నిర్ణయానికి వచ్చే ప్రసక్తి లేనే లేదు. అందువల అన్నిరకాల అభిప్రాయాలను సావధానంగా విని, ప్రశాంతంగా విభేదాలను సర్దుబాటు చేసుకున్నప్పుడే, ఏ సమస్యకైనా సంతృప్తి కరమైన శాశ్వతమైన పరిష్కారం సాధించుకోగలం.

కార్మిక నాయకుడిగా నాకు గల అనుభవాన్ని బట్టి, దస్పలకు సంబంధించినంత వరకు తుదిమాట అంటూ ఏదీలేదని దృఢంగా చెప్ప గలను. చాలా కాలంగా యిదే నా నిశ్చితమైన అభిప్రాయం. విశ్వాసంతో కూడిన పరిష్కారేచ్ఛ వుంటే పరిష్కార మార్గం సాధించగలమనే నా నమ్మకం. ఈ విషయంలో మన ప్రజల విజ్ఞత పట్ల కూడా నాకు దృఢమైన విశ్వాసం వున్నది.

# ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్రపతి పాలన



గవర్నరు


**శ్రీ ఖండూభాయి కె. దేశాయి**



సలహాదారు


**శ్రీ హెచ్. సి. సరీన్**

శ్రీ పి. వి. నరసింహారావు మంత్రివర్గం రాజీనామా కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో 1973 జనవరి 18 వ తేదీన రాష్ట్రపతి పాలన ప్రవేశ పెట్టారు. రాష్ట్రపతి తరఫున గవర్నరు శ్రీ ఖండూభాయి కె. దేశాయి ప్రభుత్వ పదవీ బాధ్యతలు స్వీకరించారు.



సలహాదారు

**శ్రీ వి. కె. రావు**



ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి

శ్రీ ఎన్. భగవాన్‌దాస్



ప్రభుత్వోద్యోగులు, డాక్టర్లు, లాయర్లు, విద్యార్థులు, ఉపాధ్యాయులు మొదలగు వివిధ వర్గాల ప్రజలను ఉద్దేశించి

# గవర్నరు విజ్ఞప్తి

**రాష్ట్ర గవర్నరు ఖండూభాయి కె. దేశాయి ఆకాశవాణి హైదరాబాదు కేంద్రంనుంచి 1973 జనవరి 18వ తేదీన సాయంత్రం 7-30 గంటలకు చేసిన రేడియో ప్రసంగం పూర్తి పాఠం.**

మిత్రులారా :

కొద్దిసేపటి క్రితం రాష్ట్రపతి ఆంధ్రప్రదేశ్ పరిపాలనను స్వీకరించారు. ఆంధ్రప్రదేశ్ శాసన సభ సస్పెండ్ అయి వుంటుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహిస్తున్న సకల విధులూ, రాజ్యాంగం అనుసరించి గవర్నరుకు ఉన్న సకల అధికారాలూ ఇప్పుడు రాష్ట్రపతి స్వీకరించారు. రాష్ట్రపతి అజమాయిషీ, పర్యవేక్షణ, ఆదేశాల ప్రకారం ఈ విధులూ, అధికారాలూ నేను నిర్వహించాలని కూడా రాష్ట్రపతి ఆదేశించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో ఇప్పుడున్న గడ్డు పరిస్థితి కుదుట పడుతుందనీ, రాష్ట్రం ఎదుర్కొంటున్న తీవ్రమైన దీర్ఘకాలిక సమస్యలను నిర్మాణాత్మకంగా ఒకరి అభిప్రాయాలు మరొకరు చెప్పుకోవడం సాధ్యమయ్యేలాగున ఒడుదుడుకులు లేని శాంతియుత వాతావరణంలో పరిశీలించవచ్చుననీ, గట్టిగా ఆశించి, నా సలహాపై రాష్ట్రపతి ఈ చర్య తీసుకున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ప్రాంతాలలోను కరువు పరిస్థితిని, మంచి నీరు, పశుగ్రాసాల కొరతనూ, మనదృష్టి మరోవైపు మరలిపోకుండా, ఎదుర్కొనవలసి వుంటుంది. సహాయ కార్యక్రమాలు అమలు జరిపే పని మందగించడానికి వీలులేదు. గ్రామీణ ప్రాంతాలలో పనులను స్తంభింపజేసేటట్టు నాన్‌గెజిటెడ్ ఉద్యోగులు ఇటీవల సాగించిన సమ్మెవల్ల ఇప్పటికే సహాయ కార్యక్రమాలకు విఘాతం కలిగింది. ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జీవన రంగాలలో ప్రజలకు చాలావరకు అసౌకర్యం కూడా కలిగించింది.

రాజకీయ సమస్యలన్నింటిని ప్రజా ప్రతినిధులకూ వారి నాయకులకూ పరిష్కారం కోసం వదలివేసి, వెంటనే పనులలో చేరవలసిందిగా ప్రభుత్వ ఉద్యోగులందరికీ హృదయ పూర్వకంగా విజ్ఞప్తి చేస్తున్నాను.

విజ్ఞులైన న్యాయవాదులు మొదలైన వృత్తుల వారందరినీ, ఆందోళన మార్గాన్ని వదలి, వృత్తి ధర్మాలను తిరిగి చేపట్ట వలసిందిగా కోరుతున్నాను.

డాక్టర్లు, ఇతర సిబ్బందీ మిగతా ఇతర విషయాలకంటే, ప్రాణాలను కాపాడటం, చికిత్స చేయడం, వ్యాధులను అరికట్టడం ప్రథమ కర్తవ్యంగా పరిగణిస్తారన్న గౌరవం వారికి వున్నది. ఆస్పత్రులు, ఇతర చికిత్సాకేంద్రాలలో వారు లేకపోవడంవల, అత్యవసరంగా వైద్య సహాయం కావలసిన అమాయకులు ఎంతో బాధపడ్డారు. వారు కూడా తిరిగి తమ వృత్తిధర్మాలను స్వీకరించడంలో ఇక ఎంతమాత్రం ఆలస్యం చేయకూడదు. విద్యార్థులకు విలువైన కాలం ఎంతగానో వ్యర్థమైంది. చదువులు దెబ్బతిన్నాయి. ఉపాధ్యాయులు, విద్యార్థులు కూడా విద్యా వ్యాసంగంలోకి తిరిగి రావాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ సమస్యలు, అవి ఎంత క్లిష్టమైనవైనప్పటికీ, చర్చలూ, సమాలోచనలూ, అవగాహనల ద్వారా పరిష్కరించుకోవలసి వుంటుంది. ఆంధ్రప్రదేశ్ నిస్సందేహంగా, అనేక జటిలమైన సమస్యలను ఎదుర్కోవలసి వుంది, సంప్రదింపుల ద్వారా, సుస్థిరమైనవీ, సరైనవీ పరిష్కార మార్గాలను సాధించవచ్చునని నేను మనస్ఫూర్తిగా ఆశిస్తున్నాను. చర్చలూ, సమాలోచనలు సాగించే ఈ పద్ధతి ఇప్పుడు ప్రారంభం కావాలి. రాష్ట్ర పరిపాలన బాధ్యతను స్వీకరించడం ద్వారా రాష్ట్రపతి తమ ఈ చర్య ఉద్రిక్తతల్ని సడలిస్తుందనీ, రాష్ట్రాన్ని ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపట్ల నిర్మాణాత్మకంగా వ్యవహరించడానికి అవకాశం కలుగుతుందనీ హృదయ పూర్వకంగా ఆశిస్తున్నారు.

స్వాతంత్ర్యం కోసం జరిగిన జాతీయ ఉద్యమాలలో అందరికంటే ముందు నిలబడే మహోజ్జ్వల సంప్రదాయం ఆంధ్రప్రదేశ్‌ది. తెలుగు గడ్డపై జన్మించిన అనేకమంది ప్రముఖులు దేశం అంతటా వివిధ రంగాలలో విశిష్టమైన స్థానాలు సంపాదించుకొన్నారు.

గతకాలపు ఉదాత్త సంప్రదాయాలు, జటిలమైన సమస్యలకు ఆమోదయోగ్యమైన పరిష్కారాలు సాధించడంలో ఆంధ్రప్రదేశ్ నాయకుల ప్రతిభా సామర్థ్యాలు మీ అందరికీ తెలిసే ఉండవచ్చు.

తిరిగి సాధారణ పరిస్థితులనూ, శాంతినీ నెలకొల్పడంలో ఇక ఇప్పుడు సముచితమైన పాత్ర వహించాలని ఆంధ్రప్రదేశ్ ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాను.

ఆందోళన మార్గాన్ని అనుసరిస్తున్న వారందరూ ఇప్పటికే ఎంతో హాని జరిగిందనీ, ఎన్నో కష్టాలు కలిగాయనీ గమనించవలసిందిగా కోరుతున్నాను. ఇప్పుడిక అటువంటి పద్ధతులకు స్వస్తి చెప్పాలి. న్యాయవంతమైన రాజకీయ మార్గాలలో సమగ్ర కృషి పరిపూర్ణంగా సాగేటట్టు దోహదం కావాలి.

---



జననం — 3.8.1900

మరణం — 25.12.1972

# స్వాతంత్ర్య యోధుడు

# శ్రీ కాకాని నిర్యాణం

శ్రీ కాకాని వెంకటరత్నంగారు 1900 సంవత్సరం ఆగస్టు 3వ తేదీన కృష్ణాజిల్లా గన్నవరం తాలూకా ఆకునూరు గ్రామంలో రైతు కుటుంబంలో జన్మించారు.

దేశ స్వాతంత్ర్యం కోసం జరిగిన పెక్కు పోరాటాలలో ఆయన వీరోచిత పాత్ర వహించి "ఉక్కు కాకాని" "వీర కాకాని" అని ప్రజలచే కీర్తింపబడ్డారు.

అర్ధశతాబ్దంగా శ్రీ కాకాని వెంకటరత్నం కాంగ్రెసు సంస్థకు తన శక్తి సామర్థ్యాలను అంకితం చేశారు. 1924 లో ఆయన తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. ఆ సంవత్సరంలో కాకినాడలో జరిగిన కాంగ్రెసు మహాసభకు హాజరయ్యారు. 1930 లో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని రెండున్నర సంవత్సరాల కారాగార శిక్ష అనుభవించారు.

పశ్చిమ కృష్ణాజిల్లా కాంగ్రెసు కమిటీకి 1937–40 సంవత్సరాల మధ్య కాలంలో శ్రీ కాకాని ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించారు. మునగాల, లింగగిరి పరగణాల ప్రాంతంలో జరిగిన జమీందారీ రైతుల ఉద్యమంలో ప్రముఖపాత్ర వహించారు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నందుకు 1942లో మరొకమూడు సంవత్సరాల కారాగార శిక్ష అనుభవించారు.

1946 లో ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు కమిటీ శ్రీ కాకాని వెంకటరత్నం గారిని పశ్చిమ కృష్ణా డి. సి. సి కి స్పెషల్ ఆఫీసరుగా నియమించింది.

1967లో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షులయ్యారు.

1955లో శ్రీ కాకాని కృష్ణాజిల్లా ఉయ్యూరు నియోజకవర్గం నుంచి ఆంధ్ర శాసనసభకు ఎన్నికయ్యారు. 1962లో ఆంధ్రప్రదేశ్ శాసనసభకు ఎన్నికయ్యారు. 1967 మేలో గన్నవరం నియోజకవర్గం ఎన్నికలో పోటీచేసి శాసనసభకు ఎన్నికయ్యారు. ఆఖరుసారిగా 1972 లో తిరిగి ఉయ్యూరు నియోజకవర్గం నుంచి జనరల్ ఎన్నికలలో పోటీచేసి గెలిచారు. శ్రీ బ్రహ్మానందరెడ్డి క్యాబినెట్‌లో 1969 జూలై 19వ తేదీన వ్యవసాయ మంత్రిగా పదవీస్వీకారం చేసారు. ఆ తర్వాత శ్రీ పి.వి. నరసింహారావు క్యాబినెట్‌లో వ్యవసాయ మంత్రిగా కొనసాగారు.

## ముల్కీ నిబంధనల బిల్లుపై చర్చకు

# ప్రధానమంత్రి సమాధానం

### ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరా గాంధీ లోకసభలో 1972 డిసెంబరు 21 తేదీన ముల్కీ-నిబంధనల బిల్లును గురించి చేసిన ప్రకటన

అధ్యక్షమహాశయా,

నా సహచరులైన శ్రీ చవాన్ ముఖ్యమైన అంశాలన్నింటిని గురించి ప్రసంగించి సభలో ప్రశాంత వాతావరణం ఏర్పరచిన పిమ్మట, నిజానికి నేను ప్రత్యేకించి మాట్లాడవలసిన అవసరం అంతగాలేదు. కాని లోగడ సభలో ప్రసక్తికి వచ్చిన కొన్ని అంశాల విషయంలో నేను స్పష్టంగా వివరించని పక్షంలో, అపార్థాలకు తావు ఏర్పడే అవకాశం వున్నదని ప్రతిపక్షానికి చెందిన కొందరు గౌరవ సభ్యులు ముందుగానే నాతో అన్నారు. ఆ అంశాలు క్రొత్తవేమీ కావు. అయినా, నేను వాటిని గురించి ప్రకటన చేయడం మంచిదని వారు అభిప్రాయం వెలిబుచ్చారు. అందుచేత నేను ఇపుడు ప్రసంగించవలసి వచ్చింది.

పార్లమెంటులో అనేక ప్రధానాంశాలనుగురించి చాలా ఆవేశ పూరితములైన చర్చలు జరుగుతూ వుంటాయి. ముల్కీ సమస్య కూడా అటువంటి వాటిలో ఒకటిగా పరిణమించింది.

### ప్రశాంత వాతావరణంలోనే పరిష్కారం

అనేక ఇతర దేశాలలో మాదిరే, మన దేశంలోకూడా ప్రాంతీయ భావాలతో ముడిపడిన విషయాలు ప్రజలలో ఉద్రేకాలను రెచ్చగొడుతూ వుంటాయి. ప్రజలలో ప్రబలిన ఉద్రేకాలను మనం నిర్లక్ష్యం చేయడానికి వీలులేదు. అయితే ఇదివరకు శ్రీ చవాన్ గారు చెప్పినట్లు, వాతావరణం అతి ఉద్రేకపూరితమై ఉన్న సమయంలో సమస్యలకు పరిష్కారం కనుగొనడం సాధ్యం కాదు. ప్రశాంత వాతావరణంలో హేతుబద్ధమైన విధానాల ద్వారానే సమస్యలకు పరిష్కారం కనిపెట్టవలసి వుంటుంది.

సభ్యులు వెలిబుచ్చిన ఉద్రేకాల వల్లనూ, తెలంగాణా ఆంధ్ర ప్రాంతాలకు చెందిన మిత్రులు ఎదుర్కొంటున్న ఇబ్బందుల వల్లనూ. ఇతర సభ్యులమాదిరి నాపైనకూడా ఎంతో ప్రభావం పడింది. నేనూ మానసికంగా బాధపడ్డాను. ఐనా ఈ పరిస్థితిని మనం ఉద్రేకంగాకాక శాంతియుతమైన ఉమ్మడి పరిష్కార దృక్పథంతో పరిశీలించాలనీ, ఆ పరిష్కారం నేటికొరకో రేపటికొరకో కాక రాబోయే దశాబ్దాన్ని, రెండు దశాబ్దాలను, శతాబ్దాన్ని దృష్టిలో పెట్టుకొని రూపొందించాలనీ వినయ పూర్వకంగా విజ్ఞప్తి చేస్తున్నాను.

ఈ సభలో కొన్ని ఉద్యోగాలకూ, తదితర విషయాలకు సంబంధించి మీరు చర్చలు జరుపుతున్నారు. ప్రత్యేకంగా నాతో కూడా వాటిని గురించి చర్చించారు. అయితే శ్రీ చవాన్‌జీ అన్నట్లు, యిది వాస్తవంగా ప్రజల జీవితాలకు సంబంధించిన సమస్యేనా? కాదు. ఈ నాడు మనం తీవ్రమైన నిరుద్యోగ సమస్యను యెదుర్కొంటున్నాం. ఈ నిరుద్యోగ సమస్య దేశమంతా వ్యాపించి వుంది. మన దేశంలోనే కాదు. ప్రపంచంలో దాదాపు ప్రతి దేశంలోనూ ప్రస్తుతం ఈ సమస్య తప్పకుండా వుంది. మన సమకాలిక సమాజంలోని లక్షణాలలో యిదీ ఒకటి మన లోపాలనూ, యిబ్బందులనూ, కప్పిపుచ్చడానికి గాని వాటి బాధ్యత నుండి తప్పించుకోడానికిగాని నేనీమాట చెప్పడం లేదు. మనం దృఢ నిశ్చయంతో యెదుర్కోవలసిన సమస్య యిది. అందువల్లనే ఈ సమస్య యింతగా ఆవరించి పెద్ద యెత్తున తయారైంది.

ప్రజలవద్దకు వెళ్ళి "దీనివల్ల మీ ఉద్యోగావకాశాలు దెబ్బతింటున్నవి. మీ హక్కు హరించుకొని పోతున్నది" అని చెప్తే సహజంగా వారు ఉద్రేక పూరితులవుతారు. ఎవరికైనా ఆవేశం వస్తుంది. "మనం కూచోని దీన్ని గురించి తాపీగా ఆలోచించుకుందాం. ఉద్యోగావకాశాలు, యితర అవకాశాల విషయంలో తెలంగాణా ప్రాంత ప్రజలకూ, ఆంధ్ర ప్రదేశ్ లోని యితర జిల్లాల ప్రజలకూ ఎంతవరకు దీనివల్ల హాని కలుగుతున్నదో ఆలోచించు కుందాం" అని ప్రజల వద్దకు వెళ్ళి చెప్పినవారు యెంత మంది వుంటారు? అనేదే నా సందేహం. కనుక ఈ సమస్యలోని బాగోగులను స్పష్టంగా

సమగ్రంగా అక్కడి ప్రజల ముందు వుంచడం జరిగిందని నేను అనుకోను. అందువల్ల యిప్పుడు ప్రజల్లో వచ్చిన ఆవేశాన్ని ఆ దృష్టితో కూడా చూసి అర్థం చేసుకోవాలి.

## పరిమితమైన సమస్య

ఇప్పుడు జరుగుతున్న చర్చ సోషలిజం గురించి కాదు. మా భారత దేశ క్షేమం గురించి కాదు. ప్రారంభంలో ప్రసంగించిన గౌరవ సభ్యులు కొందరు యీ విషయాల ప్రసక్తి తెచ్చారు. ఇది చాలా పరిమితమైన సమస్య; చాలా స్వల్పమైన సమస్య. ఇది కేవలం ముల్కీ నిబంధనలు, వాటివల్ల ఏర్పడిన పరిస్థితికి మాత్రమే సంబంధించిన సమస్య. ఈ విషయంలో యేమీ జరగలేదని కొంతమంది గౌరవ సభ్యులు అన్నారు. చాలా జరిగిందనే నేను సవినయంగా మనవి చేస్తున్నాను. మనకు సంతృప్తికరమైనంత కాకపోయి నప్పటికీ, కొంతవరకు నిజమైన ప్రశాంత పరిస్థితి నెలకొంటూ ఉన్నది; పరిస్థితి మెరుగుపడుతూ ఉన్నది. ఎంతో మెరుగైందని నేను చెప్పడంలేదు. కాని మెరుగుపడే దిశగా పురోగమిస్తూ ఉన్నదనేది యథార్థం. అలాంటి పరిస్థితిలో అకస్మాత్తుగా ముల్కీ నిబంధనలను గురించిన తీర్పు రాగానే, సర్వత్రా మళ్ళీ నిప్పు అంటుకొన్నట్లయింది. అసలు ముల్కీ నిబంధనల సమస్య ఏవిధంగా ఉద్భవించింది? ఆ కాలపు స్వదేశీ సంస్థానాలలో హైదరాబాద్ సంస్థానం అన్నిటికంటే పెద్దది. ఆ సంస్థానంలో మహోన్నత సంస్కృతిగల వ్యక్తులు, కుటుంబాలు వుండినాయని ఒక గౌరవనీయ సభ్యుడు చర్చ సందర్భంగా అన్నారు. కానీ అసంఖ్యాక సామాన్య ప్రజానీకం మాత్రం దారిద్ర్యంలో మునిగి తేలుతుండేవారు. విద్య, సాంఘిక సంక్షేమ విషయాల్లో గానీ ప్రజారోగ్య విషయంలో గానీ జీవన పరిస్థితులు మెరుగు పరచడంలో గానీ ఆ సంస్థాన ప్రజలకు ఏ విధమైన అవకాశాలు వుండేవి కావు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అవతరించిన సందర్భంలోనే, ప్రజలందరూ కలిపి మెలిసి జీవించడానికి కొన్ని తాత్కాలికపు ఏర్పాట్లు అవసరమనే విషయం ప్రజల్లో అన్ని వర్గాలవారూ గుర్తించారు. ఆ నాడు ప్రజానాయకులు ఏకగ్రీవంగా నిర్ణయించుకుని ఒక పెద్దమనుషుల ఒప్పందం కుదుర్చుకున్నారు. దానిని మనం అందరం అంగీకరించాము.

## వెనుకబడిన ప్రాంతా

ఏలాంటి ఒప్పందాలు చేసుకున్నప్పటికీ, అభిప్రాయభేదాలు, అసమానత్వాలు అంటూ వుండనే వుంటాయి. ఒక కుటుంబంలోనే యిలాంటివి వుండడం మనందరికి తెలిసిన విషయమే. వెనుకబడిన ప్రాంతాలు లేని రాష్ట్రం మన భారత దేశంలో లేదు. అయితే కొంతవరకు అభివృద్ధి చెందిన ప్రాంతాలు అన్ని రాష్ట్రాలలోనే కాదు. ఒకే ప్రాంతంలోనే యిలాంటివి కొన్ని వున్నాయి. ఆంధ్ర ప్రాంతంలోనే, రాయలసీమ, శ్రీకాకుళం మున్నగు కొన్ని వెనుకబడిన ప్రాంతాలు వున్నాయని చాలామంది సభ్యులు చెప్పారు. తెలంగాణా వెనుకబడిన ప్రాంతమే. అయితే అందులోకూడా అభివృద్ధి చెందిన కొన్ని ప్రాంతాలు వున్నాయి.

ఒక ప్రాంతానికంటే మరొక ప్రాంతం వెనుకబడివున్నదనే కారణంపైన తీవ్రమైన, తిరుగులేని నిర్ణయాలు తీసుకోవడం సబబు కాదు. ఇలాచేస్తే దీనికి అంతు ఏమిటి? ఒకరిని చూసి మరొకరు ఇలా చేసే అవకాశం వున్నదని నేను భయపడడం లేదు. అసలు విషయం యిదికాదు. ఏ ప్రమాణాన్ని బట్టి జరగాలి? ప్రతిజిల్లా దేనికదే వేర్పాటు కావాలా? ఉత్తర ప్రదేశ్‌ను విభజించవలసిందిగా కొందరు చెప్పారు. విభజన ఎక్కడెక్కడ జరగాలి. ఎన్ని ప్రాంతాలుగా విభజించాలి? ఒకటా, రెండా, మూడా, నాలుగా, ఎన్ని? వెనుకటి చిన్న చిన్న రాష్ట్రాలు, సంస్థానాలు ఇప్పుడు ఏర్పడాలంటారా? తిరిగి అప్పటి పరిస్థితులు నెలకొనాలా? కాబట్టి దీనికి ఒక చోట అంతు అంటూ ఉండాలి. కేవలం వెనుకబడిన ప్రాంతంగా వున్నదనే కారణంపైననో మరో కారణంపైననో ఏదో ఒక చర్య తీసుకోవాలని చెప్పడం సమంజసం కాదు. ఆర్థికంగా వెనుకబడిన తనం పోవాలంటే శ్రీ చవాన్ చెప్పినట్లు, జాతి యావత్తూ కష్టించి పనిచేయడం, శాయశక్తులా కృషిచేయడం ఎంతైనా అవసరం.

ఏదో ఒక ప్రాంతంగానీ ఏదో ఒక వర్గంగాని ప్రత్యేకమైన ఇబ్బందులకు గురిఅవుతూ వున్నట్లయితే, ఆ ప్రాంతంపట్ల, ఆ వర్గం పట్ల ఎప్పుడూ సానుభూతి సదవగాహన వుండనే వుంటుంది. అంతే కాని, వెనుకబడినతనం పేరుతో స్వార్థ ప్రయోజనాలు పెంపొందించుకోవడానికి వీలులేదు. వాస్తవానికి యిది అన్ని చోట్ల వుండే సమస్యే. పేదరికమనే విస్తృత సమస్యలో ఇది ఒక భాగం. దీనిని సత్వరం పరిష్కరించడం కష్టసాధ్యమని నేను భావిస్తున్నాను.

అభివృద్ధి జరుగుతున్న తొలిదశలో అవసరమైన వనరులు సమకూర్చడం సులభంకాదు. మొత్తంమీద అభివృద్ధి స్థాయి చాలా తక్కువగా వుండడమే ఇందుకు కారణం. అటువంటి సందర్భంలో మరొక సమస్య తల ఎత్తినట్లయితే పరిస్థితి మరింత క్లిష్టమౌతుంది. మూడవ, నాల్గవ ప్రణాళికలలో ఈ విషయమై తగు కృషి జరిగింది. జాతీయ అభివృద్ధి మండలి చేసిన సిఫారసుల ప్రకారం, ఆర్థిక సహాయం చేసే పబ్లికు సంస్థలద్వారా 225 జిల్లాలను కొన్ని రాయితీలపై ఆర్థిక సహాయం సమకూర్చడానికి ఎంచుకున్న సంగతి సభవారికి విదితమే. ఈ జిల్లాల్లో ఆంధ్రప్రాంతంలోని జిల్లాలూ, తెలంగాణా ప్రాంతంలోని జిల్లాలు కూడా వున్నాయి.

## సరియైన దృక్పథం

ఐదవ ప్రణాళికలో కనీస అవసరాలను సమకూర్చే భారీ కార్యక్రమాన్ని చేపట్టాలని మన సంకల్పం. ఈ కార్యక్రమ వివరాలను గురించి నేను ఇప్పుడు చర్చించదలచలేదు. వీటిలో కొన్ని విషయాలు మీకు యిదివరకే తెలుసు, మరికొన్ని మీకు త్వరలోనే తెలియగలవు. సరియైన పరిష్కారానికి ఇదొకటే మార్గం చారిత్రిక కారణాలవల్లకానీ లేక యితర కారణాలవల్లకానీ. కొన్ని ప్రాంతాలలో మార్పుకు దోహదంచేసే చర్యలు తీసుకోవడం అవసరంకావచ్చు. అయితే, ఈ సమస్యనూ, దాని పరిష్కార అవకాశాలనూ మనం సరియైన దృక్పథంలో పరిశీలించాలి. ముల్కీ

నిబంధనల బిల్లు గురించి స్థూలంగా కొన్ని అంశాలను మాత్రం చెప్పదలచాను. ముల్కీ నిబంధనలను రద్దుచేయడానికి సంకల్పించిన 1957వ సంవత్సరపు ప్రభుత్వోద్యోగాల (నివాసార్హత) చట్టంలోని 2 విభాగం చెల్లదని సుప్రీంకోర్టు తీర్పు యిచ్చింది. ఇది చాల క్లిష్టపరిస్థితి. ఇట్టి క్లిష్టపరిస్థితి ఇదివరకుకూడ ఏర్పడింది. ఈలోగా అనేక సంఘటనలు జరుగుతూనేవున్నాయి. ముల్కీ నిబంధనలు చెల్లవనే తీర్పుకూడా వచ్చింది. ఆ విధంగా పరిస్థితి నిలకడగా లేకుండా మారుతూవచ్చింది. దీనివల్ల పరిస్థితి మరింత జటిలమైపోయింది. అన్ని స్థాయిలలోని రాష్ట్ర ప్రభుత్వోద్యోగాలకూ ముల్కీ నిబంధనలు వర్తింపజేసే ప్రాతిపదికతో పరిపాలనా నిర్వహణ జరగడం సాధ్యంకాదు. కొన్ని ఉద్యోగాలలో లోగడ జరిగిన నియామకాలను చెల్లుబడిచేయడంకూడా అవసరమౌవుంది. ప్రతిపక్షానికి చెందిన మిత్రుడు ఈ విషయంలో ఆదుర్దా వ్యక్తంచేశారు. నియామకాలను తిరగదోడి ఉద్యోగాలలో తిరిగి చేర్చుకోవడం అవుతుందని ఆయన భావించారు. ఇది సరికాదని నేను స్పష్టం చేయదలచాను. దీని వివరాల జోలికి నేను వెళ్లదలచుకోలేదు. అయితే ఆయన ఆందోళన చెందనవసరంలేదు. ప్రభుత్వోద్యోగాలకు సంబంధించి లోగడ తెలంగాణా ప్రజలకుఇచ్చిన హామీలను వారి ప్రస్తుత అవసరాలను మనం పరిశీలించవలసివుంది. ఇచ్చిన హామీలను పాటించకపోవడమనేదేలేదు. వారి సమస్యలపట్ల మనకు అత్యంత శ్రద్ధ ఉన్నట్లు మరొకసారి గౌరవనీయసభ్యులకు హామీయిస్తున్నాను. అయితే ఆ సమస్యల పరిష్కారానికి ఇది మార్గంకాదు. లోగడ నేను చెప్పినట్లు, వేరుపడిపోతామని చెప్పడం యీ సమస్యకు తుది పరిష్కారం కాజాలదు. ఇది ఇతర రాష్ట్రాలకే కాకుండా ఆ ప్రాంతానికి ఆ రాష్ట్రానికి సంబంధించి మరొక బృహత్ సమస్యకు నాంది అవుతుంది.

## సమైక్య రాష్ట్రం

1972 నవంబరు 27వ తేదీన ప్రకటించిన నిర్ణయాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రనాయకుల అభ్యర్థనను పురస్కరించుకొని జరిగినట్టివి. కేంద్రమే ఒక నిర్ణయం తీసుకోవాలని వారంతటవారు కోరారు. ఈ బిల్లుపై పెక్కుమంది సభ్యులు వివిధ అభిప్రాయాలను వెలిబుచ్చారు. కొంతమంది దీనిపై ప్రజాభిప్రాయము సేకరించాలని, మరి కొంతమంది దీనిని సుప్రీంకోర్టుకు నివేదించాలని కూడా అభిప్రాయపడ్డారు. ఎందుకింత తొందర? అని కూడా సభ్యులు ప్రశ్నించారు. రాష్ట్రపరిపాలనా నిర్వహణ తక్షణ ప్రయోజనాల దృష్ట్యానే యీ సత్వరచర్య అవసరమయింది. ఇక ఏ మాత్రం ఆలస్యం జరిగినా, తీవ్రమైన పరిస్థితులు ఏర్పడగలవనే విషయం తెలిసినదే. సమైక్యరాష్ట్రం కొనసాగాలని నేను దృఢంగా విశ్వసిస్తున్నాను. ఒకవేళ రెండు రాష్ట్రాలు వుండి వున్నప్పటికీ, ఈ బిల్లుకు సంబంధించిన పరిస్థితి మారబోదు. ఎందుచేతనంటే బిల్లు ప్రధానంగా జంటనగరాలకూ, మిగిలిన తెలంగాణా ప్రాంతానికి సంబంధించిన సమస్యలకు చెందినటువంటిది. ఆ ప్రజలు ఆ ప్రాంతములోనే ఉండటం మూలాన ఇతర చర్యలు ఏవి తీసుకున్నప్పటికీ ఆ సమస్య తొలగిపోదు. దురదృష్టవశాత్తు గౌరవనీయ సభ్యుల ప్రసంగాలలో కొంతవరకు కోపతాపాలు వ్యక్తమయినాయి. మనకు యెన్ని రాష్ట్రాలువున్నాయి? అనేదికాదు సమస్య. రాష్ట్రాలు వున్నా, యిరుగుపొరుగు ప్రాంతాలవారుగానే ఉండాలి, పరస్పరం అనేక సమస్యలను చక్కబెట్టుకోవలసివుంటుంది. ఈ విషయాలన్నిటిని గురించి క్షుణ్ణంగా ఆలోచించనటువంటివారు వేర్పాటువల్ల ఆ ప్రజలతో ప్రమేయం లేకుండాపోయిందని ఈ సమస్యలనుంచి తప్పించుకున్నామని భావించ వచ్చు. జరిగిన అనుభవాలనుబట్టి చూస్తే యిది సత్యదూరమనే విషయం తెలుస్తుంది.

## రక్షణలు

ప్రభుత్వోద్యోగాలకు ఏ విధమైన నివాసార్హత విధించినా. అది మన రాజ్యాంగంలో పొందుపరచుకున్న సామాన్య పౌరసత్వ లక్ష్యానికి విరుద్ధమౌతుందనే గాఢమైన భావన దేశంలో వుంది. అయితే మన రాజ్యాంగ నిర్మాతలు కొన్ని ప్రత్యేక యిబ్బందులకు గురి అవుతున్న ప్రజలకు వుండిన రక్షణలను ఒకేసారి రద్దు చేయడానికి వీలులేదనే విషయాన్ని గుర్తించారు. రాజ్యాంగపు 35వ అనుచ్ఛేదం ఉద్దేశాలలో ఇదికూడా ఒకటి. అమూల్యమైన రక్షణగా భావించబడుతూ ప్రజల హృదయాలతో ముడిపడిపోయిన ముల్కీ నిబంధనలను ఈ అనుచ్ఛేదం సజీవంగా ఉంచింది. తెలంగాణా ప్రాంతం ఆంధ్రతో సంలీనమైనపుడు కొన్ని విషయాలలో ఈరక్షణ కొనసాగించబడుతుందని ఆంధ్రప్రాంతంవారు హామీలుయిచ్చారు. తరువాత ఇంతకాలంగా ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పడిన ప్రభుత్వాలు, ముల్కీనిబంధనలను గురించి న్యాయస్థానాలు ఏ విధమైన తీర్పులు యిస్తూ వచ్చినప్పటికీ, ఈ సూత్రం అంగీకరిస్తూ వచ్చాయి. కొందరు ఈ యథార్థాన్ని విస్మరించివుండవచ్చు. ప్రస్తుత బిల్లు కొన్ని విషయాలలో ముల్కీనిబంధనలను కొనసాగించడానికీ, వాటిని దశలవారీగా రద్దుపరచడానికీ ఉద్దేశించినటువంటిది. బిల్లులో తెలిపిన గడువులను పొడిగించమని సభవారిని మళ్ళీ కోరే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని స్పష్టం చేస్తున్నాను. ఇదివరకు నేను చెప్పినట్లు. ఒక రాష్ట్రపు మనుగడలో ఐదేండ్లు, ఎనిమిదేండ్ల వ్యవధి అతిస్వల్పమైనట్టిది. రాష్ట్రరాజధాని ఉభయప్రాంతాలకు చెందినట్టిదనే విషయాన్ని గుర్తించి, జంటనగరాలలో, మిగిలిన తెలంగాణా ప్రాంతానికంటే ముందుగానే ముల్కీ నిబంధనలు రద్దు కావాలని కేంద్రప్రభుత్వం నిర్ణయించింది. అంతవరకుగల కాలంలో ఆంధ్రప్రదేశ్‌లో యితర ప్రాంతాలకు చెందిన పౌరులకుకూడా రాజధానిలో ఉద్యోగావకాశాలు కల్పించబడుతున్నాయి. విద్యా సౌకర్యాలు విస్తృతపరచబడుతున్నాయి.

దీనివల్ల తెలంగాణా మిత్రులలో కొన్ని భయసందేహాలు తలయెత్తే అవకాశంవుంది. సుప్రీంకోర్టు కొట్టివేసిన ప్రభుత్వోద్యోగాల చట్టంలో ఐచ్ఛికంగా అంగీకరించబడి పొందుపరచబడిన రక్షణలను యథాతథంగా వుంచడమేకాకుండా, ప్రస్తుతం తలపెట్టిన బిల్లు అంతకుమించి కొంత పురోగమించడానికి కూడా ఉద్దేశించబడినదని నేను వారికి హామీ యిస్తున్నాను.

## సర్వీసుల ప్రాంతీయకరణ

**మన** నిర్ణయాలలో పేర్కొన్న అయిదు అంశాలలో మూడు అంశాలు యీ బిల్లులో చేర్చబడినాయి. మిగిలిన రెండు అంశా

లను గురించి శాసనం చేయవలసిన అవసరంలేదు. ప్రతిపక్షాల వారి నుండి దీన్ని గురించి విమర్శ వచ్చినందువల్ల యీ విషయం స్పష్టం చేయవలసివచ్చింది. సర్వీసుల ప్రాంతీయకరణపథకం విషయంలో యిప్పటికే చాలావరకు పని జరిగింది. త్వరలోనే యీ పథకానికి తుదిరూపం యివ్వబడుతుంది. అప్పుడు రాష్ట్ర ప్రభుత్వం తమ సర్వీసు నిబంధనలలో తగు సవరణలుచేసి, ఈ పథకాన్ని అమలు పరుస్తుంది. మరొక నిర్ణయం హైదరాబాదు-సికిందరాబాదు జంట నగరాలలోని విద్యావకాశాల విస్తరణకు సంబంధించినది. కేంద్ర ప్రభుత్వ విద్యామంత్రిత్వశాఖ యీ విషయం గురించి అప్పుడే రాష్ట్రప్రభుత్వంతో చర్చలు జరిపింది. ఈ చర్చల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం కొన్ని నిర్దిష్ట ప్రతిపాదనలను తయారుచేస్తున్నది. వీటిని సక్రమంగా అమలుపరచడానికి అవసరమైన యంత్రాంగాన్ని యేర్పాటుచేయడం జరుగుతుంది.

ఈ సమస్యాపరిష్కారానికి ప్రయత్నాలు జరుపుతుండగా, కొన్ని యితర విషయాలు వ్యక్తంచేయబడినాయి. తెలంగాణా ప్రాంతానికి ప్రాంతీయ సంఘం కొనసాగడమన్నది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమైక్యతకు భంగకరంగా వుందని తెలియజేయ బడింది. తెలంగాణాకు ప్రత్యేక బడ్జెటు వుండడం గురించి శ్రీ రఘురామయ్య తదితరులు ప్రస్తావించారు. రాష్ట్రంలో తెలంగాణా ఒక్కటే వెనుకబడిన ప్రాంతం కాదనే అంశం కూడా ప్రస్తావించబడింది.

## ప్రాంతీయ సంఘం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అవతరించిన సందర్భంలో, తెలంగాణా ప్రాంతప్రజల ప్రయోజనాలను కాపాడే విషయంలో వారికి చేసిన వాగ్దానాలు సక్రమంగా అమలు జరుగుతాయనే విశ్వాసం కల్పించే ఉద్దేశంతో రాష్ట్ర శాసనమండలి ఈ ప్రాంతీయసంఘాన్ని ఏర్పాటు చేసిందని మీకందరికి తెలిసిన విషయమే. తెలంగాణా అభివృద్ధి కార్యక్రమంలో ఆ ప్రాంత ప్రజలు సన్నిహితంగా పాల్గొనడానికి యిది అవకాశం కల్పించింది.

శ్రీ రఘురామయ్య చెప్పినట్లు బడ్జెటు వాస్తవానికి విడిగా లేదు. వేరు వేరుగా రెండు పత్రాలు వున్నప్పటికీ, అవి ఒకే బడ్జెటులో భాగంగా ఉన్నాయి. అయితే లెక్కలు కట్టి గుణింతాలుచేసి చెప్పడం ప్రధానమైన సమస్య కాదు. మొత్తంమీద ఉన్న ఆర్థిక పరిస్థితే ముఖ్యమైన సమస్య. రాష్ట్ర సమగ్ర సమైక్యతకు అడ్డుగోడలుగా నిలిచివున్న ప్రతిబంధకాలన్నింటినీ తొలగించాలని కోరుతున్నవారి మనోభావాలను నేను అవగాహన చేసుకోగలను. ఈ అడ్డుగోడలన్నీ తొలగిపోయి, ఇలాంటి ప్రత్యేకమైన ఏర్పాట్లకు అవసరంలేని శుభదినం కోసం నేను ఎదురుచూస్తున్నాను. ఆర్థిక వ్యత్యాసాలు అంతరించి పోవడంతో క్రమేణా ఇట్టి పరిస్థితి ఏర్పడుతుంది. ఈ ఏర్పాట్లు కేవలం తాత్కాలికమైనట్టివిగా పరిణామకాలీనమైనట్టివిగా మన రాజ్యాంగం భావిస్తున్నదనే విషయం సభవారి దృష్టికి తెస్తున్నాను. అయితే ఈ లోపుగా రాష్ట్రంలో వెనుకబడిన ఇతర ప్రాంతాల అభివృద్ధికై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. ఈ ప్రాంతాలు సత్వరంగా అభివృద్ధి చెందడం చాలా అవసరం. ఈ సందర్భంలో కొన్ని ప్రత్యేక ఏర్పాట్లు జరగాలని చేసిన సూచనలు కూడ పరిశీలనలో ఉన్నాయి. ప్రజల అభీష్టమే అయినట్లయితే అట్టి ప్రాంతాలకు ఒకటి రెండు ప్రాంతీయ సంఘాలు లేదా అభివృద్ధి మండలులు ఏర్పాటు చేయడానికి మేము పూర్తిగా అంగీకరించడానికి సిద్ధంగా ఉన్నాము. రాష్ట్ర నాయకులతో సంప్రదించిన పిమ్మట దీని వివరాలు రూపొందించవచ్చు.

ఉభయప్రాంతాలకు న్యాయం చేకూర్చే విధంగా, వివిధ పద్దుల క్రింద ఆదాయ వ్యయాలను కేటాయించడంలో ఇప్పుడు అనుసరిస్తున్న పద్ధతులను ఇంకా మెరుగుపరచవచ్చనే అభిప్రాయం కూడా వున్నది. దీన్ని కూడ పరిశీలించవచ్చును. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ సహాయం అవసరమైనట్లయితే తగిన సహాయం చేయడానికి ప్రయత్నిస్తాం. చాలినంతగా వనరులను సమకూర్చడమన్నదే ముఖ్యవిషయం. శ్రీ చవాన్ దేశం మొత్తానికి ఏ మేరకు వనరులు సమకూర్చగలరనే విషయంపైన అది ఆధారపడి వుంది. అవసరమైన వనరులు చిటికలో సమకూర్చి పెట్టడానికి ఆయనవద్ద మంత్ర తంత్రాలు యేవీ లేవు గదా!

ఇందుకు రాష్ట్రం యావత్తు వనరులనూ సమీకరించవలసి వుంటుంది. అభివృద్ధి విషయంలో అసమానత తొలగించడానికి సాధారణంగా ఈ విధానమే అనుసరించబడుతున్నది. ఇందుకొరకు కేంద్ర ప్రభుత్వం చేతనైనంత సహాయం తప్పకుండా చేస్తుందని నేను భావిస్తున్నాను.

శ్రీ ఫ్రాంక్ ఆంథోని అల్పసంఖ్యాక వర్గాలు షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలు గురించీ వారికి రిజర్వేషనులను గురించీ మాట్లాడారు. ఎన్ని రిజర్వేషనులు చేసినా కూడా యెంత చేయాలని ఆశించామో, అంత జగుగలేదనేది సత్యమే. ఇంకా యెన్నో ప్రతిబంధకాలు వుండనే వున్నాయి.

## జాతీయ దృక్పథం

పార్లమెంటు జాతి అభీష్టాన్నీ, సంకల్పాన్నీ ప్రతిబింబింప చేస్తుంది. ఒకానొక పరిస్థితిలో మంచి చెడుగులను పరిశీలించడమే కాకుండా, జాతీయ దృక్పథంతో సమస్యలను పరిశీలించడం కూడా పార్లమెంటు కర్తవ్యమైవుంది. శ్రీ చవాన్ ఈ విషయాన్ని నొక్కి చెప్పారు. నేను కూడా దీన్ని మరొకసారి చెప్పదలచాను. ఇక్కడ వున్న మనమందరమూ ఆ యా నియోజకవర్గాల నుంచి ఎన్నిక అయ్యాం. అయితే అలా ఎన్నికై ఈ సభకు వచ్చినపుడు కేవలం ఏదో ఒక చిన్న ప్రాంతానికి ప్రతినిధులమని గాక, యావద్భారత దేశానికి, సమస్త భారతీయులకు ప్రతినిధులమనే విషయం గమనించాలి. కనుక ప్రతి విషయం ఈ దృక్పథంతోనే పరిశీలించ వలసి వుంటుంది.

## తెనుగుజాతి ప్రాచీన సంస్కృతి

భారతదేశం రాష్ట్రాల సమాఖ్య అని రాజ్యాంగంలోని ప్రప్రథమ అనుచ్ఛేదం ఉద్ఘాటిస్తున్నది. ప్రతిరాష్ట్రానికి చిరంతన

మైన సాంస్కృతిక చారిత్రిక సాంప్రదాయం వుంది. ప్రతి రాష్ట్రమూ ప్రత్యేక రీతిలో రాజకీయంగా అస్తిత్వాన్ని సంతరించుకొన్నది. ఆంధ్ర ప్రదేశ్ వేలాది సంవత్సరాలుగా ఉత్కృష్టమైన సంస్కృతిగల సీమగా పేరుపొందింది. ప్రాచీనకాలపు బౌద్ధగ్రంథాలలో ఆంధ్రుల ప్రస్తావన వుంది. ఆంధ్రప్రదేశ్‌లో యిప్పుడున్న ప్రాంతాలన్నీ గతంలో ఒకప్పుడు చాలాకాలం వరకు ఒకే పరిపాలన క్రింద ఉన్నాయి. కాబట్టి ఒకే పరిపాలన క్రింద లేనివేవో ఒక కాలాన్ని మాత్రమే పరిశీలిస్తే ఉపయోగంలేదు.

## విశాలాంధ్ర

తెలుగు ప్రజల ఈ సుదీర్ఘమైన చరిత్ర తమకు సమైక్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కావాలని దశాబ్దాల తరబడి తీవ్రంగా పోరాటం సాగించడానికి వారిని ఉత్తేజపరిచింది. ఈ సందర్భంలో నా స్వానుభవాన్ని గురించి మీకు చెప్పదలచాను. రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ సంఘం నివేదిక ప్రకటించడానికి పూర్వం దక్షిణ భారతంలోని కొన్ని ప్రాంతాలలో నేను పర్యటించడం తటస్థించింది. అప్పుడు ప్రజలందరూ ముక్తకంఠముతో "విశాలాంధ్ర" కాంక్షిస్తూ చేసిన నినాదాలు ఇప్పటికీ నా చెవుల్లో మార్మ్రోగుతున్నాయి. హైదరాబాదు రాష్ట్రాన్ని యథాతథంగా వుంచాలనే కొందరి ప్రతిపాదన వీగిపోయి యావత్తు తెలుగు ప్రజల అభీష్టమే నెరవేరింది. శ్రీ ఫ్రాంక్ ఆంథోని దీర్ఘోపన్యాసం చేశారు. ఇంతకుముందు కొన్ని సందర్భాలలో భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటులోగల పెద్ద లోపాలను గురించి ఆయన మాట్లాడారు. మన జాతీయ జీవితంలో భాగంగా కొన్ని విషయాలున్నాయి. జాతీయోద్యమంలో భాషా ప్రయుక్త రాష్ట్రాల సమస్య ఒక భాగంగా వుండిన విషయం వాస్తవమే. దీనినుంచి తప్పించుకొనే ప్రశ్నలేదు. అప్పుడున్న పక్షాలలో ప్రతిదానికి అప్పటి రాష్ట్రాలు విభిన్నంగా ఉండినప్పటికి భాషాప్రయుక్త రాష్ట్రాల ప్రాతిపదిక పైననే ప్రాంతీయ విభాగాలు ఏర్పాటయ్యాయి.

## భాషా రాష్ట్రాలు హేతుబద్ధమైనవే

మన రాష్ట్రాలు హేతుబద్ధమైన పద్ధతిపైననే ఏర్పాటు అయ్యాయి. క్షణికోద్రేకాలు పైన హేతువాదం పునాదులను కదలించకుండా మనం జాగ్రత్త పడాలి. మొట్టమొదలు నేను చెప్పినట్లు ప్రజల మనోభావాలను కూడా మనం గమనించాలి. అయితే ప్రభుత్వం ఆవేశాలకు ప్రభావితం కావడం తప్పు. ప్రజలకు ఏది యెక్కువ శ్రేయస్కరమో మనం గమనించాలి. మన ప్రయోజనాలకుగాని లేక భారతదేశంలోని యితర భాగం ప్రయోజనాలకుగాని తెలంగాణా ప్రజల శ్రేయస్సును త్యాగం చేయాలని చెప్పడంలేదు. అయితే ఆ ప్రాంత ప్రజల శ్రేయస్సును ప్రభుత్వం ప్రశాంతంగా ఆలోచించి, వారికి ఏది శ్రేయస్కరంగా వుంటుందో పరిశీలించాలి.

తెలుగు ప్రజలు యథార్థవాదులని పేరెన్నికగన్నారు. దేశ సేవాపరాయణత్వంలో సాటిలేనివారని కూడా కీర్తి ప్రతిష్ఠలు గడించారు. కోస్తా ప్రాంతంలోకాని, రాయలసీమలోకాని, తెలంగాణా ప్రాంతములోకాని నివసించే తెలుగు ప్రజల్లో ఏ ఒక్కరు కూడా చివరకు ఆగ్రహావేశంతోనైనా నిరాశతోనైనా, తమ రాష్ట్ర ప్రయోజనాలకూ, దేశ ప్రయోజనాలకూ భంగకరమైనచర్య ఏదీ తీసుకోరనే విషయంలో నాకు అచంచలమైన విశ్వాసం వుంది. ఇక్కడవున్న మిత్రుల ఉద్రేకాలను నేను అర్థం చేసుకోగలను. అక్కడవస్తున్న పరిణామాలు జరుగుతున్న విషాద సంఘటనలు బాధాకరమైనట్టివి. ప్రాణాలు కోల్పోయినవారి తల్లిదండ్రులకు వారి కుటుంబాలకు నా ప్రగాఢ సంతాపాన్ని తెలుపుతున్నాను. ఈ విషయాన్ని మనం విశాల దృక్పథంతో అర్థం చేసుకోవలసిన ఆవసరం వున్నది. అయితే ఈ బిల్లు ఆ విశాలదృక్పథం గురించి ప్రస్తావించడంలేదు. ఇది కేవలం పరిమిత లక్ష్యం గల బిల్లు. కాని గౌరవనీయ సభ్యులు యితర విషయాలను గురించి ప్రసంగించినందువల్ల నేను కూడా వాటిని గురించి ప్రస్తావించవలసివచ్చింది.

---

ముఖచిత్రం :

రాష్ట్ర రాజధానిలో రిపబ్లిక్ దినోత్సవ విన్యాసంలో గవర్నరు వందన స్వీకారం చేస్తున్న దృశ్యం

మూడోఅట్ట :

కొత్త ఢిల్లీలోని లేపాక్షి ఎంపోరియం లోపలి దృశ్యం

చివరిఅట్ట :

సంక్రాంతి సంబరాలు

# ముల్కీ నిబంధనల విషయంలో
# ప్రధానమంత్రి పంచసూత్ర పథకం



ముల్కీ నిబంధనలకు సంబంధించి నవంబరు 27వ తేదీన కేంద్ర ప్రభుత్వనిర్ణయాలను ప్రకటిస్తూ లోక్ సభలో ప్రధాన మంత్రి చేసిన ప్రకటన పూర్తిపాఠం:

"ముల్కీ నిబంధనలపై సుప్రీంకోర్టు తీర్పు ఫలితంగా ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పడిన పరిస్థితిపై ఈ సభలో గత వారంలో చర్చ జరిగింది. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలలో దౌర్జన్య సంఘటనలు జరిగి ప్రాణ నష్టం, ప్రభుత్వానికి ఆస్తినష్టం సంభవించాయి ఈ పరిణామాలు సభలో ఉన్న మనకు, దేశవ్యాప్తంగా ఉన్న ప్రజలకు తీవ్ర వేదన కలిగించాయి

ప్రజలను శాంతపరచాలని, విశ్వాసాన్ని పునరుద్ధరించే వాతావరణాన్ని కలిగించాలని నేను రాష్ట్రంలోని అన్ని వర్గాలవారికీ, అన్ని రాజకీయ పార్టీల వారికి విజ్ఞప్తి చేశాను.

రాష్ట్రంలోని నాయకులు కలసి కూర్చుని తమలోతాము చర్చించుకోవడం ద్వారా ఒక అంగీకారానికి రావడం సాధ్యమేనని మనం ఆశించాము, ఏమైనప్పటికీ మనం ఆశించినట్లుగా జరుగలేదు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, ఆయన మంత్రివర్గ సహచరులు ముల్కీ నిబంధనలకు సంబంధించిన అన్ని విషయాలపైనా నిర్ణయాలు తీసుకోవలసినదిగా కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

గత కొద్ది వారాలలో నేను, నా సహచరులు ఆంధ్రప్రదేశ్ నాయకులతోను, వివిధ వర్గాలకు చెందిన ప్రజాప్రతినిధులతోను చర్చలు జరిపాము. ప్రస్తుతం వున్న సమైక్య రాష్ట్ర పరిధిలోనే పరిష్కారం కనుగొనాలని ఆంధ్రప్రదేశ్‌లోని అధిక సంఖ్యాక ప్రజలు వాంఛిస్తున్నారని ఈ చర్చల ద్వారా విదితమైంది

ఈ సమస్యలో ఇమిడివున్న అన్ని అంశాలను ఎంతో శ్రద్ధగా పరిశీలించిన మీదట మేము తీసుకున్న నిర్ణయాలను ఈ ప్రకటన ద్వారా సభవారికి తెలియపరుస్తున్నాను.

## తెలంగాణా రక్షణలు

1956 లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడినప్పుడు, ప్రభుత్వోద్యోగాలలో తెలంగాణా ప్రజలకు కొన్ని రక్షణలు అవసరమని గుర్తించబడింది. అప్పుడు ఆంధ్ర, తెలంగాణా ప్రాంతాలకు చెందిన ప్రతినిధులచే అంగీకృతమైన ఒకపథకం రూపొందించబడింది

"రాష్ట్ర సమైక్యతకు అడ్డు గోడలుగా నిలిచివున్న ప్రతిబంధకాలన్నింటినీ తొలగించాలని కోరుతున్నవారి మనోభావాలను నేను అవగాహన చేసుకోగలను. ఈ అడ్డు గోడలన్నీ తొలగిపోయి ఇలాంటి ప్రత్యేకమైన ఏర్పాట్లకు అవసరంలేని శుభదినం కోసం నేను ఎదురుచూస్తున్నాను."

—(లోకసభలో ప్రధానమంత్రి)

జాతీయ విధానం ప్రకారం ఇతర ప్రాంతాలలో ప్రభుత్వోద్యోగాల విషయంలో "స్థానిక నివాసార్హత" అనే పద్ధతి తొలగించబడింది. అయినా, తెలంగాణా ప్రాంతంలో స్థానిక నివాసార్హత ప్రాతిపదికపై సబార్డినేట్ సర్వీసులలో నియామకాలకు గాను 1957లో పబ్లిక్ ఎంప్లాయిమెంటు (స్థానిక నివాసార్హత) చట్టాన్ని పార్లమెంటు ఆమోదించింది. ఈ శాసనం తాత్కాలిక స్వభావం కలది. ఇది 1974 మార్చితో రద్దు అయివుండేది. అయితే 1969లో ఈ చట్టాన్ని సుప్రీం కోర్టు కొట్టివేసింది. అప్పటి నుంచి తెలంగాణా ప్రజలకు ప్రభుత్వ సర్వీసులలో ప్రాతినిధ్యానికై తగిన చర్యలు కనుగొనే సమస్య కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి వచ్చింది.

ఇలా వుండగా, సుప్రీం కోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పువల్ల కొత్త పరిస్థితి ఉత్పన్నమైంది. లోగడ నిర్ణయించుకున్న లక్ష్యాలు అమలు కావడానికి మరికొన్ని చర్యలు తీసుకోవలసిన అవసరం ఇప్పుడు ఏర్పడింది.

రాష్ట్ర ప్రభుత్వ సర్వీసులలోని కొన్ని పదవులకు మాత్రమే ముల్కీ నిబంధనలు వర్తిస్తాయన్న విషయం అందరికీ తెలిసినదే. అఖిల భారత సర్వీసులకు, కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలలోని ఉద్యోగాలకు, కేంద్ర ప్రభుత్వానికి చెందిన ప్రభుత్వ రంగం సంస్థలలోని ఉద్యోగాలకు ముల్కీ నిబంధనలు వరించవు.

ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు యీ విధంగా వున్నవి.

1. ముల్కీ నిబంధనలలో నిర్దేశించబడిన నివాసార్హత కేవలం తెలంగాణా ప్రాంతంలోని నాన్ గెజెటెడ్ ఉద్యోగాలలోనూ, తహసిల్దారు, సివిల్ అసిస్టెంట్ సర్జను, జూనియర్ ఇంజనీరు ఉద్యోగాలలోనూ జరిగే నియమకాలకు మాత్రమే వర్తిస్తుంది.

   అయితే ఇరు ప్రాంతాలకు సంబంధించిన సచివాలయం శాఖాధిపతుల కార్యాలయాలు, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల వంటి సమిష్టి కార్యాలయాల విషయంలో నాన్ గజెటెడ్ ఉద్యోగాల ఖాళీలను నేరుగా నింపేటప్పుడు మాత్రం ప్రతి మూడు ఖాళీల విభాగంలోనూ రెండవ ఖాళీ నింపడానికి యీ నిబంధనలు వర్తిస్తాయి.

2. ఈ ప్రత్యేక రక్షణలు తెలంగాణా ప్రాంతంలో 1980 డిసెంబరు మాసాంతం వరకు అమలులో వుంటాయి. అయితే హైదరాబాదు, సికిందరాబాదు నగరాలలో ఈ ప్రత్యేక రక్షణలు 1977 డిసెంబరు మాసాంతం వరకు మాత్రమే కొనసాగుతాయి, రాష్ట్ర రాజధాని జంట నగరాలలో నెలకొనివున్నందున రక్షణల విషయమై యీ విదముగా రెండు రకాల గడువులు నిర్ణయించడం జరిగింది.

3. ఈ రెండు ప్రాంతాల్లోనూ ఆ యా ప్రాంతాల్లో పని చేస్తున్న ప్రభుత్వోద్యోగులకు ప్రమోషన్ల విషయంలో తగినన్ని అవకాశాలు వీలుకల్పించే నిమిత్తము వివిధ స్థాయిలకు చెందిన ఉద్యోగాలు మొదటి లేక రెండవ గెజెటెడ్ స్థాయివరకు ప్రాంతీయీకరణ చేయబడతాయి. అయితే అఖిల భారత సర్వీసులలో నియామకాలకు నేరుగా మార్గం ఏర్పరచే ఉద్యోగాలకు యిది వర్తించదు.

4. ప్రస్తుతం హైదరాబాదు, సికిందరాబాదు నగరాలలోని విద్యాసౌకర్యాల విషయంలో, సాంకేతిక, వృత్తి విద్యా రంగాలతోసహా తెలంగాణా విద్యార్థులకుగల విద్యా సౌకర్యాలకు ఏ విధంగానూ భంగం వాటిల్లదు. ఈ నగరాలలో తగువిధంగా విద్యా సౌకర్యాలు విస్తరింపబడుతాయి. నివాసార్హత ప్రాతిపదికగా గల ఏ విధమైన పరిమితులు యీ అదనపు సౌకర్యాలకు వర్తించవు.

5. హైదరాబాదు, సికిందరాబాదు నగరాలలో సమిష్టి పోలీసు ఫోర్సు వుంటుంది. రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదించి దీనికి సంబంధించిన వివరాలను రూపొందించడం జరుగుతుంది.

ఈ ఏర్పాట్లు సక్రమంగా అమలు జరిగేందుకు కేంద్ర ప్రభుత్వం తగిన యంత్రాంగాన్ని రూపొందిస్తుంది.

ఈనిర్ణయాన్ని అమలు పరచడానికి అవసరమైన శాసనాన్ని త్వరలోనే సభలో ప్రవేశపెట్టడం జరుగుతుంది.

సమైక్య రాష్ట్ర అవసరాలను, విద్య, ప్రభుత్వోద్యోగాల విషయంలో ఉభయ ప్రాంతాల ప్రజల న్యాయమైన ప్రయోజనాలను, ఈ సభలో ఇచ్చిన హామీలను దృష్టిలో పెట్టుకుని పైన పేర్కొన్న నిర్ణయాలు తీసుకొనబడినవి. ఈ నిర్ణయాలకు రాష్ట్రంలో సాధారణామోదం లభించగలదని, సదవగాహన, సహకారం, సర్దుబాటు భావాలతో ఇవిఅమలు కాగలవని ప్రభుత్వం ఆశిస్తున్నది.

అంధ్రప్రదేశ్ అన్ని ప్రాంతాలలోనూ శాంతి నెలకొల్పే కృషిలో సహకరించ వలసిందని ముఖ్యంగా పార్లమెంటు సభ్యులందరినీ కోరుచున్నాను".



32—4

# ప్రధాన మంత్రి పంచసూత్ర పథకంపై కొన్ని పత్రికల వ్యాఖ్యలు

ముల్కీ నిబంధనలకు సంబంధించి ప్రధానమంత్రి ప్రకటించిన పంచసూత్ర పథకాన్ని గూర్చి దేశంలోని కొన్ని ప్రముఖ పత్రికలు చేసిన వ్యాఖ్యలు దిగువ యివ్వబడినాయి :

హిందూ/28–11/పత్రిక వ్యాఖ్యానిస్తూ ముల్కీ వివాదానికి చెందిన చారిత్రిక అంశాలను దృష్టిలో ఉంచుకుని ఆంధ్ర–తెలంగాణా ప్రాంతాలకు న్యాయం కలగాలనే ఉద్దేశ్యంతో రెండు ప్రాంతాల మధ్యగల విభేదాలను నివారించడానికి చిత్తశుద్ధితో చేసిన ప్రయత్నంగా ప్రశంసించింది. తెనుగు ప్రజల చిరవాంఛితం నెరవేరి, దీర్ఘకాలిక పోరాటం తర్వాత సంపాదించుకున్న రాష్ట్రాన్ని నిలుపుకుంటూ సమగ్రతను కాపాడు కోవడానికి వీలుగా ఆంధ్ర ప్రదేశ్ ప్రజలు అంగీకరింప తగిన పథకం : అని అభిప్రాయ పడింది.

ఫ్రీప్రెస్ జర్నల్ 2/8–11/పత్రిక తన అభిప్రాయాన్ని తెల్పుతూ, "రెండు తీవ్రవాద ధోరణుల మధ్య యిది రాజీమార్గమని అన్నది. ప్రధాన మంత్రి వాగ్దానం చేసిన విధంగా పథకం అమలు యంత్రాంగాన్ని త్వరితగతిని ఏర్పాటు చేస్తూ రెండు ప్రాంతాల మధ్య భావ సమైక్యతకు తగిన వాతావరణాన్ని కేంద్రం సృష్టించవచ్చు" అని వ్యాఖ్యానించింది.

ఇండియన్ ఎక్స్‌ప్రెస్/28–11/పత్రిక వ్రాస్తూ "ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సమగ్రతను పరిరక్షించాలనే మూల సూత్రాన్ని అంగీకరించినప్పుడు యీ నిర్ణయం సమస్య పరిష్కారానికి సంతృప్తికరమైన ప్రాతి పదికను ఏర్పరుస్తుంది" అని అభిప్రాయ పడింది.

హిందూస్థాన్ టైమ్స్/28–11/పత్రిక ప్రధాన మంత్రి పథకాన్ని గూర్చి వర్ణిస్తూ "యిది ఆదర్శ ప్రాయమైనదికాకపోయినా, సముచితమైనదిగా చెప్పవచ్చు, సంబంధితులందరు యీ కొత్త పథకం అమలుకు కొంతవ్యవధి యివ్వాలి కాని యిటీవలి ఆందోళనతో న్యాయా న్యాయాలు నిర్ణయించరాదు. రాజకీయ సుస్థిరత, సత్వరాభివృద్ధి ద్వారా ఉన్నతస్థాయిలలో అందరికి ఉపాధి సౌకర్యాలు ఏర్పరచడమే యీ ప్రాంతీయ అసంతృప్తికి తగిన సమాధానము అనిచెప్పవచ్చు' అని వ్యాఖ్యానించింది.

మెయిల్ (29-11-72)

"ఈ పంచసూత్రపథకం మనస్ఫూర్తిగా ఆహ్వానించదగినది" అని మెయిల్ పత్రిక వ్యాఖ్యానించింది. "ఇది ప్రశాంత వాతావరణం నెలకొల్పడానికి, సమైక్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని కొనసాగిస్తూ, రాష్ట్రప్రజల అభ్యుదయానికి దోహదం చేయడానికి ఉద్దేశించిన పథకం అని కూడా ఆ పత్రిక పేర్కొన్నది.

ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్ (29-11-72)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమైక్యతను కాపాడడానికి, ఉభయ ప్రాంతాల ప్రజల కోర్కెలను గరిష్ఠపరిమితిలో తీర్చడానికి యీ పథకం ఉద్దేశించినదని యీ పత్రిక వ్యాఖ్యచేసింది. "భారత యూనియన్‌లో అంతర్భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సత్వర అభివృద్ధి సాధించడంలోనే తెలంగాణా, ఇతరప్రాంతాల భవిష్యత్తు యిమిడి ఉన్నదని" యీ పత్రిక అభిప్రాయపడింది.

నేషనల్ హెరాల్డ్ (29-11-72)

"ఉద్యోగాల పంపిణీ–అదైనా తాత్కాలిక ప్రాతిపదిక మీద–యిందులో వున్న విషయం. దేశాన్ని ఆర్థికంగా ముందుకు తీసుకు పోవడంద్వారా, అధికసంఖ్యాక ప్రజలకు తగినంతగా ఉద్యోగావకాశాలు కల్పింప జేయడం ప్రధాన సమస్య. కాగా యీ తాత్కాలిక విషయాలు వేర్పాటుకు ఉద్యమించే శక్తులుగా తయారు కాకూడదని" యీ పత్రిక పేర్కొన్నది.

# పొట్టి శ్రీరాములు



కూరెళ్ల రామనరసింగరావు

జన్మభూమికి స్వేచ్ఛ నొసంగె, గాంధి,
ఆంధ్ర రాష్ట్రము నీ విడినట్టి భిక్ష,
గురువరున కీవు దగు శిష్య వరుడవయ్య
పొట్టి శ్రీరామ! సుజన ప్రపూజ్యనామ!

మనుజుని జీవితంబు క్షణమాత్రము; ఆ క్షణమందునన్ ప్రయో
జనరహితంబులౌ పనులు సల్పెడి వారలు, కాలవాహినిన్
జనుదురు బుద్బుదంబులటు, సన్మతి, నీవలె, భూరికృత్యముల్
ఒనరుచు వ్యక్తి నిల్చెడి, మహోన్నత మేరునగోపమానుడై॥

ప్రాపితమయ్యె నాంధ్రులకు రాష్ట్రము నీదు కఠోర దీక్షచే,
దీపము పెట్టి మొక్క వలదే నిను, ఆంధ్ర జనావళుల్; శక
స్థాపకు, శాలివాహను విధంబున, నూతన కాండమున్, జగత్
వ్యాపితకీర్తి! ఆంధ్రచరితంబున, నీవు రచించినవాడవే॥

ధర 'పరోపకారార్థ మిదంశరీర'
మనెడి సూక్తిని, తలదాల్చి మనినయట్టి
దిట్టవను, జగజెట్టివి, పొట్టివంశ
నీరధి శశాంక! శ్రీరామ! నీవు గాదె

ఎంతరచించినన్ ప్రతిమ లెన్నిటినిల్పిన, నీదుపేర; కా
సంతయు తీర్పజాలముగదా, భవదీయ ఋణంబు, నిన్, సదా,
స్వాంతమునన్ దలంచుచును, సత్కృషిజేయుచు మేముబొల్చినన్
కొంతగ దీర్తుమొక్కొ. గుణ కోవిద! నీ ఋణమీ వసుంధరన్.

పరిపంథి గంధసింధురసింహులైనట్టి, శాతవాహనునాటి శౌర్యపటిమ
శత్రుకాననవీతిహోత్రుడై యలరిన. కాకతీయునినాటి కదనధాటి
సంస్తవనీయుడౌ చాళుక్య విభునాటి, రమణీయ కావ్య నిర్మాణశక్తి,
కార్యఖడ్గ కవిత్వఘనుడు రాయలనాటి, బహుముఖ సామర్థ్యవైభవంబు

జ్ఞప్తికిని దెచ్చితీవు నీ సాహసమున
ఆంధ్రరాష్ట్రమునిత్యకళ్యాణముగను
పచ్చతోరణముగ జేయ, ప్రతినబూన
వలయు ప్రతియాంధ్ర సుతుడు, నీ పదములాని.

ప్రాణముకన్న తీపియగువస్తువులేదు, ధరాతలంబునన్;
ప్రాణము ధారవోసితివి, రాష్ట్రము గూర్పగ, నాంధ్రసోదర
శ్రేణికి; భారతావని చరిత్రమునందు, కవీశ్వరుల్, త్వద
క్షీణయశఃప్రశస్తిని, లిఖింతురుగాదె, సువర్ణపంక్తులన్.

# ముల్కీ నిబంధనల చట్టం

**ముల్కీ నిబంధనల వర్తింపును పరిమితం చేయడానికీ, కొన్ని నియామకాలను చెల్లుబడి చేయడానికీ. దశలవారీగా ఆ నిబంధనలను, ఉపసంహరించడానికీ అందుకు సంబంధించిన అంశాలను గురించి నిబంధన చేయడానికి ఉద్దేశించిన చట్టం.**

భారత రిపబ్లిక్ 23 వ సంవత్సరంలో పార్లమెంట్ ఈ క్రింది విధంగా చట్టం చేయడమైనది.

సంక్షిప్త వివరణ—నిర్వచనాలు

1. ఈ చట్టం 1972 సంవత్సరపు ముల్కీ నిబంధనల చట్టం అని వ్యవహరించబడుతుంది.

2. సందర్భాన్నిబట్టి వేరే అర్థం వచ్చేచోట్లలో తప్ప ఈ చట్టంలో వాడిన మాటలకు అర్థాలు ఈ విధంగా ఉంటాయి:

(ఎ) "నియమితదినం" అంటే 1956వ సంవత్సరపు నవంబరు ఒకటవ తేది అని అర్థం.

(బి) "నియామకం" అంటే పర్మనెంట్, క్వాసీ పర్మనెంట్, తాత్కాలిక నియామకాలన్నీ, అని అర్థం. కాని "క్యాజుయల్" ఉద్యోగాలు కావు.

(సి) 'రాజధాని ప్రాంతం'—అనగా 955 హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ల చట్టం మేరకు హైదరాబాద్, సికిందరాబాద్ నగరాల ప్రాంతం అని అర్థం.

(డి) 'మొదటి షెడ్యూలు ఉద్యోగం'—అనగా మొదటి షెడ్యూలు క్రింద చేర్చిన ఉద్యోగం అని అర్థం. అయితే ఈ షెడ్యూలులో ఈ క్రింది ఉద్యోగాలు చేరవు.

(i) రెండవ షెడ్యూలులో చేర్చిన ఉద్యోగాలు.

(ii) 1348 ఫసలీ హైదరాబాద్ సిటీపోలీసు చట్టంలోని మూడవ సెక్షన్ బి. క్లాజు క్రింద నిర్వచించబడిన పోలీసు ఉద్యోగాలు.

(ఇ) 'హైదరాబాదు సివిల్ సర్వీస్ రెగ్యులేషన్సు'— అనగా ఇంగ్లీషులో ఆ పేరుతోనూ, ఉర్దూలో జాబ్తా ములాజమత్ సివిల్ సర్కారెఆలీ పేరుతోనూ వ్యవహరింపబడుతూ, (1337 హిజరీ సంవత్సర రంజాన్ 25 వ తేదీన పూర్వపు హైదరాబాద్ ప్రభుత్వపాలకుడు జారీచేసిన ఫర్మానా పురస్కరించుకొని ఉర్దూలో తయారుచేసి 1329 అజూర్ నెల 7 వ తేదీన జరిదా—యె—అలమియాలో ప్రకటించబడిన నిబంధనలు) నియమిత దినంముందు అమలులో ఉండేవి అని అర్థం.

(ఎఫ్) 'ముల్కీ నిబంధనలు' అనగా 1950 జనవరి 26వ తేదీనా, ఆ తరువాత రాజ్యాంగం 35 ఆర్టికల్ బి క్లాజు అనుసరించి అమలులో ఉన్న హైదరాబాద్ సివిల్ సర్వీస్ రెగ్యులేషన్సుకు చెందిన కొన్ని నిబంధనలు అని అర్థం.

(జి) 'నాన్ గెజిటెడ్ ఉద్యోగం' అనగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలోని గజిటెడ్ ఉద్యోగంకాని ఏదైనా ఉద్యోగం.

(హెచ్) 'వేతనం' అనగా ఒక ఉద్యోగానికి మంజూరు చేయబడిన బేసిక్ వేతనం, వుంటే, స్పెషల్ వేతనం కలిపిన మొత్తం. ఇందులో రకరకాల అలవెన్సులు చేరవు.

(ఐ) "షెడ్యూలు ఉద్యోగం" అనగా మొదటి షెడ్యూలు లేక రెండవ షెడ్యూలులో చేర్చిన ఉద్యోగాలు అని అర్థం.

(జె) "రెండవ షెడ్యూలు ఉద్యోగం" అనగా రెండవ షెడ్యూలు క్రింద నిర్దేశించబడిన ఉద్యోగం అని అర్థం.

(కె) 'రాష్ట్ర ప్రభుత్వం' అనగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అని అర్థం.

(ఎల్) 'సుపీరియర్ సర్వీసు' 'ఇన్ ఫీరియర్ సర్వీసు' అనేవాటికి హైదరాబాదు సివిల్ సర్వీసు రెగ్యులేషన్సులో ఉద్దేశించిన అర్థమే వుంటుంది.

(ఎమ్) 'తెలంగాణా ప్రాంతం' అనగా 1956 రాష్ట్రాల పునర్ వ్యవస్థీకరణ చట్టంలోని 3 వ సెక్షను (1) లో పేర్కొన్న ప్రాంతం అని అర్థం.

(ఎన్) రెండవ షెడ్యూలుకు సంబంధించి, 'తెలంగాణాకు చెందిన ఖాళీ' అనగా సరాసరి రిక్రూట్ చేసుకునే ఒకే తరగతికి చెందిన ఉద్యోగాలలో ప్రతి మూడు ఉద్యోగాలలో రెండవ ఉద్యోగానికి సంబంధించిన ఖాళీ అని అర్థం.

నిర్దిష్ట కాలానికి ముల్కీ నిబంధనల పరిమితి—కొన్ని ఉద్యోగాల నియామకాలకు వర్తింపు, యితర ఉద్యోగ నియామకాల చెల్లుబాటు.

3. (1) నియమిత దినం నుండి ఈ చట్టం అమలులోకి వచ్చే ముందువరకుగల ఈ మధ్యకాలంలో సబ్—సెక్షను (2) లో ఉదహరించిన ఉద్యోగాల నియామకాలకు మాత్రమే ముల్కీ నిబంధనలు వర్తించినట్లు భావించవలెను. ఆ కాలంలో ఆ నియామకాలకు మాత్రమే పరిమితమగునట్లుగా ముల్కీ నిబంధనలు సవరింపబడినట్లు భావించవలెను.

(2) సబ్—సెక్షన్ (1) లో పేర్కొనబడిన నియామకాలు యివి:

(ఎ) రాజధానిలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వ సెక్రటేరియట్, ప్రభుత్వశాఖల అధిపతుల కార్యాలయాలు మినహా—తెలంగాణా

ప్రాంతంలో నాన్ గెజిటెడ్ ఉద్యోగాల నియామకాలకు ముల్కీ నిబంధనలు వర్తిస్తాయి. నాన్‌గెజిటెడ్ ఉద్యోగాలు అన్నప్పుడు సర్వీస్ కేడర్‌కు చెందినవున్నా లేకపోయినా, సుపీరియర్ సర్వీసు, లేదా ఇన్‌ఫీరియర్ సర్వీసుకు చెందిన ఉద్యోగాలకయినా ఇది వర్తిస్తుంది.

(బి) అదేవిధంగా తెలంగాణా ప్రాంతంలో రాష్ట్రప్రభుత్వం క్రిందగల తాసిల్దారు పదవులకు, ఏ పేరుతో వ్యవహరించినప్పటికీ, జరిగిన నియామకాలకు నిబంధనలు వర్తిస్తాయి.

(సి) తెలంగాణా ప్రాంతంలో, కంటోన్మెంట్ బోర్డు మినహాయించి ఇతర స్థానిక సంస్థలక్రింద 300 రూపాయలు కనీస వేతనం మించని ఉద్యోగాలకు జరిగిన నియామకాలకు కూడా ముల్కీ నిబంధనలు వర్తిస్తాయి. సర్వీసు కేడర్‌లో చేరినా చేరకపోయినా ఈ పదవులకు నిబంధనలు వర్తిస్తాయి.

(డి) రాజధాని ప్రాంతంలోని సెక్రటేరియట్, ప్రభుత్వ శాఖల అధిపతుల కార్యాలయాలలో సరాసరి రిక్రూట్‌మెంట్ ద్వారా నియమించబడే ప్రతిమూడు నాన్‌గెజిటెడ్ ఉద్యోగాలలో రెండవ ఉద్యోగానికి జరిగిన నియామకాలకు ముల్కీ నిబంధనలు వర్తిస్తాయి. ఈ సెక్షన్‌లోను తరువాత 4 వ సెక్షనులోను రిజర్వుడు వేకెన్సీగా దీనిని పేర్కొంటారు.

(3) న్యాయస్థానాలు. ట్రిబునల్స్, లేదా ఇతర అధికారులు యిచ్చిన తీర్పులు, డిక్రీలు, ఉత్తర్వులతో నిమిత్తం లేకుండా 2 వ సబ్-సెక్షనులోని ఎ, బి, సి, క్లాజులలో పేర్కొన్న ఉద్యోగాలుకాక ఇతర ఉద్యోగాలకూ అదేవిధంగా 2 వ సబ్-సెక్షన్ 'డి' క్లాజులో పేర్కొన్న రిజర్వుడు వేకెన్సీకానీ ఇతర ఖాళీలకూ వ సబ్ సెక్షన్‌లో ఉదహరించిన వ్యవధిలో నియామకాలు జరిగి ఉన్న పక్షంలో-అట్టి నియామకాలు చట్టవిరుద్ధమని, చెల్లవని భావించ రాదు. ఈ రకం ఉద్యోగాల విషయంలో ఎట్టిచర్య తీసికొని ఉన్నప్పటికీ ముల్కీ నిబంధనలకు అనుగుణంగా లేవన్న కారణంగా ఆ నియామకాలను చట్టవిరుద్ధమని చెల్లవని భావించుటకు వీలులేదు.

కొన్ని నిర్దిష్ట నియామకాల చెల్లుబాటు

**4.** 3వ సెక్షన్‌లోని 1వ సబ్-సెక్షన్‌లో ఉదహరించిన దానితో నిమిత్తం లేకుండా, నియమిత తేదీనుండి ఈ చట్టం అమలులోకి వచ్చు నాటివరకు ఈ మధ్యకాలంలో 2 వ సబ్-సెక్షన్‌లోని ఎ.బి.సి క్లాజుల్లో ఉదహరించిన ఉద్యోగాలు అదేవిధంగా 'డి' క్లాజులో ఉదహరించిన 'రిజర్వుడు వేకెన్సీని' భర్తీ చేయడానికి జరిగిన నియామకాల విషయంలో ముల్కీ నిబంధనలు ఆ కాలానికి నిర్దేశాత్మకంగా మాత్రమే సవరించబడినట్లు భావించాలి. అదే విధంగా న్యాయస్థానాలు, ట్రిబ్యునల్స్, అధికారులు ఇచ్చిన తీర్పులు, డిక్రీలు, ఉత్తర్వులతో నిమిత్తం లేకుండా పైన ఉదహరించిన ఉద్యోగాలకు ఖాళీలకు జరిగిన నియామకాలు ఆ సందర్భముగా తీసుకున్న చర్యలు ముల్కీ నిబంధనలకు విరుద్ధంగా జరిగినవన్న కారణంగా అక్రమమైనవని చెల్లనేరవని భావించరాదు.

కొన్ని ఉద్యోగాల నియామకాలకు తప్ప ముల్కీ నిబంధనల రద్దు

**5.** (ఎ) మొదటి షెడ్యూలు క్రింద నియామకాలకు (బి) రెండవ షెడ్యూలులో 'తెలంగాణా ఖాళీని' నింపడానికి జరిగే నియామకాలకు మినహా-ఇతరత్రా ముల్కీ నిబంధనలు వర్తించకుండా రద్దు చేయడమైనది. అయితే ముల్కీ నిబంధనల క్రింద వెనుక జరిగిన నియామకాలపై యీ రద్దు ప్రభావం ఉండదు.

రాజధాని ప్రాంతంలో షెడ్యూలు దాఖలా ఉద్యోగ నియామకాలకు ముల్కీ నిబంధనల రద్దు-

**6** రాజధాని ప్రాంతంలో షెడ్యూలు జాబితాలోని ఉద్యోగాల విషయంలో ముల్కీ నిబంధనలు 1977 డిసెంబరు 13 నాటికి రద్దు అవుతాయి. అయితే ఈలోగా ముల్కీ నిబంధనల ననుసరించి జరిగిన నియామకాలపై దాని ప్రభావం ఉండదు.

ముగిలిన తెలంగాణా ప్రాంతంలో షెడ్యూలు దాఖలా ఉద్యోగ నియామకాల విషయంలో ముల్కీ నిబంధనల రద్దు

7. రాజధాని ప్రాంతం మినహా తెలంగాణా ప్రాంతంలో షెడ్యూలు జాబితా క్రింద ఉద్యోగాల విషయంలో ముల్కీ నిబంధనలు 1980 డిసెంబరు 31 నాటికి రద్దు అవుతాయి. అయితే ముల్కీ నిబంధనల ననుసరించి ఈలోగా తెలంగాణా ప్రాంతంలో జరిగిన నియామకాల చెల్లుబాటుకు భంగం రాదు.

## మొదటి షెడ్యూలు (2వ సెక్షన్ డి)

(ఎ) రాష్ట్ర ప్రభుత్వం క్రింద తెలంగాణా ప్రాంతంలోని నాన్‌గెజిటెడ్ ఉద్యోగాలు (సర్వీస్ కేడర్‌లో ఉన్నా లేకపోయినా సుపీరియర్ లేదా ఇన్‌ఫీరియర్ సర్వీస్‌కు చెందినవి అయినప్పటికీ)

(బి) తెలంగాణా ప్రాంతంలో తాసీల్దారు, సివిల్ అసిస్టెంట్ సర్జన్, జూనియర్ ఇంజనీర్ పదవులు—వీటిని ఏ పేరుతో ఆ ప్రాంతంలో ఉదహరిస్తున్నప్పటికీ.

(సి) కంటోన్మెంటు బోర్డు మినహా స్థానిక సంస్థల క్రింద 300 రూపాయల కనీస వేతనం మించని ఉద్యోగాలు (సర్వీసు కేడర్‌లో ఉన్నా లేకపోయినా.)

## రెండవ షెడ్యూలు (2వ సెక్షన్ జె)

రాష్ట్ర ప్రభుత్వం క్రింద తెలంగాణాలోని (1) సెక్రటేరియట్ డిపార్టుమెంటులు (2) ప్రభుత్వశాఖల అధిపతుల కార్యాలయాలు (3) ఉమ్మడి ఆఫీసులు (4) ఉమ్మడి సంస్థలు—వీటిలోని నాన్‌గెజిటెడ్ ఉద్యోగాలు.

వివరణ 1. "ఉమ్మడి సంస్థ" అనగా తెలంగాణా ప్రాంతానికి గాని లేదా అందులో కొంత ప్రాంతానికిగాని మాత్రమే పూర్తిగా ఉద్దేశించబడని సంస్థ.

వివరణ 2. "ఉమ్మడి ఆఫీసు" అనగా తెలంగాణాకు గాని లేదా తెలంగాణాలోని కొంత ప్రాంతానికి గాని మాత్రమే పూర్తిగా ఉద్దేశించబడని ఆఫీసు.

# ముల్కీ నిబంధనల చట్టం

# పరిణామాల పరిశీలన

ముల్కీ నిబంధనలపై సుప్రీంకోర్టు తీర్పు ఫలితంగా ఆంధ్ర ప్రదేశ్‌లో మళ్ళీ మరొకసారి అలజడి ప్రారంభమైంది.

రాష్ట్ర స్థాయిలో యీ సమస్యకు అంగీకారయోగ్యమైన పరిష్కారం సాధించడానికి అనేక వారాలపాటు ఎన్నో ప్రయత్నాలు జరిగినప్పటికీ పట్టుసడలింపులేని తీవ్రవాద ధోరణుల కారణంగా యీ విషయంలో మధ్యవర్తిగా తీర్పు యివ్వవలసిందని ప్రధాన మంత్రిని కోరడం జరిగింది. ప్రధానమంత్రి, 1972 నవంబరు 27న పంచసూత్ర పథకాన్ని ప్రకటించారు. ఆ తరువాత లోకసభ ముల్కీ నిబంధనల మీదఒక శాసనాన్ని ఆమోదించింది. ఇక కొద్ది రోజులలో 1972 వ సంవత్సరపు ముల్కీ నిబంధనల చట్టం అమలులోనికి రానున్నది. ఈ సందర్భంగా ముల్కీ నిబంధనలు, వాటి పరిణామాలను గూర్చి పరిశీలిద్దాం.

## సమైక్య రాష్ట్రం

మనం కొన్ని ప్రాథమిక సిద్ధాంతాల ప్రాతిపదికమీద యీ పరిశీలన చేయవలసి ఉంటుంది. మొట్టమొదట గమనించవలసిన విషయమేమంటే, సమైక్య ఆంధ్రప్రదేశ్ వుండాలనే దృష్టితో యీ పంచసూత్ర పథకం, ముల్కీ నిబంధనల చట్టం రూపొందించబడినాయి. రాష్ట్ర విభజనకు అంగీకరించే ప్రశ్నేలేదని ప్రధాన మంత్రి స్పష్టంచేశారు. ముల్కీ నిబంధనల చట్టం పరిణామాల పరిశీలనలో యిది అతిప్రధానమైన విషయమనే వాస్తవాన్ని మనం గుర్తించవలసి ఉంటుంది.

ఇక చట్టనిబంధనలను పరిశీలిద్దాం. ఇందులో కొన్ని అంశాలు చాలా ముఖ్యమైనవిగా గోచరిస్తాయి. ముల్కీ నిబంధనలు చెల్లుతాయని తీర్పుయిస్తూ సుప్రీంకోర్టువారు యీ నిబంధనలను గురించి వ్యాఖ్యానించడంలోగానీ, వాటి అమలులో అవి ఎంతవరకు వర్తిస్తాయో వివరించడంలోగానీ తమకు సంబంధంలేదని స్పష్టం చేశారు. ముల్కీ నిబంధనల వ్యాఖ్యానం యిప్పటికీ ఖచ్చితంగా తేలనప్పటికీ, అవి ఏవిధంగా వర్తించాలనే విషయం గూర్చి యీ చట్టం నిర్దిష్టంగా తెల్పుతున్నది.

1918 లో జారీ చేయబడిన ముల్కీ నిబంధనలలో జన్మస్థలం, వంశం, నివాసార్హతలకు సంబంధించి హైద్రాబాదు సంస్థాన ప్రభుత్వోద్యోగాలలో ప్రాధాన్యత యివ్వబడింది. నిర్దిష్టంగా మినహాయించబడిన సందర్భాలలోతప్ప యివి పెద్ద చిన్న అన్ని ఉద్యోగాలకు వర్తించేవి. అప్పుడు ముల్కీ నిబంధనల అమలుకు ఏ విధమైన కాలపరిమితి విధించబడలేదు. మొదట్లో ముల్కీ నిబంధనలను గురించిన వాస్తవపరిస్థితి యిది. అయితే 1950 జనవరి 26 వ తేదీన రాజ్యాంగం అమలులోకి రావడంతో ముల్కీ నిబంధనల పరిధి చాలావరకు తగ్గింది. అయితే రాజ్యాంగపు 35 బి అనుచ్ఛేదం, సవరించడం లేక రద్దుచేయడం జరిగేవరకు నివాసార్హత నిబంధన మాత్రమే అమలులో ఉండే ఏర్పాటు జరిగింది. ఆ తర్వాత పార్లమెంటు 1957 వ సం. ప్రభుత్వ ఉద్యోగాల నివాసార్హత చట్టం ఆమోదించింది. ఈ చట్టం ప్రకారం మణిపూర్, త్రిపుర, హిమాచల్‌ప్రదేశ్ ఆంధ్రప్రదేశ్‌లోని తెలంగాణా ప్రాంతాలలో తప్ప మిగతా భారత దేశమంతటా ముల్కీ నిబంధనలను పోలినటువంటి అన్నిరకాల ప్రత్యేక హక్కులు రద్దుచేయబడినాయి. ఇక్కడ ముఖ్యంగా గమనించవలసిన విషయమేమంటే 1956 లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ సందర్భంగా కుదిరిన పెద్దమనుషుల ఒప్పందం ఫలితంగానే తెలంగాణా ప్రాంతంలో యీ నిబంధనలు అమలులో వుంచబడినవి. పాత ముల్కీ నిబంధనలస్థానే అంగీకరించిన ప్రత్యామ్నాయపు ఏర్పాటుగా ఉద్దేశించబడిన యీ నిబంధనలు, ఒప్పందం ప్రకారం, సబార్డినేటు సర్వీసులకు ఐదేండ్లకాలం వరకు అమలులో ఉండేటట్లుగా నివాసార్హత నిబంధన వర్తింపును పరిమితంచేశాయి. అయితే ఉభయుల అంగీకరించిన అంశాలతో కూడిన ప్రభుత్వ ఉద్యోగాల చట్టాన్ని న్యాయస్థానం కొట్టివేసి తత్ఫలితంగా పాతముల్కీ నిబంధనలు అమలులో ఉన్నట్లు ప్రకటించినందువల్ల పార్లమెంటు మళ్ళీ యీ విషయంలో జోక్యంచేసుకుని ఉభయులు అంగీకరించిన అంశాలను ప్రాతిపదికంగా తీసుకుని కొత్త శాసనం చేయవలసి వచ్చింది. పదిహేను సంవత్సరాల క్రిందట ఉభయులు అంగీకరించిన విధంగా మొదటి నుంచి శాసనబద్ధంగా కొనసాగుతూ వచ్చిన ఏర్పాటును ఆమోదించడం మినహా పార్లమెంటుకు మార్గాంతరం లేకపోయింది. 1–11–1956 నుండి యీ శాసనం అమలులోకి వచ్చే తేదీ వరకు అన్ని నాన్‌గజిటెడ్ ఉద్యోగాలకు, తహసిల్దార్లకు జూనియర్ ఇంజనీర్లకు, సివిల్ అసిస్టెంట్ సర్జనులకు నివాసార్హత వర్తించే విధంగా ముల్కీ నిబంధనలు పరిమితం చేయబడినాయి. ఈ విషయాన్ని గురించే ప్రధాన మంత్రి లోక్‌సభలో

చేసిన ప్రసంగంలో "అంగీకరించిన దానికన్నా కొంతఅదనంగానే" యివ్వడం జరిగిందని పేర్కొన్నారు. సాంకేతిక ఉద్యోగాలకు సంబంధించి నేరుగా జరిగే నియామకాల విషయంలోనే యీ "కొంత అదనంగా" సౌకర్యాలు కల్పించడం జరిగిందని ప్రధానమంత్రి తమ ప్రకటనలో పేర్కొన్నారు. 1-11-56 నుండి నివాసార్హత వర్తించే ఉద్యోగాలలో నిబంధనలను ఉల్లంఘించి జరిపిన నియామకాలను, నివాసార్హత వర్తించదని భావించబడిన ఉద్యోగాలలో యీ నిబంధనలను వర్తింపజేయకుండా వాటిని ఉపేక్షచేసి జరిపిన నియామకాలను యీ చట్టం చెల్లుబడిచేస్తున్నది. దీని అంతటికీ పర్యవసానమేమంటే 1-11-56 లగాయతు ప్రస్తుతపు చట్టం అమలులోకి వచ్చే తేదీ వరకు జరిగిన ఏ నియామకం కూడా రద్దు కావడానికి వీలులేదు. తత్ఫలితంగా ఆ విధంగా నియమింపబడిన ఏ వ్యక్తి కూడా తన ఉద్యోగం కోల్పోడు. అంతేగాక ముల్కీ కాని కారణంగా తెలంగాణా ప్రాంతం నుంచి అతను బదిలీ కావడానికి కూడా వీలులేదు.

## కాలపరిమితి

రెండవ ముఖ్యాంశం యీ చట్టం కాలపరిమితికి సంబంధించినటువంటిది. 1957వ సంవత్సరపు ప్రభుత్వోద్యోగాల నివాసార్హత చట్టంలో నిర్దేశించిన ప్రాంతాలలో మినహా ఉద్యోగ నియామకాల విషయంలో మిగిలిన ప్రాంతాలలో ఎక్కడ వున్నాసరే ముల్కీ నిబంధనలవంటి ప్రత్యేక రాయితీలు రద్దు చేయబడినవి. 1-11-1956కు ముందు అవిభక్త హైదరాబాదు సంస్థానంలో ఉండి ముల్కీ నిబంధనల ప్రయోజనాలనుపొంది ఆ తర్వాత మహారాష్ట్ర, మైసూరు రాష్ట్రాలలో విలీనమైన మరాఠ్వాడ, కర్ణాటక జిల్లాల విషయంలో యీ ముల్కీ నిబంధనలు వాటంతటవే రద్దుఅయినాయి. ఆంధ్రప్రదేశ్ అవతరణ సందర్భంలో ఆంధ్ర-తెలంగాణాప్రాంత నాయకులు కలిసి పెద్దమనుషుల ఒప్పందం చేసుకోకుండా ఉండి ఉంటే తెలంగాణా ప్రాంతంలో కూడా యీ ముల్కీ నిబంధనలు రద్దు అయివుండేవే. అయితే ఆ సందర్భంలో సమైక్య ఆంధ్రప్రదేశ్ ఏర్పడిఉండేదికాదు. ఏతావాతా ఆంధ్రప్రదేశ్ అవతరణ, పెద్దమనుషుల ఒప్పందం, ప్రభుత్వ ఉద్యోగాల చట్టంలో పేర్కొన్న సవరించిన రూపంలో ముల్కీ నిబంధనల అమలు, ఇవన్నీ ఒకే రాజకీయ నిర్ణయానికి చెందిన విషయాలనేది వాస్తవం. కనుక ఈ విధంగా సమైక్య రాష్ట్ర మనుగడకు ముల్కీ నిబంధనల చట్టం అమలు జరిగే కాలపరిమితి చాలా ప్రధానమైనది. మొత్తం మీద పరిస్థితినిబట్టి, ప్రభుత్వ ఉద్యోగాల చట్టం గడువును రెండుసార్లు అంటే 1974 వరకు పొడిగించడం అవసరమైంది. యీ పొడిగింపులను నిర్దేశిస్తూ పార్లమెంటు సవరించబడిన శాసనాన్ని ఆమోదించింది కూడా. అయితే సుప్రీంకోర్టు, 1669లో ప్రభుత్వోద్యోగాల చట్టాన్ని కొట్టివేసింది. తత్ఫలితంగా గడువు పెంచుతూ రెండవసారి చేయబడిన యీ చట్టంవల్ల తెలంగాణాకు సంక్రమించవలసిన ప్రయోజనాలు చేకూరలేదు. ప్రస్తుతపు చట్టం నివాసార్హతకు సంబంధించి రాజధానీ నగరానికి 1977, మిగతా తెలంగాణా ప్రాంతానికి 1980ని ఖచ్చితమైన గడువుగా నిర్ణయించింది. యీ గడువులు ముగిసిన తర్వాత యీ నిబంధనలు రద్దు అవుతాయి. ప్రధానమంత్రి యీ నిబంధనలను గూర్చి ప్రస్తావిస్తూ మళ్ళీ గడువు పొడిగించాలని పార్లమెంటును అడిగే ఉద్దేశం ప్రభుత్వానికి లేనే లేదని స్పష్టంగా ప్రకటించారు.

ఇక మూడో విషయం, రాజధానీ నగర ప్రతిపత్తికి సంబంధించినది. పైన పేర్కొన్నట్లుగా, హైదరాబాదు నగరంలో ముల్కీ నిబంధనలు కొంతకాలం ముందుగానే రద్దు కావడానికి చట్టంలో అవకాశం కల్పించబడింది. అంతేకాకుండా ఈ మధ్యంతర కాలంలో నగరానికి ఉమ్మడి పోలీసుదళం ఏర్పాటు చేయడానికి కూడా యిందులో వీలుకల్పించబడింది. ఉమ్మడి కార్యాలయాలు, ఉమ్మడి సంస్థలలో ఉద్యోగాల విషయంలో ప్రాంతీయవారీగా 2:1 నిష్పత్తి ఏర్పాటు చేయబడింది.

కనుక, ముల్కీ నిబంధనల చట్టం స్వల్పకాలిక ప్రయోజనాలను, దీర్ఘకాలిక లక్ష్యాలను ప్రతిబింబింపజేస్తున్నది. పరిస్థితులకు అనుకూలంగా సవరించబడిన రీతిలో ఇది పెద్దమనుషుల ఒప్పందాన్ని గౌరవిస్తున్నది. అంతేకాకుండా ఏ దృష్టితో చూచినా, సమంజసమైనదనిపించే కాలవ్యవధి వరకు ఆ ఏర్పాట్లు అమలులో ఉండటాన్ని యిది మన్నిస్తున్నది. ఆ తర్వాత తెలంగాణా ప్రాంతం, మిగతా దేశంతోపాటు సమానంగా పురోగమించడానికి ఆంధ్రప్రదేశ్ సమైక్యతను పరిరక్షించడానికీ, రాష్ట్ర ప్రజలు సామరస్యంతో సమాన హక్కులుగల పరిస్థితిలో కలిసిమెలిసి ఉండడానికీ యీ చట్టం దోహదం చేస్తున్నది.

# శ్రీ చిర్రావూరి యజ్ఞేశ్వర చింతామణి

పంత్రడంగి రాజేశ్వరరావు

గడచిన తరంలో వుత్తర హిందూస్థానమందలి ఆంగ్ల పత్రికల సంపాదకులలో చాలమంది దాక్షిణాత్యులే. వుత్తరాదిని వుండే ఎడిటర్లు ఆడిటర్లు ఆయాలు మద్రాసీలే అని ఒకసారి రైటు ఆనరబుల్ శ్రీనివాస శాస్త్రి చమత్కరించారు. దాక్షిణాత్యులను అపుడు భాషా ప్రయుక్త రాష్ట్రాలు లేనందున మద్రాసీలనేవారు. అట్టివారిలో ఆంధ్రులకు సముచితమైన స్థానముండేది. వారిలో ప్రముఖులు శ్రీ చిర్రావూరి యజ్ఞేశ్వర చింతామణి.

వీరు మా తండ్రిగారికి సహాధ్యాయులగుటచేత వీరి పరిచయం కలుగుటయేగాక కొన్ని వివరాలు వుభయులవల్ల వినటం తటస్థించింది. అసలు వీరు పశ్చిమ గోదావరి జిల్లా నిడదవోలు వాస్తవ్యులు. కొన్ని తరాలక్రితం విశాఖజిల్లా వలస వెళ్ళారు. వీరిది మొదటినుంచి నిర్భయమైన స్వతంత్ర ప్రవృత్తి. గడచిన శతాబ్ది చరమదశలో మెట్రిక్యులేషను పరీక్ష గడ్డుగా వుండేది. సహజంగా విద్యార్థులు శ్రమించేవారు. తెల్లవారితే పరీక్ష అనగా శ్రీ చింతామణి ఒక ఇంగ్లీషు నవలను దీక్షతో చదవటం ప్రారంభించారు. ఇదేమి ఘోరమని మా తండ్రిగారు మందలిస్తే "వెధవ పరీక్ష ఏడాదికి తిరిగి వస్తుంది కాని యీ నవలను తెల్లవారేసరికి పూర్తిచేసి తిరిగి యిచ్చివెయ్యాలి" అన్నారుట.

విద్యార్థి దశలోనే వక్తగా ప్రసిద్ధికెక్కారు. తోటి విద్యార్థులంతా చందాలుచేసి యీయనను 1893 లో లాహోరునందు శ్రీ దాదాభాయి నౌరోజి అధ్యక్షతను జరిగిన కాంగ్రెసు మహాసభకు ప్రతినిధిగా పంపారు. అచట వీరు వుపన్యసించి కార్యకలాపాలలో పాల్గొనుటయేగాక పండిత మదనమోహన మాలవ్యా దృష్టి నాకర్షించిరి. తదుపరి కొంతకాలము విశాఖపట్నము, మద్రాసులలో పత్రికా రచనలో కృషిచేసి ప్రథమ కళత్రము గతించుటచేత పండిత మాలవ్యా పిలుపు నందుకుని అలహాబాదు వెళ్ళిరి. ఆంగ్ల రచయితగా రూపొందిన శ్రీ సి. యల్. ఆర్. శాస్త్రి వీరికి ప్రథమ కళత్రమువలన కలిగిన కుమారుడు.

అలహాబాదులో "లీడరు" ('Leader') దినపత్రిక స్థాపించిన లగాయితు జీవిత కాలమంతయు దరిదాపు నాల్గు దశాబ్దముల పాటు సంపాదకులుగ నుండిరి. యజమానులు ఎన్నడూ నేటివలె వీరి విధి నిర్వహణలో ఎట్టి జోక్యము కల్పించుకొనలేదు. మేనేజింగు బోర్డు అధ్యక్షులుగ పండిత్ మోతీలాల్ నెహ్రూ వుండగా వీరితో అభిప్రాయభేదము వచ్చినపుడు నెహ్రూ రాజీనామా నిచ్చి వైదొలగెను. వీరు వైదొలగిన పత్రిక మనుగడకే ప్రమాదము వచ్చెడిది. పత్రికవల్ల వీరికిగాక వీరివల్లనే పత్రికకు పేరు ప్రఖ్యాతులు వచ్చెను.

## నిర్భయంగా అభిప్రాయ ప్రకటన

వీరి సంపాదకీయములు సునిశితములును విజ్ఞాన వంతములుగను వుండెడివి. చాలమంది పాత్రికేయులను తీర్చిదిద్దిరి. మాజీ మద్రాసు గవర్నరు శ్రీ ప్రకాశ వీరివద్ద శిక్షణపొందిరి. మితవాద దృక్పథమును అనుసరించుటచేత వీరికి గాంధీజీ ఎడ సానుభూతి వుండెడిదికాదు. సత్యాగ్రహమును గురించి చమత్కరిస్తూ గాంధిజి సత్యానికి కట్టుబడి తేవారి శిష్యులు ఆగ్రహావేశులై పోతారన్నారు. గాంధీజీని మహాత్మా అని కాక మిష్టరు అని సంబోధించేవారు. వీరి కోవకు చెందినవారే సర్ పి. యస్. శివస్వామి అయ్యరు సర్. చిమనలాలు సెతల్వాడు. వీరు ముగ్గురు మితవాదులలో అగ్రశ్రేణికి చెందిన త్రిమూర్తులు. నిష్కర్షగా నిర్మొహమాటంగా రాగద్వేషరహితంగా ఖేదామోదాలతో నిమిత్తం లేకుండా నిర్భయంగా తమ అభిప్రాయాలను ప్రకటించేవారు. అట్టివారు నేడు లేరు.

భారత రాజకీయాలలో గాంధీజీ పాత్రవల్ల పురోగతి కుంటుపడిందనేవారు. వీరు ఆంధ్ర విశ్వవిద్యాలయమందు "1857 తిరుగుబాటు పిమ్మట భారత రాజకీయ పరిణామము" పై యిచ్చిన వుపన్యాసాలలో (ఇవి గ్రంథస్థమై ప్రకటింపబడ్డాయి) తమ వాదనను యుక్తి యుక్తంగా వివరించారు. ఏ దేశము శాంతియుత

పోరాటంతో స్వాతంత్ర్యాన్ని పొందలేకనేవారు. మనము స్వాతంత్ర్యం సంపాదించామనటం కంటే బ్రిటిషువారు దేశాన్ని విభజించి వెళ్ళిపోయారనటం సమంజసం. తరువాత జరిగిన రక్తపాతము జనాభా పరాటా కనివిని ఎరుగనిది.

వీరికి పండిత మదన మోహన మాలవ్యా ఎడ గురుభావ ముండేది. అయనను "ధర్మాత్మ" అని సంబోధించేవారు. వీరు ప్రథమభార్య గతించాక వితంతువివాహం చేసుకున్నా పూర్వాచార పరాయణులుగనుంటూ జపతపాలు చేసేవారు. వ్యక్తులు పోయాక ఆత్మలు మాట్లాడుతూవుటాయని ముక్కాలుపీట (ప్లాంచెట్టు) పైకి మహాగోవిందరేనడే, గోపాలకృష్ణగోఖలే ప్రభృతులను ఆహ్వానించి వారి అభిప్రాయములను తెలుసుకుని అందుల కనుగుణముగ తాము సంపాదకీయములు వ్రాసెడువారు.

## ఉత్తర ప్రదేశ్ రాజకీయాలలో......

వుత్తరప్రదేశ్‌లో జాతీయజీవనాన్ని తీర్చిదిద్దినది వీరే అని సర్ తేజ్ బహదూరు సప్రూ పదేపదే చెప్పేవారు. అచట రాష్ట్ర శాసనసభలో సభ్యులుగ నుండుటయేగాక విద్యామంత్రిగ కొంత కాలముండి ఆత్మగౌరవముకు భంగకరమగు సన్నివేశము సందర్భ పడినపుడు తమ మంత్రిత్వమునకు రాజీనామా చేసిరి. సంస్థాన ప్రజల హక్కులకై ఎనలేని కృషిచేసిరి. ముఖ్యముగ హైదరాబాదు సంస్థానమందు ఆంధ్రులకు జరుగుచూవచ్చిన అన్యాయములను తేటతెల్లముచేసిరి. వీరి ఒరవడిని అనుసరించి సర్ మోచర్ల రామచంద్రరావు, డాక్టరు పట్టాభి శీతారామయ్యా సంస్థానములందలి పీడిత ప్రజానీకమునుద్ధరించిరి. వీరు రెండవ రౌండుటేబిలు సమావేశమందు మితవాద ప్రతినిధిగా పాల్గొనిరి. వీరిని కేంద్ర శాసన సభకు ఎన్నిక చేయించవలెనని పండితమాలవ్యాగట్టి ప్రయత్నము చేసినను ఫలించలేదు. చివరకు 1935 వ సంవత్సరపు ఇండియా చట్టము క్రింద రాష్ట్ర శాసనసభకు జరిగిన ఎన్నికలో వీరు ఓడిపోయి తదుపరి రాజకీయముల నుండి వైదొలగిరి. కాశీ హిందూ విశ్వ విద్యాలయమందు కోర్టు సభ్యులుగ ఎనలేని సేవచేసిరి. ప్రభుత్వము వీరికి సర్. బిరుదము కూడనిచ్చెను.

అతిథి అభ్యాగతులను ఆదరించెడువారు. చెడ్డబయల్పడు వరకు ప్రతివ్యక్తిని మంచిగనే పరగణించెడువారు. వీరు తమ పిల్లలు హిందీలో గాక ఇంగ్లీషు, తెలుగులోనే సంభాషించవలెనని కోరుకొనేవారు. ఎందుచేతనో ప్రత్యేకాంధ్ర రాష్ట్ర నిర్మాణమును వీరు బలపరచలేదు. వీరి కుమారుడగు శ్రీ బాలకృష్ణరావు ఐ. సి. యస్. లో ప్రప్రథములుగా వుత్తీర్ణులగుటయేగాక హిందీలో కవిగను, రచయితగను ప్రసిద్ధికెక్కిరి. ఇటీవల గోరక్‌పూర్ విశ్వవిద్యాలయోపాధ్యక్షులుగ పనిచేసిరి. లోగడ అలహాబాదు కార్పొరేషను మేయరుగకూడ వుండిరి.

ప్రజాసమస్యలను కూలంకషముగ అవగాహన చేసుకున్న కొద్దిమందిలో వీరు ఒకరు. వీరు సంపాదకులుగ వుత్తమ ఒరవడిని పెట్టినను వీరి తదనంతరము "లీడరు" పత్రిక బిర్లా కుటుంబము పరమై కొన్నాళ్లు కుంటి నడక నడచి చివరకు మూతపడినది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక ఇంచుమించు అన్ని పత్రికలు గుత్తపెట్టుబడిదార్ల హస్తగతమయ్యాయి. మేనేజింగు ఎడిటర్లు మేనేజి చేస్తారు గాని ఎడిటు చెయ్యలేరు. అందువల్ల నేడు జి. సుబ్రహ్మణయ్యరు, చింతామణి, పున్నయ్య, రామారావు, ఖాసా సుబ్బారావు, కాశీనాథ్‌రే, హార్నిమెన్, బ్రెల్వీ, రంగస్వామి అయ్యంగారు, నటరాజన్ లాంటి సంపాదకులు కరువయ్యారు.

రోజులు మారాయి. కమిటెడు సంపాదకులు కావాలనే ధ్వని వినిపిస్తోంది. పత్రికలు పెట్టుబడిదార్ల గుప్పిటలోంచి బయటపడ్డా ప్రభుత్వానికి వంతపాట పాడవలసి వుంటుందేమో అనే అనుమానం కలుగుతోంది. ఈ సందర్భంలో "విమర్శ ఎట్లాగున్నా యదార్థము పవిత్రంగా వుండాలి" అని "మాన్‌ఛెష్టరు గార్డియన్" సంపాదకుడైన సి. పి. స్కాటు అన్నమాటలు మరువరాదు. జీతాలు తక్కువగా వుండి వుద్యోగ భద్రతలేక పరాయి ప్రభుత్వం క్రింద బానిసలుగా నున్నపుడే మన పత్రికలు సంపాదకులు ఆత్మగౌరవంతో నిర్భయంగా ప్రవర్తించిన సన్నివేశాలు సంఘటనలు పుష్కలంగా వున్నాయి. నేటివలెగాక ఆనాటి సంపాదకుల జీవితాలు పత్రికలతో ముడిపడి వున్నాయి, శ్రీ సదానంద "ఫ్రీ ప్రెస్ జర్నల్"కు ఇరువదివేల రూపాయలు ధరావతుకట్టవలసి వచ్చినపుడు పాఠకులే ఆ మొత్తాన్ని ప్రోగుచేసి యిచ్చారు. డాక్టరు అనీబిసెంటు "న్యూ ఇండియా" కు ఇరువదివేలు ధరావతుని కట్టవలసి వచ్చింది. బెంగాలీలో ప్రచురితమయ్యే "అమృత బజారు పత్రిక" పై ఆంక్షరాగా రాత్రికి రాత్రి దానిని ఘోషసోదరులు (శిశిరకుమార్, మోతీలాల్) ఇంగ్లీషు దిన పత్రికగా మార్చివేశారు. హార్నిమెన్ దేశంనుంచి బహిష్కృతులుగా వెళ్లవలసి వచ్చింది. ఈ తరానికి నాటి ధీరోదాత్తులైన సంపాదకుల జీవిత చరిత్రలు తెలుసుకోవలసిన ఆవశ్యకత ఎంతైనావుంది. కాని యింతవరకూ శ్రీ సి. వై. చింతామణి జీవిత చరిత్ర వెలువడలేదు. ఆ లోటు త్వరలోనే తీరుతుందని ఆశిద్దాము.

# ముల్కీ నిబంధనల పుట్టుపూర్వోత్తరాలు: తరువాత పరిస్థితి

ఎం. తులసీదాస్

హైదరాబాదు నిజాంకు తన సంస్థానంలోని వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధిపరచాలనే ఆకాంక్ష ఉండేది. స్థానికంగా పుట్టి పెరిగి స్థానికంగా అభిమానం వున్న వ్యక్తులుమాత్రమే సంస్థానాభివృద్ధికి మనసారా శ్రద్ధచూపగలరని ఆయన భావించాడు. అందుకని తన పరిపాలనా యంత్రాంగంలో ఏ ఉద్యోగం కొరకైనా సంస్థానంలో 15 ఏండ్ల నివాస యోగ్యత ఉండడం అవసరమని నిర్ణయిస్తూ 1918 లో ఒక ఫర్మానాను జారీచేశాడు. ఈ ఫర్మానా అమల్లోకి వచ్చిన తరువాత దానివల్ల సత్ఫలితాలు కనిపించాయనే భావం కలిగింది. అనేకమంది ముల్కీలకు ఉద్యోగాలు లభించాయి. 1948 లో పోలీసుచర్య జరిగిన కాలానికి పరిస్థితి ఎంతో మెరుగుపడింది. ఐతే అప్పటికీ హైదరాబాదు సంస్థానానికీ పొరుగునవున్న బ్రిటీష్ ఇండియా ప్రాంతాలకూమధ్య స్థానికులకు ఉద్యోగాలు దొరికే విషయంలో యెంతో వ్యత్యాసం వుండింది.

ప్రత్యక్షంగా కనిపిస్తున్న ఈ వ్యత్యాసం దృష్ట్యా, రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ సంఘం తెలంగాణాకు ప్రత్యేకరాష్ట్రం ఏర్పాటు చేయాలనీ, కొంతకాలం జరిగిన తరువాత, కొన్ని షరతులకులోబడి తెలంగాణాను ఆంధ్రరాష్ట్రంలో విలీనం చేయవచ్చుననీ సిఫారసు చేసింది. అయితే ఈ ఉభయ ప్రాంతాలమధ్య అభివృద్ధి మున్నగువిషయాలలో చెప్పుకోదగిన వ్యత్యాసం కనిపిస్తున్నప్పటికీ, ఈ రెండు ప్రాంతాలను కలిపి సమైక్యరాష్ట్రం ఏర్పాటు చేయడమే వాంఛనీయమని భావించబడింది. 1956 లో ఆంధ్రప్రదేశ్ అవతరించిన సందర్భంలో ఆంధ్ర-తెలంగాణా ప్రాంతాల నాయకులు ఉభయులు కలిసి ఒక పెద్దమనుషుల ఒప్పందాన్ని ఏర్పాటు చేశారు. దీని ప్రకారం ఇతర విషయాలతోపాటు, తెలంగాణా ప్రాంతంలో సబార్డినేట్ సర్వీసులలో అంటే నాన్‌గెజిటెడ్ ఉద్యోగాలలో ఐదేండ్ల కాలంవరకు తెలంగాణావాసులకు రిజర్వేషన్ చేస్తూ తాత్కాలిక నిబంధన రూపొందించడానికి అంగీకరించబడినది. దీనిప్రకారంగా తెలంగాణా ప్రాంతంలో జిల్లా స్థాయిలో సబార్డినేట్ సర్వీసులలో (నాన్-గెజిటెడ్) ఖాళీ ఉద్యోగాలన్నింటినీ 1-11-1956 తేదీ నుంచే రిజర్వుచేస్తూ ప్రభుత్వం 1957 మే నెలలో అడ్‌హాక్ నిబంధనను జారీచేసింది. అంతేకాకుండా సెక్రటేరియట్, రాజధానిలోని ప్రభుత్వ శాఖాధిపతుల కార్యాలయాలలో ఖాళీ ఏర్పడే సబార్డినేట్ (నాన్-గెజిటెడ్) సర్వీసులలో ప్రతిమూడు ఖాళీలలో రెండవ ఖాళీ ఉద్యోగానికి కూడా తెలంగాణా ప్రాంతంలో 15 ఏండ్ల నివాసయోగ్యత కలిగివున్న వ్యక్తులను నేరుగా రిక్రూట్మెంట్ ద్వారా భర్తీ చేయాలని కూడా ఇందులో పేర్కొనబడింది. ఈ సందర్భంలో అప్పటి ఆంధ్రరాష్ట్ర ముఖ్యమంత్రి డా. బెజవాడ గోపాలరెడ్డిగారు ఆ రాష్ట్ర శాసనసభలో 25-11-56వ తేదీన ప్రతిపాదించిన తీర్మానాన్ని దృష్టిలో పెట్టుకోవడం సముచితంగా వుంటుంది. ఉద్యోగాలు, అభివృద్ధి విషయాలలో తెలంగాణా ప్రాంత ప్రజలకు తగిన రక్షణలు కల్పిస్తూ ఈ తీర్మానంలో ప్రతిపాదనలు చేయబడినాయి.

## పబ్లిక్ యెంప్లాయిమెంట్ చట్టం

1957 సంవత్సరంలో లోకసభ పబ్లిక్ ఎంప్లాయ్‌మెంటు (నివాసానికి సంబంధించిన) చట్టాన్ని ఆమోదించింది. ఈ చట్టం దేశంలోని రాష్ట్రాలలోను, కేంద్ర పాలిత ప్రాంతాలలో అప్పుడు అమల్లోవున్న నివాసార్హతకు సంబంధించిన ప్రతిబంధకాలను రద్దు చేస్తూ, ఆంధ్రప్రదేశ్‌లోని తెలంగాణా ప్రాంతానికీ, హిమాచల్ ప్రదేశ్, మణిపూర్, త్రిపురా ప్రాంతాలకూ మాత్రం నివాసార్హతలు కొనసాగించింది. ఈ చట్టం ప్రకారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో సబార్డినేట్ ఉద్యోగాలకు అంటే నాన్-గెజిటెడ్ ఉద్యోగాలకూ (తహశీల్దారు పదవులకు కూడా) తెలంగాణా ప్రాంతంలో స్థానిక సంఘాల అధీనంలో వున్న పదవులకూ, నివాస యోగ్యతకు సంబంధించిన నియమావళిని రూపొందించడానికి భారత ప్రభుత్వానికి అధికారం ఇవ్వడం జరిగింది. ఆ తరువాత భారతప్రభుత్వం 1959 వ సం॥పు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వఉద్యోగ (నివాసయోగ్యతకు సంబంధించిన) నిబంధనలను రూపొందించింది. దీనిప్రకారం, తెలంగాణా ప్రాంతంలో అన్ని నాన్-గెజిటెడ్ ఉద్యోగాలు, తహశీల్దారు పదవులు స్థానికసంఘాల ఆధీనంలో చిన్న ఉద్యోగాలకు (కంటోన్మెంట్ బోర్డు మినహా) 15 ఏండ్ల నివాస యోగ్యతను నిర్ణయించడం జరిగింది (హిమాచల ప్రదేశ్, మణిపూర్, త్రిపురా రాష్ట్రాలలో 3 ఏండ్లకాలం నిర్ణయించబడింది) అయితే తెలంగాణా ప్రాంతంలో నెల 1కి రూ. 300 లకు మించని కనీస జీతం స్కేలు లేక ఆ మొత్తానికి మించకుండా స్థిరవేతనంగల పదవులకు, హైదరాబాదు, సికిందరాబాదు జంట నగరాలలోవున్న సెక్రటేరియట్ శాఖలు, శాఖాధిపతుల కార్యాల

[illegible] జరగవలసిన ప్రతి మూడు ఖాళీ పదవులుగల యూనిట్‌లో ప్రతి రెండవ ఖాళీ ఉద్యోగానికి నివాసయోగ్యతకు సంబంధించిన నియమావళి వర్తిస్తుంది. ఈ చట్టమూ, దానిక్రింద రూపొందించబడిన నియమావళి మొదటి దఫాగా 21—3—1959 న ఐదేండ్ల కాలం వరకు అమల్లోకి వచ్చినాయి. ఆ తరవాత వాటిని మరొక ఐదేండ్లకాలం వరకు అంటే 20—3—1969 వరకు పొడిగించడం జరిగింది. 1968 అక్టోబరు నెలలో మంత్రిమండలి పరిస్థితిని సమీక్షచేసి, నివాసానికి సంబంధించిన రాయితీని మరికొంతకాలం పొడిగించడం వాంఛనీయమని భావించింది. అయితే ఇదే ఆఖరు పొడిగింపుగా వుండాలని కూడా భావించింది. ఈ నిర్ణయానుసారం, ఈ నియమావళిని మరొక ఐదేండ్ల వరకు పొడిగించవలసిందని రాష్ట్రప్రభుత్వం కేంద్ర ప్రభుత్వాన్ని కోరడం జరిగింది. అయితే, నిరవధికంగా ఈ రాయితీని పొడిగిస్తూ వుండడం రాష్ట్రంలోని ఉభయప్రాంతాల సమైక్యతా కృషికి భంగం కలుగుతుంది కనుక ఇదే చివరిసారిగా చేసిన పొడిగింపుగా భావించాలని కూడా రాష్ట్రప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. కనుక తెలంగాణాలో తహశీల్దారు పదవులతోపాటు సబార్డినేట్ సర్వీసులకు (నాన్—గెజిటెడ్ ఉద్యోగాలకు) నివాసయోగ్యత నిబంధనను పార్లమెంటరీ చట్టంద్వారా మరొక ఐదేండ్ల వరకు అంటే 20—3—1974 వరకు పొడిగించడం జరిగింది. హిమాచలప్రదేశ్, మణిపూర్, త్రిపుర రాష్ట్రాలలోకూడా తహశీల్దారు పదవులతోపాటు సబార్డినేట్ సర్వీసులకు (నాన్—గెజిటెడ్ సర్వీసులకు) నివాస నిబంధనను ఇదేవిధంగా పొడిగించడం జరిగింది.

పై నిబంధనలు రాజ్యాంగ రీత్యా చట్టసమ్మతం కాజాలవని సవాల్ చేసినప్పుడు భారత సుప్రీంకోర్టు 1957 వ సం॥పు పబ్లిక్ ఎంప్లాయ్‌మెంటు (నివాసయోగ్యతకు సంబంధించిన) చట్టంలో పేర్కొనబడిన తెలంగాణాప్రాంతములో ప్రభుత్వోద్యోగాల కొరకు నివాసయోగ్యతకు సంబంధించిన నిబంధనలు చెల్లనేరవని 28—3—1969 తేదీనాటి తీర్పులో కొట్టివేసింది. ఇప్పుడున్నట్లుగా రాజ్యాంగం యొక్క 16 (3) సూత్రం, నివాసయోగ్యత ప్రయోజనాల కొరకు రాష్ట్రమంతటినీ స్థానిక ప్రాంతంగా పరిగణిస్తున్నది. కాని రాష్ట్రంలో ఒక భాగానికి మాత్రమే కాదని సుప్రీంకోర్టు నిర్ణయించింది. సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన సందర్భంలో ముల్కీనిబంధనల క్రింద ఉద్యోగాలకు నివాసార్హత అమలుపరచడం న్యాయసమ్మతం కాగలదని రాష్ట్రప్రభుత్వం ప్రత్యామ్నాయంగా చేసిన వాదనను గమనించింది. అయితే ఈ విషయాన్ని గురించి సుప్రీంకోర్టు ఇదమిత్థమని నిర్ణయించి చెప్పలేదు. ఈ తీర్పు వచ్చిన వెంటనే, రాష్ట్ర మంత్రిమండలి పరిస్థితిని సమీక్షచేసి, ఉద్యోగావకాశాల విషయంలో తెలంగాణా ప్రాంత వాసులకు రక్షణ వుండడం అవసరమనీ, ఇది చాల అత్యవసరమైన విషయమనీ భావించింది. తత్ఫలితంగా ప్రభుత్వోద్యోగాల నియామకం కొరకు రాష్ట్రంలో ఏదైనా ఒక భాగానికికూడా నివాసయోగ్యతను నిర్ణయిస్తూ ఎంప్లాయిమెంటు చట్టం చేయడానికి వీలుగా భారత రాజ్యాంగం యొక్క 16(3) సూత్రపు నిబంధనలను సవరణ చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవలసిందని రాష్ట్రప్రభుత్వం 1969 ఏప్రిల్ నెలలో భారత ప్రభుత్వాన్ని కోరింది. ఈ విషయాలను పరిశీలించడానికి భారత ప్రభుత్వం ప్రధానమంత్రి అష్టసూత్ర ప్రణాళికలో పేర్కొన్నట్టుగా తెలంగాణా అభివృద్ధికి న్యాయవేత్తల సంఘాన్ని (వాంఛూ కమిటీని) నియమించింది. తెలంగాణా ప్రాంతానికి చెందిన ప్రజలకు అనుకూలంగా ప్రభుత్వోద్యోగాల విషయంలో రాజ్యాంగ రీత్యా అవసరమైన రక్షణలు కల్పించడానికీ, శాసన రీత్యా చర్యలు తీసుకోడానికీ తగిన సలహాలు పొందే ఉద్దేశంతో ఈ కమిటీ నియమింపబడింది.

## వాంఛూ కమిటీ

అయితే రాష్ట్రంలో ఒక భాగానికి చెందిన ప్రాంతీయులకు ఉద్యోగ నియామకాల విషయంలో రిజర్వేషను చేస్తూ రాజ్యాంగ సవరణ తీసుకొని రావడం సాధ్యం కాకపోవడమేకాక, వాంఛనీయం కాదని వాంఛూ కమిటీ అభిప్రాయపడింది. జిల్లాలో యల్.డి.సీ.లు టైపిస్టులవంటి పదవులకు నియామకాన్ని వికేంద్రీకరణచేసి, వాటిని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ పరిధినుంచి తొలగించి స్థానికంగా ఉద్యోగులను నియమించే అధికారాన్ని జిల్లా కలెక్టర్లకు అప్పగించే విషయంలో రాష్ట్రప్రభుత్వం తీసుకొన్న చర్యలను ఈ కమిటీ అభినందిస్తూ, ఆ పద్ధతిలోనే తృతీయ శ్రేణి పదవులకు (అంటే నాన్—గెజిటెడ్ ఉద్యోగాలు) అన్నింటికీ వికేంద్రీకరణ జరపాలని కూడా సిఫారసు చేసింది. తెలంగాణా ప్రాంతీయ సంఘానికి చెందిన ఉపసంఘం, వాంఛూ కమిటీ నివేదికను పరిశీలించి, కొన్ని సిఫార్సులు చేస్తూ సమర్పించిన నివేదికను తెలంగాణా ప్రాంతీయ సంఘం 8—12—1970 వ తేదీన ఆమోదించింది. ప్రాంతీయ సంఘంచేసిన ముఖ్యమైన సిఫారసులు క్లుప్తంగా దిగువ పేర్కొనబడినాయి—

(1) తెలంగాణా ప్రజల ప్రయోజనాలను కాపాడడానికి చట్టబద్ధమైన నిబంధన ప్రకారం తెలంగాణా జిల్లాల్లో సబార్డినేట్ సర్వీసులకు (నాన్—గెజిటెడ్ ఉద్యోగాలు) తెలంగాణా అభ్యర్థులను మాత్రమే నియమించడానికి, రాష్ట్రమంతటికీ వర్తించే కార్యాలయాలలో దామాషాప్రకారంగా తెలంగాణా ప్రాంతీయులనే నియమించడానికి వీలుగా భారత రాజ్యాంగపు 16 (3) సూత్రాన్ని తదనుగుణంగా సవరణ చేయవలసిందని కేంద్ర ప్రభుత్వాన్ని అభ్యర్థించాలి రాష్ట్ర ప్రభుత్వం. దాన్ని విధిగా అమలు జరపాలి.

(2) రాజ్యాంగ సవరణ జరిగేంతవరకు సబార్డినేట్ సర్వీసుల (నాన్—గెజిటెడ్ పదవులు)కు నియామక పద్ధతిని వికేంద్రీకరణ చేయాలి. నేరుగా నియమించే అధికారం జిల్లాస్థాయిలో సెలక్షన్ కమిటీలకు వుండాలి. ప్రాంతీయ స్థాయిలో స్థానిక ఉపాధికల్పన కేంద్రాలద్వారా అభ్యర్థుల ఎంపిక జరగాలి.

(3) మొదటి గెజిటెడ్ పదవులకు సర్వీసు కేడర్లను ప్రాంతీయకరణ చేయాలి.

భారత రాజ్యాంగం అమల్లోకి రాకముందు, ప్రభుత్వం లేక ఇతర అధికారిక సంఘం క్రింద ఉద్యోగ నియామకం కొరకు

15 ఏండ్ల నివాసయోగ్యత సంబంధించినంతవరకు, పూర్వపు హైదరాబాదు రాష్ట్రంలోవున్న ముల్కీ-నిబంధనలు చట్టం ప్రకారం అమల్లో వున్నట్లుగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఫుల్ బెంచి 9-12-1970వ తేదీన తీర్పు ఇచ్చింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించినంతవరకు, తెలంగాణా ప్రాంతంలో ఉన్నత పదవులకు, చిన్న పదవులకు అంటే గెజిటెడ్, నాన్-గెజిటెడ్ ఉద్యోగాలన్నింటికీ ముల్కీ-నిబంధనలు వర్తిస్తాయి. అప్పటి ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి 1970 డిసెంబరు 18వ తేదీన రాష్ట్ర శాసన సభలో ప్రభుత్వ విధానాన్ని వివరిస్తూ, తెలంగాణా ప్రాంతంలో ఉద్యోగావకాశాలను ఆ ప్రాంత ప్రజలకు మాత్రమే ప్రత్యేకించాలనే ప్రభుత్వ పాలసీని అమలు చేయడంలో పై తీర్పువల్ల సౌలభ్య మేర్పడుతున్న కారణాన ఆ తీర్పును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పాటిస్తుందని ప్రకటన చేశారు. ఆ తీర్పును అమలు పరచడంవల్ల గెజిటెడ్ సర్వీసులతోపాటు కొన్నివర్గాల సర్వీసులను ప్రాంతీయ కరణ చేయడానికిన్నీ, సెక్రటేరియట్, శాఖాధిపతుల ఉమ్మడి కార్యాలయాలలోని పదవుల విషయంలో అవసరమైనట్లుగా నివాస యోగ్యత నియమావళిని మినహాయింపు చేయటానికిన్నీ, కొన్ని పరిపాలనా విధమైన చర్యలు తీసుకోవడం ఆవసరమవుతుందని కూడ ఆ ప్రకటనలో సూచించబడింది. ముఖ్యమంత్రి ప్రకటన వ్యాసం చివరలో ఇవ్వబడింది.

## సర్వీసుల ప్రాంతీయకరణ

ప్రధానమంత్రి అధ్యక్షతన 17-10-1969 లో తెలంగాణా వ్యవహారాల పరిశీలక సంఘం ప్రథమ సమావేశంలో అప్పటి దేశీయాంగ శాఖమంత్రి శ్రీ వై. బి. చవాన్ సర్వీసు వ్యవహారాలకు సంబంధించి తెలంగాణా ఉద్యోగుల కష్టనిష్టూరాలను గురించి చర్చలు జరిపిన సందర్భంలో "రాష్ట్ర కేడర్ల విభజన చేయవచ్చు. దీనితో సమస్య పరిష్కారం కావచ్చు" అని సూచించారు. ఈ సూచన సర్వీసు కేడర్ల ప్రాంతీయకరణ భావానికి దారితీసింది. ఆంధ్రప్రదేశ్‌లో సర్వీసు కేడర్లలో రాష్ట్రమంతటికీ వర్తించే ప్రస్తుతపు నియామకపు యూనిట్ల స్థానే ఒకటికి మించిన యూనిట్లు సృష్టించాలనే ప్రాతిపదికపైన ఆధారపడిన ఈ సూచన సర్వీసు కేడర్ల ప్రాంతీయకరణ భావాన్ని రూపొందించింది. ప్రతి ప్రభుత్వ శాఖలో వివిధ సబార్డినేట్ సర్వీసులు, మొదటి గెజిటెడ్ స్థాయి వరకు రాష్ట్ర సర్వీసులను ప్రాంతీయకరణ చేయడానికి తాత్కాలికంగా ముసాయిదా పథకం తయారు చేయబడింది. అఖిలభారత సర్వీసులకు ఫీడర్లుగాఉన్న పదవులు, ఉమ్మడి కార్యాలయాలలోని పదవులు ఈ పథకంనుంచి మినహాయించబడినాయి.

ఆ తరువాత, ముల్కీ-నిబంధనలు చట్టసమ్మతమైనవని హైకోర్టుతీర్పు ఇచ్చినప్పుడు, శాఖాధిపతుల క్రిందిస్థాయి వరకు అన్నివర్గాల సర్వీసు కేడర్లకు ప్రాంతీయకరణ చేయడానికి కొత్త ప్రతిపాదనలు చేయబడినాయి. అయితే ఇందులో :

(1) సెక్రటేరియట్ శాఖలు, శాఖాధిపతులు, రాష్ట్రమంతటికీ విస్తరించిన ఇతర పదవులు మున్నగు ఉమ్మడి శాఖలలోని పదవులు ;

(2) రాష్ట్రమంతటికీ ఉపకరిస్తున్న ఉమ్మడి సంస్థలలోని పదవులు (ఇవి ఆంధ్ర, తెలంగాణా ప్రాంతాలు నిష్పత్తిలో ఖర్చును భరిస్తున్న సంస్థలై వుండాలి)

మినహాయించబడినాయి. ఈ ప్రతిపాదనలద్వారా ప్రమోషన్లకు సంబంధించినంతవరకు ఏ ప్రాంతంవారికి ఆ ప్రాంతంలోని అవకాశాలు లభ్యమౌతాయి. రిజర్వేషనుదృష్ట్యా తెలంగాణావారికి తమ ప్రాంతంలోనే కాక మిగతా ప్రాంతంలోకూడ ప్రమోషన్లు లభ్యమయ్యే అవకాశం ఉండకుండా ఉభయులకు న్యాయం జరుగుతుంది. అందుకనే ఈ ప్రతిపాదనలకు ఉభయ ప్రాంతాలలో అత్యధిక సంఖ్యలో సర్వీసు సంఘాలు ఆమోదించాయి. ముల్కీ-నిబంధనలు, సర్వీసు కేడర్ల ప్రాంతీయకరణకొరకు చేయబడిన ప్రతిపాదనలను మంత్రిమండలి పరిశీలించి, వాటిని 1971 ఏప్రిల్‌లో భారత ప్రభుత్వ అభిప్రాయంకొరకు పంపడం జరిగింది. అప్పటి ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి కేంద్ర ప్రభుత్వ దేశీయాంగ వ్యవహారాల సహాయక మంత్రి శ్రీ కె. సి. పంత్‌కు ఒక లేఖవ్రాస్తూ, హైకోర్టు తీర్పుదృష్ట్యా ఉత్పన్నమైన న్యాయ సంబంధ పరిపాలనా సంబంధమైన అంశాల విషయంలో భారత ప్రభుత్వ అభిప్రాయాలను రాష్ట్రప్రభుత్వానికి తెలుపవలసిందని కోరారు. హైకోర్టు తీర్పు వ్యాపక పరిణామాలకు దారితీస్తున్న దృష్ట్యా కొన్ని సందేహాలు ఉద్భవిస్తున్న దృష్ట్యా ముల్కీ-నిబంధనలు అమలు పరచడానికి ముందు, కొన్ని సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించవలసిన అవసరం ఏర్పడిందని ఆయన వ్రాశారు. తెలంగాణా ప్రాంతీయ సంఘం 29-6-1971 వ తేదీన మూడవ నివేదికను ఆమోదిస్తూ భారతప్రభుత్వ నిర్ణయం వచ్చేంతవరకు వేచివుండకుండా ముల్కీ-నిబంధనలను అమలు పరచడానికి వెంటనే చర్యలు తీసుకోవాలని సిఫారసు చేసింది. ఈ నిబంధనలను నిష్ప్రయోజనం చేసేందుకు ఎవ్వరికీ ఎట్టి అవకాశమూ వుండరాదనీ, శాసనరీత్యా, అవసరమైన చర్యలు తీసుకోవడం ద్వారా కానీ, లేక రాజ్యాంగాన్ని సవరణ చేయడం ద్వారా కానీ తగిన చర్యలు తీసుకొనే విషయంలో కేంద్ర ప్రభుత్వము, రాష్ట్ర ప్రభుత్వము శ్రద్ధ వహించాలనీ ప్రాంతీయ సంఘం అభిప్రాయం వెలిబుచ్చింది.

ఈ లోపల మరొక కేసులో హైకోర్టు డివిజన్ బెంచి రిట్ అప్పీలు నెం. 633/70 ని పరిశీలిస్తూ ఐదుమంది జడ్జీలతో కూడిన హైకోర్టు పూర్తిబెంచి ముల్కీ-నిబంధనల చెల్లుబడికి సంబంధించిన అన్ని సమస్యలను పరిశీలించాలని ఒక సూచన చేసింది. తదనుగుణంగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయాధీశులు ఈ సమస్యను ఐదుమంది జడ్జీలతోకూడిన బెంచికి నివేదించారు. ఈ విధంగా ఈ సమస్య మరొకసారి ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకుచెందిన పూర్తిబెంచి సమక్షంలో పునఃపరిశీలనకై వెళ్ళిన కారణాన, హైకోర్టు తీర్పు వచ్చేలోపల కేంద్ర ప్రభుత్వస్థాయిలో ఈ సమస్యను పరిశీలించడం వాయిదా వేయవలసి వస్తుందని భారత ప్రభుత్వం 1971 నవంబరులో రాష్ట్ర ప్రభుత్వానికి తెలిపింది. ఈ రిట్ అప్పీలుపైన హైకోర్టు 14-2-1972 వ తేదీన తీర్పు ఇస్తూ 1-11-1956 తరువాత ముల్కీ నిబంధనలు చెల్లనేరవని

మెజారిటీ తీర్పు ఇచ్చింది. దీనితో అంతకు ముందు 9-12-1970 తేదీనాటి తీర్పు తలక్రిందులైంది.

## సుప్రీంకోర్టు తీర్పు

పబ్లిక్ ఎంప్లాయ్‌మెంట్ చట్టాన్ని కొట్టివేయడంతో ముల్కీ నిబంధనలు తప్పనిసరిగా పునరుద్ధరించబడడానికి దారితీసుందనే అభిప్రాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తరఫున వాంఛూ కమిటీకి తెలపడం జరిగింది. ముల్కీ నిబంధనలు చెల్లుతాయని హైకోర్టు ఇచ్చిన తీర్పుపై 18-12-70వ తేదీన అప్పటి ముఖ్యమంత్రి చేసిన ప్రకటన ప్రభుత్వ స్పష్టమైన అభిప్రాయాలు, విధానాలపై ఆధారపడివుంది. రాష్ట్ర ప్రభుత్వం ముల్కీ నిబంధనల విషయంలో పూర్వంనుంచీ అనుసరిస్తూ వచ్చిన అనుకూల విధానానికి అనుగుణంగా హైకోర్టు పూర్తి బెంచివారిచ్చిన తీర్పుపైన సుప్రీంకోర్టుకు అప్పీలు చేసింది. సుప్రీంకోర్టు 3-10-1972 తేదీన తీర్పు ఇస్తూ ఆంధ్రప్రదేశ్ అవతరించిన తరువాత కూడా ముల్కీ నిబంధనలు అమల్లో వున్నాయనీ, అవి చట్టసమ్మతమైనవనీ ప్రకటించింది. ఈ తీర్పు రాగానే ముల్కీ నిబంధనల వర్తింపును గురించి, అవి అమలులో ఉండేకాలపరిమితిని గురించి, రాజధానీ నగర ప్రతిపత్తిని గురించి రాష్ట్ర వ్యాప్తంగా వాద ప్రవాదాలు బయలుదేరాయి. ఒకే రాష్ట్రంలో వివిధ ప్రాంతాల మధ్య ముల్కీ నిబంధనలవంటి ప్రతిబంధకాలు వుండడంవల్ల చివరకు వేర్పాటు ధోరణులు బలపడి, ఉభయ ప్రాంతాలలో భావసమైక్యతకు భంగంకలిగే ప్రమాదం వుంటుందని ఆంధ్రప్రాంతంలో పలువురు అభిప్రాయపడుతున్నారు. కనుక సాధ్యమైనంత త్వరలో ఇట్టి ప్రతిబంధకాలను తొలగించాలని కోరడం జరుగుతున్నది.

పైన పేర్కొన్న అంశాల విషయాలను గురించి జరిగిన చర్చలలో తేలినదేమంటే ముల్కీ నిబంధనల అమలుకు సంబంధించిన కాలపరిమితి ప్రధానమైన సమస్య అని. ఈ కాల పరిమితి స్వల్పంగా వున్నట్లయితే, ముల్కీ నిబంధనలు ఏ ఉద్యోగాలకు వర్తించాలి, ఏ భాగంలో వర్తించాలి అన్న ప్రశ్నలకు సమాధానం దొరకడంలో పెద్ద అడ్డంకులేమీ ఉండవు.

కాలనిర్ణయం చేసే సందర్భంలో దిగువ పేర్కొన్న అంశాలు దృష్టిలో పెట్టుకొని పరిశీలన చేయవలసి వుంటుంది.

(అ) పబ్లిక్ ఎంప్లాయ్‌మెంట్ చట్టాన్ని 1974 వరకు అమల్లో వుండేటట్లు చేయడం ఇదివరకే జరిగింది. అయితే 1969లో సుప్రీంకోర్టు దీన్ని కొట్టివేసింది. తత్ఫలితంగా ఈ చట్టంక్రింద తెలంగాణా ప్రాంతానికి సంక్రమించవలసిన రక్షణలు 1974కు బదులు 1969లోనే నిలిచిపోయాయి.

(ఆ) దీనిదృష్ట్యా ముల్కీ నిబంధనలను 1974 తరువాత మరొక మూడు సంవత్సరాల వరకు అమల్లో ఉంచడం యుక్తియుక్తమౌతుంది.

## హైదరాబాదు నగరం

సుప్రీంకోర్టు చట్టసమ్మతమని ప్రకటించిన ముల్కీ నిబంధనల అమలు విషయంలో చర్యతీసుకోడానికి ముందే, ఈ నిబంధనల అమలునుంచి హైదరాబాదు నగరాన్ని మినహాయించాలని డిమాండు బైలుదేరింది. ఈ డిమాండు ముఖ్యంగా ఈ సమయములో రావడాన్ని తెలంగాణావారు ప్రతిఘటించారు. వారు చూపించిన కారణాలు ఇవి :

(1) ముల్కీ నిబంధనలు చట్టసమ్మతమైనవని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినవెంటనే, దానివల్ల లాభం పొందవలసిన వారికి ప్రయోజనం కలగడానికి ముందుగానే, వాటిని రద్దుచేయమని కోరడం భావ్యంకాదు.

(2) తెలంగాణా ప్రాంతంలోని మొత్తం పదవులతో పోల్చిచూచినట్లయితే, హైదరాబాదు నగరంలో ఉద్యోగాల శాతం చాలా హెచ్చుగావుంది. గెజిటెడ్ వర్గాలలో మూడోవంతు పదవులు నగరంలోనే ఉన్నాయి. ఇంత పెద్దయెత్తున ఉద్యోగావకాశాలను, తెలంగాణా ప్రజలకు ఇప్పుడే నిరాకరించడం సముచితంకాదు.

(3) ప్రస్తుతం వున్న నివాస నిబంధనలవల్ల జంటనగరాలలో అల్పసంఖ్యాక వర్గాలవారికి కొంతవరకైనా కొన్ని ఉద్యోగాలు లభిస్తున్నాయి. ఈ నిబంధనలను రద్దుచేసినట్లయితే వారికి ప్రస్తుతంవున్న కొద్దిపాటి ఉద్యోగావకాశాలు పూర్తిగా అంతరించిపోతాయి. ఇది వాంఛనీయంకాదు. కొంతకాలం వరకైనా వారికి ఈ అవకాశాలు లభించేట్టువుండాలి.

(4) తెలంగాణా ఆందోళన హైదరాబాదు నగరంలోనే చాలా యెక్కువగావుండింది. ఆ కాలంలో జరిగిన సంఘటనలన్నీ ప్రజల స్మృతి పథంలో ఇంకా మెలగుతూనే వున్నాయి. ఇట్టి సమయంలో ప్రజల మనోభావాలను ఉద్రేకపరచకుండా చేయడంలోనే విజ్ఞతవుంది.

(5) రాజధానీ నగరం మన అందరిదీ అనే భావం, ఆశయం ఆంధ్రులలో ఏర్పడడం ప్రశంసనీయమైన విషయమే. అయితే, బహుముఖ కార్యక్రమాలద్వారా ప్రతిబంధకాలను కాల క్రమేణా సడలించి, ఈ ఆశయం సాధించవలసి వుంటుంది. ఒక్కుమ్మడిగా చేయాలంటే అసలు ఆశయమే దెబ్బతినవచ్చు.

(6) రాజధానీ నగరంలో ఉమ్మడి సంస్థల సంఖ్యను హెచ్చించడం ద్వారనే ఈ సమస్య పరిష్కారమౌతుంది. అలాంటి సంస్థలలో అందరికీ ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. నగరంలో ఇకమీదటినుంచి ఆరంభించబడే ఏ సంస్థఅయినా ఉభయ ప్రాంతాలకు ఉమ్మడిగా వుండాలనే సూత్రాన్నికూడా అంగీకరించవచ్చును.

పై కారణాలమాట ఎలాగున్నా, ముల్కీ నిబంధనలవంటి చట్టం శాశ్వతంగా కొనసాగడానికి వీలులేదు. భారతదేశం నడిబొడ్డున ఇలాంటి పాతకాలంనాటి చట్టాలు దీర్ఘకాలం వరకు అమలులో ఉండడం వల్ల వేర్పాటు మనస్తత్వాలు బలపడడం వాంఛనీయం కాదు. అంతేకాకుండా ఇతర నగరాల మాదిరే హైదరాబాదు నగరం కూడా అందరికీ అందుబాటులో ఉండాలి;

అందరికీ చెందినదిగా ఉండాలి. కాబట్టి ముల్కీ నిబంధనల కాల పరిమితిని విధించడానికి పూనుకునే సందర్భంలో హైదరాబాదు నగరానికీ, మిగతా తెలంగాణా ప్రాంతానికీ మధ్య వ్యత్యాసాన్ని గుర్తించడం యుక్తియుక్తంగానే వుంటుంది. ఈ వ్యత్యాసం ఆధారంగా, నగర కార్యాలయాలు, సంస్థలలో రిక్రూట్‌మెంటు విషయంలో ముల్కీ నిబంధనల అమలుకు సంబంధించిన కాల పరిమితి కొంతతక్కువగా వుండవచ్చు. ఇది జరిగినట్లయితే, మిగతా తెలంగాణా ప్రాంతానికి యెక్కువ కాలవ్యవధి ఇవ్వడం ఆమోదయోగ్యమవుతుంది.

## పంచసూత్ర పథకం

ఇంచుమించుగా పై విషయాల ఆధారంగా ప్రధానమంత్రి పంచసూత్ర పథకం ఏర్పాటుచేయబడిందని చెప్పడంలో అతిశయోక్తి లేదు. ఈ సూత్రం వివరాలు, వ్యాసం చివరలో యివ్వబడినాయి. ఆంధ్రప్రాంతం వారి కోరికల దృష్ట్యా ఈ పథకం సన్నిహితంగావుంది. ఎందుకంటే, చాలవరకు గెజిటెడ్ పదవులు ముల్కీ నిబంధనల అమలునుంచి మినహాయించబడడమే కాకుండా వాటికి అమలు కాలం కూడా పరిమితం చేయబడింది. హైదరాబాదు నగరానికి ఒక గడువు మిగతా తెలంగాణా ప్రాంతానికి మరొక గడువు నిర్ణయించడంతో హైదరాబాదు నగానికి గల ప్రత్యేక హోదాను ఈ పథకం గుర్తిస్తున్నది. హైదరాబాదు నగరంలో ఆంధ్ర విద్యార్థులకు విశేష విద్యా సౌకర్యాలు కల్పించడంతోపాటు, ఈ పథకం ఆంధ్రప్రాంతం అవసరాలను కోర్కెలను చాల వరకు తీర్చగలదు.

తెలంగాణాప్రాంతం విషయంలో ఈ పథకాన్ని గత చరిత్ర దృష్ట్యా పరిశీలించవలసి ఉంటుంది. ఒక ఒప్పందం చేసుకొన్న సందర్భంలో ఆంధ్రప్రదేశ్ అవతరించింది. దాని ఫలితంగా, పూర్వపు ముల్కీనిబంధనల స్థానే పబ్లిక్ ఎంప్లాయ్‌మెంట్ చట్టం ఏర్పాటు చేయబడింది. అంటే అన్ని ఉద్యోగాలకు వర్తించే పూర్వపు ముల్కీనిబంధనల స్థానే సబార్డినేట్ సర్వీసుల వరకు మాత్రమే పరిమితం చేయబడిన పబ్లిక్ ఎంప్లాయ్‌మెంట్ చట్టం అమలులోకి వచ్చింది. కాలవ్యవధి విషయంలో కూడ ఐదేండ్ల గడువు మాత్రమే నిర్ణయించబడింది. ఆ గడువును చట్టసవరణ ద్వారా ఆఖరుసారిగా 1974 వరకు పొడిగించడం జరిగింది. అయితే పబ్లిక్ ఎంప్లాయ్‌మెంట్ చట్టం రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంతో దానికి పూర్వం అమలులోఉన్న ముల్కీనిబంధనలు ఇప్పుడు చట్టసమ్మతంగా పునరుద్ధరించబడినాయి. ఇక్కడ గమనించవలసిందేమంటే పబ్లిక్ ఎంప్లాయ్‌మెంట్ చట్టం కేవలం సాంకేతిక కారణాలవల్ల కొట్టివేయబడింది. చట్టంలోని ప్రధాన సూత్రాలతోగాని లేక చట్టానికి ఆధారభూతమైన ఒప్పందపు షరతుల లోపాలవల్లగాని, దానిని కొట్టివేయడం జరుగలేదు. దీని తాత్పర్యమేమంటే ముల్కీనిబంధనల పునరుద్ధరణ కూడా ప్రధానంగా సాంకేతికమైనదిగా మాత్రమే పరిగణించబడాలి. ఎందుకంటే ముల్కీనిబంధనల పూర్వస్వరూపంలో వాటిని చట్టంద్వారా ఒప్పందంలోనూ అంగీకరించడం జరుగలేదు.

శాసించడమూ జరుగలేదు. వాస్తవమేమంటే, ముల్కీ నిబంధనలు, అటువంటి ప్రత్యేక రాయితీలు రాజ్యాంగానికి పూర్వం భారత దేశంలో యెక్కడ అమల్లో వున్నా ప్రభుత్వోద్యోగాలలో స్థానిక నివాస షరతు వరకు మాత్రమే తెలంగాణావంటి కొద్ది ప్రాంతాలవరకు నిర్ణీత కాలానికి మాత్రం కొనసాగిస్తూ మిగతా భారత దేశమంతటా వాటిని మూక ఉమ్మడిగా రద్దు చేయడమే జరిగింది. కనుక నేడు తెలంగాణాలో ముల్కీ నిబంధనలను నైజాం గారి కాలంలో వలె యథాతథంగా, సంపూర్ణంగా అమలు జరపాలని కోరడం సహేతుకమూ కాదు. చారిత్రికంగా సమర్థనీయమూ అనిపించు కోదు. ఇదే వాస్తవం, నగ్న సత్యం, ఎంత త్వరగా దీన్ని గుర్తిస్తే, అందరికి అంత శ్రేయస్కరమౌతుంది.

ఈ వాస్తవ పరిస్థితిని అంగీకరించినట్లయితే ప్రధానమంత్రి పంచసూత్ర పథకం తెలంగాణా ప్రాంతానికి కూడా యెంతో అనుకూలంగా ఉందని స్పష్టమౌతుంది. ఈ పథకంలో ముల్కీ నిబంధనలు నాన్–గెజిటెడ్ ఉద్యోగాలన్నింటితోపాటు మూడు తరగతుల గెజిటెడ్ ఉద్యోగాలకు అంటే తహశీల్‌దార్లు జూనియర్ ఇంజనీర్లు, అసిస్టెంటు సివిల్ సర్జనులకు వర్తిస్తాయి. కాబట్టి అధిక సంఖ్యలో నియామకాలు జరిగే ఉద్యోగాలకు ఈ పథకం ముల్కీ నిబంధనలను వర్తింప జేస్తుంది. తెలంగాణా ప్రాంతపు సాంకేతిక పట్టభద్రుల ఆకాంక్షలను ఇది తృప్తి పరుస్తుంది. ముల్కీ నిబంధనలు అమలు జరిగే కాలపరిమితి విషయంలో కూడా తెలంగాణాకు అన్యాయము జరగలేదు. ఎందుకంటే పబ్లిక్ ఎంప్లాయ్‌మెంట్ చట్టం దృష్ట్యా సహజంగా 1974లో అంతం కావలసిన రక్షణలు ఇప్పుడు 1977 మరియు 1980 వరకు అమల్లో వుంటాయి. ఇంత దీర్ఘకాలం అనగా 1980 వరకు కూడా తెలంగాణా ప్రాంతం అభివృద్ధిలోనూ విద్యా విషయికంగానూ సముచిత స్థాయికి చేరుకోజాలదన్న నిరాశావాదానికి ఎలాటి ఆస్కారంలేదు. కాబట్టి ప్రధాని పంచసూత్ర పథకం ప్రకారం తెలంగాణా రక్షణలకు లభించిన అధనపు గడువు సమంజసమైనదనే అంగీకరించవలసి ఉంటుంది ఉమ్మడి కార్యాలయాలలో నాన్–గెజిటెడ్ పదవులకు రిక్రూట్మెంటు విషయంలో ముల్కీ నిబంధనలను మూడు ఖాళీ ఉద్యోగాల యూనిట్‌లో ప్రతి రెండవ ఖాళీ ఉద్యోగానికి వర్తింపచేయడంతో ప్రధాని పథకం తెలంగాణాకు తగిన న్యాయం కలిగిస్తున్నది.

## ప్రమోషన్లకు తగిన అవకాశాలు

ప్రధానమంత్రి ప్రణాళికలో పేర్కొనబడిన ప్రాంతీయకరణ పథకంవల్ల, ఉభయ ప్రాంతాల ఉద్యోగులకు నిర్దిష్ట స్థాయివరకు తగిన ప్రమోషను అవకాశాలు కల్పించబడినాయి. ఈ పథకం పట్ల సర్వీసు సంస్థల దృక్పథం చాలావరకు వాటి వాటి తక్షణ ప్రయోజనాల ననుసరించి వున్నప్పటికీ, ఉభయ ప్రాంతాల ఉద్యోగులు సహజంగా దీన్ని ఆమోదిస్తారు. ఆహ్వానిస్తారు కూడా.

ఈ సమస్యను సరియైన దృక్పథంతో పరిశీలించినప్పుడే ప్రధానమంత్రి పంచసూత్ర పథకం సరిగా అవగతమౌతుంది. మొట్ట మొదట గమనించవలసిందేమంటే, సమైక్య ఆంధ్రప్రదేశ్ మనుగడను దృష్టిలో పెట్టుకొని ఈ పథకం రూపొందించబడింది.

తదనుగుణంగానే సమంజసమైన పరిష్కారం కనుగొనడానికి ప్రయత్నం జరిగింది. రెండవ విషయమేమిటంటే స్వల్పకాలిక పరిస్థితితో, దీర్ఘకాలిక ఆశయాన్ని జోడించడానికి ప్రయత్నం జరిగింది. మూడో విషయమేమిటంటే, ఇది రాజీ పద్ధతిలో ఒక పరిష్కార మార్గాన్ని చూపుతున్నది. ఉభయ ప్రాంతాలకు అంగీకార యోగ్యం కావాలంటే దీనికన్న ఉత్తమమైన పద్ధతి మరొకటి దొరకడం కష్టం. నాల్గో విషయం, అన్నిటికంటే ముఖ్యమైనదేమంటే దేశ వ్యాప్తమైన దుష్పరిణామాలకు దారి తీయగలిగే ఈ సున్నితమైన అంతర్-ప్రాంతీయ సమస్యా పరిష్కారానికి మన ప్రధాన మంత్రి చేస్తున్న నిరంతర కృషికి ఈ పథకం ప్రత్యక్ష తార్కాణమనడంలో సందేహం లేదు.

## 1970 డిసెంబరు 18 తేదీన అప్పటి ముఖ్యమంత్రి, శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి శాసనసభలో చేసిన ప్రకటన

రాజ్యాంగము అమలులోకి రాకపూర్వం హైదరాబాదు సంస్థానంలో నిజాము ఫర్మానాద్వారా జారీచేసిన ముల్కీ నిబంధనలుగా వ్యవహరించబడే కొన్ని నిబంధనలు అమలులో ఉండేవి. స్థూలంగా చెప్పాలంటే ప్రత్యేకంగా నిజాము అనుమతిలేనిదే ఉన్నత పదవిలోగానీ, చిన్న పదవిలోగానీ ముల్కీ కాని వ్యక్తిని నియమించరాదని యీ నిబంధనలు నిర్దేశిస్తున్నవి. ముల్కీ లేక నియామక అర్హత సంపాదించాలంటే హైదరాబాదు సంస్థానంలో కనీసం 15 సంవత్సరాలపాటు శాశ్వత నివాసం కలిగి ఉండాలని యీ నిబంధన సూచిస్తున్నది. రాజ్యాంగం అమలులోకి వచ్చిన తర్వాత, 1955 లో హైదరాబాదు రాజప్రముఖ్ హైదరాబాదు సాధారణ నియమకాల నియమావళి జారీచేశారు. అందులో అంతకుముందు ఉన్న ముల్కీ నిబంధనల సారాంశాన్ని చేర్చడం జరిగింది.

ఆంధ్రప్రదేశ్ అవతరణ సమయంలో ఆంధ్ర–తెలంగాణా ప్రాంతాల నాయకులు కలిసి ఒక పెద్ద మనుషుల ఒప్పందాన్ని కుదుర్చుకొన్న విషయం సభ్యులకు తెలుసు. ఈ ఒప్పందంలో ఇతర విషయాలతోపాటు, తెలంగాణా ప్రాంతంలో సబార్డినేట్ ఉద్యోగాల నియామకాలకు సంబంధించి, ఆ ప్రాంతాన్ని ఐదు సంవత్సరాలపాటు ఒక యూనిటుగా భావించడం జరుగుతుందనీ, వాటికి సంబంధించిన ఉద్యోగాలను హైదరాబాదు నిబంధనల క్రింద నిర్దేశించిన నివాసపు షరతులను సంతృప్తికరంగా పూర్తిచేసే వ్యక్తులకు రిజర్వు చేయాలనీ, తాత్కాలికంగా ఒక నిబంధన చేయబడింది. తదనుగుణంగానే ఆంధ్రప్రదేశ్ అవతరణ తర్వాత రాజ్యాంగపు 309వ సూత్రం క్రింద కొన్ని నిబంధనలు జారీ చేయబడినాయి. ఈ నిబంధనలను అనుసరించి, తెలంగాణాలో జిల్లాస్థాయి కార్యాలయాలలో సబార్డినేటు సర్వీసులకు అన్ని ఖాళీలలో నేరుగా జరిగే నియామకాలనూ, రాజధానిలోఉన్న సచివాలయం, యితర శాఖాధిపతుల కార్యాలయాలలో సబార్డినేటు సర్వీసులకు నేరుగా జరిగే నియామకాలలో ప్రతి మూడు ఖాళీ ఉద్యోగాలుగల యూనిట్‌లో రెండవ ఖాళీ ఉద్యోగాన్నీ, తెలంగాణాలో 15 సంవత్సరాల నివాసార్హతగల అభ్యర్థులకు రిజర్వు చేయాలి. 1957లో పబ్లిక్ ఎంప్లాయిమెంట్ (నివాసార్హత) చట్టాన్ని పార్లమెంటు చేసింది. 1959 లో యీ చట్టాన్ని ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేశారు. ఈ చట్టాన్ని, అనుసరించి కేంద్ర ప్రభుత్వం రూపొందించిన నిబంధనల ప్రకారం తెలంగాణా ప్రాంతంలో రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు లేక స్థానిక సంస్థల ఆధ్వర్యంలోని కార్యాలయాల (కంటోన్మెంటు బోర్డు మినహా)లో ఉద్యోగాలకు దరఖాస్తులు కోరబడిన ఆఖరు తేదీ నాటికి తెలంగాణా ప్రాంతంలో అభ్యర్థికి 15 సంవత్సరాల నివాసార్హతవుంటే తప్ప అతను ఆ పదవిలో నియమించబడడానికి అర్హుడు కాడు. కోరిన పక్షంలో, అధికారి సమక్షంలో నివాసార్హతకు సంబంధించిన యోగ్యతా పత్రం దాఖలు చేయవలసి వుంటుంది. జంట నగరాలలోని సచివాలయ శాఖలలోను, శాఖాధిపతుల కార్యాలయాలలోను నేరుగా నియామకం జరిగే ప్రతి మూడు ఖాళీల యూనిటులో రెండవ ఖాళీఉద్యోగానికి యీ నివాసార్హత నిబంధన వర్తిస్తుందని కూడా యీ నియామావళిలో పేర్కొనబడింది. రాష్ట్ర ప్రభుత్వం అధ్వర్యంలో అన్ని నాన్ గెజిటెడ్ ఉద్యోగాలు, తహసీల్దార్ ఉద్యోగాలు, స్థానిక సంస్థల ఉద్యోగాలకు యీ నిబంధనలు వర్తిస్తాయి. కనీస వేతనం నెల 1కి 300 లేక స్థిర జీతం ఆ మొత్తానికి మించని ఉద్యోగాలకు ఈ నిబంధనలు వర్తిస్తాయి. ఐదు సంవత్సరాలవరకు మాత్రమే యీ నిబంధనలు అమలులో ఉంటాయని ప్రారంభంలో యీ చట్టం నిర్దేశించింది. అయితే, ఆ తర్వాత సవరణద్వారా మరో 5 సంవత్సరాల వరకు యీ గడువు పొడిగించబడింది. 1969లో యీ గడువు పూర్తి కావలసి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం యీ విషయాన్ని పరిశీలించిన తరువాత యీ చట్టం అమలును మరో 5 సంవత్సరాలు పొడిగించాలని కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. కేంద్ర ప్రభుత్వం యీ సిఫార్సును అంగీకరించి, మరో 5 సంవత్సరాలపాటు అంటే 1974 వరకు పైన పేర్కొన్న చట్టం అమలులో ఉండే విధంగా పార్లమెంటుద్వారా 1969 వ సం॥ పబ్లిక్ ఎంప్లాయ్‌మెంటు (నివాసార్హత) సవరణ చట్టాన్ని రూపొందించింది. ఈలోపుగా యీ చట్టంలోని కొన్ని అంశాలు రాజ్యాంగ విరుద్ధమని సవాలు చేయబడింది. తెలంగాణాకు సంబంధించినంత వరకు యీ నిబంధనలు రాజ్యాంగపు 16 (3) సూత్రానికి భంగకరంగా ఉన్నాయనే కారణం పైన సుప్రీంకోర్టు వాటిని కొట్టివేసింది. రాష్ట్రంలో ఒక ప్రాంతానికి మాత్రమే ప్రభుత్వ ఉద్యోగాలకు నివాసార్హత నిర్ణయించడం యీ సూత్రంలో ప్రతిపాదించబడలేదు. సుప్రీమ్‌కోర్టు తీర్పును దృష్టిలో ఉంచుకొని రాష్ట్రంలో ఒక ప్రాంతానికి, నివాసార్హతను వర్తింపజేసే విధంగా రాజ్యాంగాన్ని సవరించేందుకు చర్య తీసుకోవలసిందిగా రాష్ట్ర ప్రభుత్వం, కేంద్రప్రభుత్వాన్ని కోరింది. అయితే యీ విషయాన్ని పరిశీలించడానికి కేంద్రప్రభుత్వం నియమించిన న్యాయవేత్తల సంఘం యీ విధమైన సవరణకు సుముఖత వ్యక్తం చేయలేదు.

సుప్రీమ్‌కోర్టు తీర్పు దష్ట్యా 1959 సం. పు పబ్లిక్ ఎంప్లాయ్‌మెంట్ నియమావళి క్రింద పేర్కొన్న ప్రకారం, తెలంగాణా

ప్రాంతంలోగాని లేక ఉమ్మడి కార్యాలయాల్లోగాని ఉద్యోగనియామకాల విషయంలో నివాసార్హతను అమలుపరచడానికి రాష్ట్ర ప్రభుత్వానికి సాధ్యం కావడంలేదు. అందువల్ల రాజ్యాంగానికి భంగం కలిగించకుండా, స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం వివిధ ప్రత్యామ్నాయ చర్యలను పరిశీలించవలసి వచ్చింది. ఈ సందర్భంలోనే గ్రూప్ 4 సర్వీసులకు అంటే మినిస్టీరియల్ సర్వీసులకు రిక్రూట్మెంటును వికేంద్రీకరణ చేయడానికి ప్రభుత్వం నిర్ణయం చేసింది. అంతేకాకుండా భారత ప్రభుత్వ సలహాపైన సర్వీసు కేడర్ల ప్రాంతీయకరణకు కూడా ప్రభుత్వం పూనుకొనింది. సర్వీసుల సమీకరణ, ఉమ్మడి గ్రేడేషన్ జాబితాకు సంబంధించి వివిధ శాఖలు ఎదుర్కొంటున్న జటిలమైన సమస్యల పరిష్కారానికి ఈ చర్య దోహదకారి కాగలదు.

ప్రభుత్వోద్యోగాలలో నియామకం కొరకు 15 ఏండ్ల నివాసార్హత ఉండాలి అన్న నిబంధనకు సంబంధించినంత వరకు రాజ్యాంగం అమల్లోకి రాక పూర్వం, హైదరాబాదులో ప్రభుత్వోద్యోగాలకు ముల్కీ నిబంధనలు రాష్ట్రపు తెలంగాణా ప్రాంతంలో కొనసాగడం చట్ట సమ్మతమైనదని ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు ఫుల్‌బెంచి ఇటీవల వచ్చిన నెం. 470/1968 మొన్నగు రిట్ పిటిషన్ల విషయంలో తీర్పు ఇచ్చింది.

తెలంగాణాలో ఉద్యోగావకాశాలు ఆ ప్రాంతం ప్రజలకు లభించే విధంగా తగిన రక్షణలు కల్పించటం మొదటి నుంచీ ప్రభుత్వ లక్ష్యమై వున్నదనే విషయం గమనించాలి. ఈ విషయంలో హైకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పును పాటించడం ప్రభుత్వ ఆశయమై వుంది.

హైకోర్టు తీర్పును అమలు పరచడం వల్ల గెజిటెడ్ సర్వీసులతోబాటు కొన్ని వర్గాల సర్వీసులను ప్రాంతీయకరణ చేయడం మొన్నగు పరిపాలనా సంబంధమైన మార్పులు చేయడం అవసరమవుతుంది. అంతేకాకుండా జంటనగరాలలో వున్న సచివాలయం, ఇతర శాఖాధి పతుల ఉమ్మడి కార్యాలయాలలో ఉద్యోగాలకు నివాసార్హతకు సంబంధించిన నియమావళి నుంచి కొన్ని మినహాయింపులు చేయడం కూడ అవసరం. ఈ అంశాలన్ని సంబంధించిన వారందరితో సంప్రదించి పరిశీలించడం జరుగుతున్నది.

సర్వీసు కేడర్ల ప్రాంతీయకరణ ప్రతిపాదనను గురించి రాష్ట్రంలో ఉభయ ప్రాంతాలకు చెందిన వివిధ సర్వీసు సంస్థలతో ప్రభుత్వం సంప్రదింపులు జరిపింది. ఆసంస్థలు ఈ ప్రతిపాదనకు సుముఖంగా వున్నాయని చెప్పడానికి హర్షిస్తున్నాను.

ఈ ప్రతిపాదనలకు తుది స్వరూపం ఇచ్చేటప్పుడు ప్రస్తుతం ఉన్న ఉద్యోగులకు రక్షణ కల్పించే విషయంలో అవసరమైన సందర్భాలలో సూపర్ న్యూమరరీ పదవులు సృష్టించాలని సర్వీసు సంస్థలు చేసిన కొన్ని సూచనలు దృష్టిలో పెట్టుకోవడం జరుగుతుంది. పైన సూచించిన పద్ధతులలో తగిన చర్యలు తీసుకోవడానికి మేము సంకల్పించాము.

## ప్రధానమంత్రి పంచసూత్రపథకం

ప్రభుత్వం తీసుకొన్న నిర్ణయాలు దిగువ పేర్కొనబడినాయి:

(1) ముల్కీ నిబంధనలలో నిర్దేశించబడిన నివాసార్హత కేవలం తెలంగాణా ప్రాంతంలోని నాన్ గెజిటెడ్ ఉద్యోగాలు, తహసీల్దారు సివిల్ అసిస్టెంట్‌సర్జన్, జూనియర్ ఇంజనీర్ ఉద్యోగాలలో జరిగే నియామకాలకు మాత్రమే వర్తిస్తుంది. అయితే, సచివాలయం, శాఖాధిపతులవంటి ఉమ్మడి కార్యాలయాల్లోను, రాష్ట్ర ప్రభుత్వపు ఇతర ఉమ్మడి సంస్థలలోను నాన్ గెజిటెడ్ ఉద్యోగాల విషయంలో నేరుగా జరిగే నియామకాలలో మూడు ఖాళీ ఉద్యోగాలుగల ప్రతి యూనిట్‌లో రెండవ ఖాళీ ఉద్యోగాన్ని భర్తీ చేయడానికి ఈ నిబంధనలు వర్తిస్తాయి.

(2) ఈ రక్షణలు తెలంగాణా ప్రాంతంలో 1980 డిసెంబరు మాసాంతం వరకు అమలులో వుంటాయి. అయితే హైదరాబాదు, సికిందరాబాదు జంట నగరాల్లో ఈ రక్షణలు 1977 డిసెంబరు మాసాంతం వరకు మాత్రమే కొనసాగుతాయి. రాష్ట్ర రాజధాని జంట నగరాలలో నెలకొనివున్న కారణంవల్ల రక్షణల విషయమై ఈ విధంగా రెండు రకాల గడువులు నిర్ణయించడం జరిగింది.

(3) ఉభయ ప్రాంతాలలో పనిచేస్తున్న ప్రభుత్వోద్యోగులకు ఆయా ప్రాంతాలలో ప్రమోషన్ల విషయంలో తగినన్ని అవకాశాలు కల్పించడానికి వీలుగా, వివిధ స్థాయిలకు చెందిన సర్వీసు కేడర్లు మొదటి లేక రెండవ గెజిటెడ్ స్థాయివరకు ప్రాంతీయ కరణ చేయబడుతాయి, అయితే అఖిలభారత సర్వీసులకు ఫీడర్లుగా వున్న పదవులకు ఇది వర్తించదు.

(4) హైదరాబాదు, సికిందరాబాదు జంట నగరాలలో ప్రస్తుతం తెలంగాణా విద్యార్థులకు సాంకేతిక వృత్తి విద్యా విషయాలతోసహా గల విద్యా సౌకర్యాలు ఇప్పుడు ఉన్న విధంగానే వుంటాయి. వాటికి ఏవిధంగానూ భంగం వాటిల్లదు. ఈ నగరాలలో తగు విధంగా విస్తృత పరచబడుతాయి. అదనపు విద్యా సౌకర్యాలకు నివాసార్హత ప్రాతిపదికగా గల ఏ విధమైన పరిమితులు కూడా వర్తించవు.

(5) హైదరాబాదు సికిందరాబాదు నగరాలలో సమిష్టి పోలీసు దళం వుంటుంది. రాష్ట్రప్రభుత్వంతో సంప్రదించిన మీదట దీనికి సంబంధించిన వివరాలు రూపొందించడం జరుగుతుంది. ఈ నిర్ణయాన్ని అమలుపరచడానికి అవసరమైన శాసనాన్ని త్వరలోనే సభలో, ప్రవేశపెట్టడం జరుగుతుంది. ఈ ఏర్పాట్లు సక్రమంగా అమలుపరచడానికి వీలుగా కేంద్ర ప్రభుత్వం తగిన యంత్రాంగాన్ని రూపొందిస్తుంది.

# వంశధార వరదగాధ

ఆదిభట్ల వెంకటరమణ

అమ్మా వంశధారా ! అలిగేవా నాతల్లీ
మమ్ముల నీబిడ్డలనే మసి చేయగ బూనేవా

ప్రసవించిన బెబ్బులిలా, పగబూనిన నాగినిలా
పసిపాపల మమ్ములనే పొట్టపెట్టు కొంటావా
తాటివీవనై వీచెడి నీ తరంగాలు మాపై
తాడియెత్తునవి పొంగెనేలనో తల్లీ ;

అన్నమో రామచంద్ర యని అల్లాడే ఆర్తులపై
మున్నీటి విలయంలా ముంపుడు గావించేవు
కన్నతల్లి కంటి యెరుపు గాంచగలరా పిల్లలు!
కన్నతల్లికి ఎన్నడైనా కంటిలో ఎరుపెక్కునా ?

కరువు కాటకాలతో కష్టదశనున్న జిల్లాపంటను
మరిడమ్మ లాతుడిచి పెట్టింది మరొక తుఫానుఘాతం
వరదాయిని వనుకొన్న వంశధారానదీ
కరుణ మాలి తుఫానుతో కలిపినావా చేతులు ?

సహస్ర ఫణావళితో ద్విసహస్ర జిహ్వలతో
బహుసహస్ర విషాగ్నులతో బుసలుకొట్టే ఆదిశేషుని
ఆవులింతలా, ఒళ్ళు విరచుకొంటూ, అట్టహాసం చేస్తూ
ప్రభంజనుడి తుఫానుగా విజృభించి వికట నృత్యం చేసేవు

ఉద్యానం వంటి ఉద్దానంలో కొబ్బరి తోటలు
జనుల పండువుచేసే గరుడ భద్రలో జాడి తోటలు
హర్షం వెల్లివిరిసే అరసవల్లి అరటి తోటలు
కోస్తా ఆంధ్రకి కోటి బంగారు పంటలు

అవి ఈనాడు సగం తెగిన తలలతో
చచ్చి, చావసిద్ధంగా ఉన్న మొదళ్ళతో
నీరస నీస్తేజములై నీటిలోన కుళ్ళుచు ఉన్నవి

చవులూరించే చెరకు పంట పొలాలు
శ్యామ శాద్వలములైన సస్య కేదారాలు
ఉభయనదీ కుల్యాంతర నవ్యరమ్య క్షేత్రాలు
మేటవేసి, నీటమునిగి భ్రష్టములై పోయినాయి.

గోరుచుట్టుపై రోకటి పోటులా
గోల పెడుతున్న జిల్లా ప్రజలపై
మూలిగే నక్క మీద తాటి పండులా
ముంచుక వచ్చే ఉప్పెన తోడుగ
పరవళ్ళు త్రొక్కే నీ పంతానికి

మేం పాపమేమి చేసేమమ్మా?
కోతికి దెయ్యం పడితే, అది కొంచెం కల్లు త్రాగుతే
తేలుకుట్టుతే, నిప్పుత్రొక్కితే, శివమెత్తిన చందంగా
కరువులకూ, కాటకాలకూ
అతివృష్టులకు అనావృష్టులకు

అదనంగా ఆదుకొనే తుఫాను ప్రభంజనాలకు
అణగారే దీనులపై, హతమారే ఆర్తులపై
నీవు కూడా చెయ్యి కలిపి నింగికి వెల్లువ త్రొక్కితె
నీబిడ్డలు ఏమయినారో, ఏ పంటలు పాడయినాయో,
ఏ గ్రామాల్ నీలోమునిగెనో, ఏమయినాయో యోచించేవా!

అమ్మా! వంశధారా! అలిగేవా నా తల్లీ
మమ్ముల నీబిడ్డలనే మసిచేయగ బూనేవా!

# సమతా స్ఫూర్తి

కొలిపాక మధుసూదనరావు

వందలయేండ్ల తెలుగుజాతి వాల్లభ్యం వెల్లివిరియగా
అందరం ఒక్కటే అని బృందగీతులు పాడుకున్నదీరోజు
తరాల అంతరాల నిరంకుశ కరాళ పరాన్న భుక్కులు —
భూభుజులు క్రక్కిన విషాన్ని మింగి
త్రేన్చుకున్న గరళకంఠులు, తెలుగువారు
ఎన్నో యేండ్ల సుకృతి విన్నాణంగా — గర్వంగా
నయన పర్వంగా తలయెత్తుకున్నదీనాడు
చెదరిన రెండు ప్రాంతాలు ఒక్కటైనది కల్లకాదు
ఒక్కటిగా మననేరని జాతికి అభ్యుదయం వల్లకాదు
రెండుగా చీల్చి ఊహించలేం సంస్కృతిని
రెక్కలు విడగొట్టి ఎగిరించలేం స్వేచ్ఛావిహంగిని
తిక్కన్న భారతాన్ని, పోతన్న భాగవతాన్ని
కలబోసుకొని, కలిమిడి చేసుకొని,
చలిమిడి ముద్దలు తిని వర్ధిల్లిన జాతి మనది
మనుగడలు వేరైనా మమతలు చంపుకొనని జాతి మనది
ఏకపీమావధికమై ఏకచ్ఛత్రం నెలపిన జాతి మనది —
మళ్ళీ విరగడమా...! ఒరగడమా!
ఈ సమస్యల విషవలయంలో ఎన్ని సర్కస్ ఫీట్లు?
సమగ్ర రాష్ట్రావతరణలో ఎన్నెన్ని పీడకలలు?
తెలుగుజాతి భవితవ్యంపై ఎన్ని సమ్మెటపోట్లు
ఈ అంతర్విప్లవజ్వాల అణగారిపోయి
ఉభయ ప్రాంతాల అంతరంగాల్లో
అమృతగంగా స్రోతస్విని పరుగులెత్తాలి నేడు
స్వతంత్ర భారతి నెన్నుదుటిపై నెలకొన్న మహోభ్యుదయ
సింధూర తిలకం సమతా స్వాభిమాన విజయాంకమై.
దిగంతాల వెలుగులీనాలి
తెలుగుజాతి యెదదలో ఏర్పడిన ఎడారి దిబ్బలలో
సరిక్రొత్త ఆశాజీవనపు 'టొయాసిస్సు'లు ఎగసి రావాలి
చిరంతన జాతీయతా పెన్నిధులు.
అందరికీ సంనిధులై, సన్నిధికి తరలి రావాలి
భారత స్వాతంత్ర్యోత్సవ శుభావతరణ
మహాభారత సంహితలో
ఈనాటి రాష్ట్రావతరణ పర్వం తొలి పర్వం
ఈ నవభారత సంహిత సహస్ర పర్వభాసురమై,
శత పర్వశోభారమణీయమైన అనాటి వ్యాస
భారతానికి వన్నెపెట్టాలి
తెలుగు నేల, తెలుగు వేల
తెలుగు కండ తెలుగు అండ
తెలుగు మేధ, తెలుగు గాధ
ఒక్కటిగా స్వాతంత్ర్య అభ్యుదయ మహారథ
విజయయాత్ర సాగించాలి
కొండలవంటి సమస్యల గహనపథంలో
భారత స్వాతంత్ర్య భానుని నిర్విరామ గమనం
అభ్యుదయోన్ముఖంగా కొనసాగి తీరుతుంది — తప్పదు
ఈ కాలం కర్మం తప్పక మారితీరుతుంది — కూలారి తీరుతుంది
ఈ మహాంధ్ర ముత్యాలశాలలో
అభినవ శ్రీనాథ మహాకవులకు అఖండ సన్మానం జరుగుతుంది
ఈ నవ్యాంధ్ర భువన విజయసభా వేదికపై
మళ్ళీ అలనాటి కవితా సరస్వతి సరిక్రొత్త బాణీలో,
విన్నాణం చూపుతుంది
ఓరుగంటి కవిరాజు పోతరాజ భాగవతం
అందించిన భక్తి భారతి మళ్ళీ సరిక్రొత్త నూపుర
ఝుంకారంతో తెలుగు జాతి అభయ దివ్యజీవన వైభవాన్ని —
స్వేచ్ఛాస్వాభిమాన కళాబంధురతను
దివ్య ప్రబంధంగా అభివర్ణించి, కీర్తించు
శుభదినం వచ్చి తీరుతుంది
రాజకవులు, కవిరాజులు
మహాంధ్ర జనతాహృదయాన దకరులై,
కువలయానందకరులై, సుహృద్వరులై
నవభారత సంస్కృతీ కళారవులై
వెలుగొంద గలరు
ఇది నిజం — ఇది భవితవ్యపు నిజం —
అందుకే సమతా సమైక్య జీవనానికి
నా కవితా నీరాజనం

ఆంధ్ర ప్రదేశ్ అవతరణ శుభ దినోత్సవ సందర్భంగా ఖమ్మంలో కవి సమ్మేళనంలో

# శరద్దీపావళి

రావెళ్ళ వేంకటరామారావు

నా తెలుగుజాతి
నవజీవన కాంతివనంలో
చీకటి నరకాసురులు
చిందించిన రక్తపు మరకలు
రక్కసులు బ్రహ్మజెముడు
ప్రక్కిరిసి పెరిగిన జాడల
దుర్దినాలు తొలగి
దుఃఖాలు మలిగి
సంఘీభావ సౌభ్రాతృత్వ
సంతోషాలు వేరూని
మమతా మల్లెల
మధుర వాసనల
వెలుగురేకలు విరుస్తున్నా
వేకువ సుముహూర్తంలో
ఉరుములేని పిడుగులా
ఉరికిపడిన తీర్పునకు
శృంగాటకంలో పొంచియున్న
సృగాలాలు కొన్ని
విపరీత వ్యాఖ్యానాల
విలయాలు సృష్టిస్తున్నాయి
కుహనా వాత్సల్యాల
కూనిరాగాలతో
అన్నదమ్ముల కలహానికి
ఆజ్యం పోస్తున్నాయి.

కుతంత్రాలనుండి. గుణపాఠాలు నేర్చుకోలేని మనం
కల్లోల మానస తో కకావికలై,
కల్పనా ఖాతానికి భీతిల్లి
కాంతి, నవత్వాన్ని తృణీకరించి
కార్పణ్య కరండాలు ఎదలనించి
పరస్పర హననానికి
పాదులు వేసుకొంటూ
రక్తసంబంధాన్ని మరచి, వి

రక్త తత్వాన్ని వలచి
మాతృదేవి, కారుణ్యామృత
మనోజ్ఞ హృదయాన్ని
స్వార్థమలిన కృపాణాలతో
శకలాలుగా తరిగే
మారాంకు తిరిగి మళ్లుతున్నాం
మానవత్వాన్ని మరచిపోతున్నాం.

అవును సఖా!
ఆకటి చిచ్చులతో
అలమటించి పోతున్నాం
కాషరాల యాతనలను
కమిలి కుమిలి చస్తున్నాం
అయినా,
పంటినొప్పి వైద్యానికి
తుంటిమీద వాతలా?!

నట్టింట్లో తిష్టవేసి
నాలుగు స్తంభాలాటతో
నయగారాలొలికిస్తున్న
నాజూకు వేషధార్లు
ఘరానా ముసుగుల్లో
గరీబిని సృష్టిస్తున్నారు
వెలుగును దిగమింగి
ఇరులనుముస్తున్నారు.

తస్మాత్ జాగ్రత్త!
తమాయించుకు నడువు
అభినవ నరకాసుర సంహారంలో
అనంతుడవై నిలువు
శాంతి సౌమనస్యాల
శరద్దీపావళివై వెలుగు.

ఆంధ్ర ప్రదేశ్ అవతరణ శుభ దినోత్సవ సందర్భంగా ఖమ్మంలో కవిసమ్మేళనంలో

# నిమ్నజాతుల సముద్ధరణకు

## ఇతోధిక సేవచేసిన ముమ్మిడివరప్పాడు గ్రామ పంచాయతీ ప్రగతి

**జి. పుల్లయ్య**

వసంత కాలములో ప్రకృతి తనలో దాచివుంచిన రమణీయతను మానవలోకమునకు అందించి మానవులతో తనకుగల సంబంధమును ఋజువుపరచుకొని తృప్తిపడుచున్నది. అందుచేత వసంతము మనకు వరప్రసాది వంటిది. మానవులను సంతోషపరచుటకో అన్నట్లు చెట్లు చిగిర్చి పూలుపూసి వసంతము ప్రకృతిని సాక్షాత్కరింపజేయుచున్నది. దీనిని చవి చూచిన మానవుల ఆనందాతిశయమునకు మేరవుండదు. ఈ రమ్యమైన దృశ్యములలో లీనమై ప్రకృతిని స్వాధీనపరచుకొని కాలము గడుపుకొనుచున్న మానవుల మనస్సులు చిగిర్చినట్లైతే శాశ్వతమైన వసంతమును మానవులు సముపార్జించగలరనుటలో సందేహములేదు. ఈ భావ సమృద్ధిని అలంకరించుకున్న గ్రామమే ముమ్మిడివరప్పాడు.

ముమ్మిడివరప్పాడు గ్రామము కొత్తపేట పంచాయతీ సమితిలో గలదు. ఇది చాలా చిన్న గ్రామము. దీని జనాభా 9?0. దీని ఆదాయము రు. 5345 లు మాత్రమే. యీ గ్రామము ఆర్థికముగా వెనుకబడి యున్నదనియే చెప్పవలెను. న్యాయదృష్టితో చూస్తే ఆర్థిక స్తోమతు లేని పంచాయతీలు ప్రజల అవసరములు తీర్చలేవు. కాని యీ గ్రామవాసుల పద్ధతి వేరు. వారి ఆలోచనలూ వేరుగానే వున్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే ఆ గ్రామములోని ప్రతిఒక్కరి ఆలోచనలు "భృంగి పక్షివలె నీ ఆర్జనను అన్యులతో కలిపి అనుభవించు" అన్నట్లు వుంటుంది. అందుచేత ఆ గ్రామమునకు నిస్వార్థపరుడు, నవయువకుడు శ్రీ ఇరగవరపు సూర్యనారాయణ మూర్తిని సర్పంచిగా ఏకగ్రీవంగా ఎన్నుకొనిరి. 'చేతులు కలిపి పనిచేస్తే కలదు సుఖమన్నట్లు' ఆయన ప్రజాహిత కార్యక్రమములందు సంపూర్ణ శ్రద్ధాశక్తులు ప్రదర్శించుట వలన ఆ గ్రామము శాశ్వతమైన భవితవ్యమునకు ముడివడియున్న వసంతము సృష్టించుకున్నది. అందు ముఖ్యముగా జరిగినది నిమ్నజాతుల సముద్ధరణ.

### ప్రభుత్వ సహాయము

ప్రభుత్వము ఆ గ్రామ హరిజనుల సంక్షేమార్థము ఉచిత నివేశన స్థలములు సమకూర్చుటకు య. 4-37 సెం.ములు కేటాయించడం జరిగింది. కాని వారు కడు పేదవారు అగుట వలన స్థిరమైన గృహవసతి సౌకర్యమును పొందలేక పోయిరి. వారు వ్యయప్రయాసలతో నిర్మించుకున్న చిన్న కుటీరములు తుఫానునకు చెల్లాచెదరైనవి. తదుపరి తగినంత గృహవసతి లేక బాధపడుతూ వచ్చిరి. ఆ తరుణమున సర్పంచి మండల వికాసాధికారి సహాయముతో ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డు కులాల కో-ఆపరేటివ్ గృహనిర్మాణ ఫెడరేషన్ సంస్థద్వారా పరపతి సౌకర్య పద్ధతిపై హరిజనులకు స్థిరనివాసములు కల్పించుటకుగాను హరిజన కాలనీని నిర్మించుటకు సంకల్పించిరి. మంచి కోరిక కలిగినపుడు అన్నీ శుభములే కలుగుతాయి గదా! వారి సంకల్ప ప్రభావముచే పై సంస్థ ద్వారా పరపతి సౌకర్య పద్ధతిపై ఒక్కొక్క హరిజనునిచే రు 10/లు వాటా ధనము వంతున చెల్లించి 53 గురు హరిజనులు ఈ సంస్థలో సభ్యులుగా చేరిరి. దాని ఫలితంముగా ఒక్కొక్క ఇల్లు రు 1800/ల వంతున 38 గృహములకు రు. 68 400 ఖర్చు కాబడెను. యీ కాలనీ నిర్మాణమునకు హరిజనులు స్వచ్ఛందముగా శ్రమదానము చేసిరి. శ్రీ పి. వి. శర్మగారు (మండల వికాసాధికారి) యీ కాలనీ నిర్మాణమునకు సర్వ శక్తి యుక్తులను ప్రదర్శించి గణనీయమైన కృషి సలిపిరి. ఆయన ఉచితముగా ట్రాక్టర్లను సముపార్జించి మట్టిని తోలించి గృహవసతికి అనుకూలించు విధంగా మెరక చేయించుటయేగాక యీ కట్టడములకు వలయు సాధన సంపత్తిని సమీకరింపజేసి హరిజనుల హృదయములలో స్థిరనివాస మేర్పరచుకొనుట ద్వారా తమ వృత్తి ధర్మమును ప్రదర్శించిరి. అందుచేత వారియొక్క ఒక్కొక్క గృహము రు. 1800 ల విలువ కంటే హెచ్చు ప్రతిఫలము గల గృహములను పొందిరనుటలో అతిశయోక్తి లేదు.

ది 26-4-1972న తూర్పుగోదావరి జిల్లా కలక్టరు శ్రీ ఎల్. మాలకొండయ్య గారు యీ కాలనీకి ప్రారంభోత్సవం చేసిరి. కోనసీమలో ప్రప్రథమముగా ప్రారంభోత్సవము జరుపుకున్నది ముమ్మిడిప్పాడు హరిజన కాలనీ మాత్రమే! ఇందలి ఇళ్ళు వరుసలలో బారులు తీరి వుండుటచే చూచుటకు కడు రమణీయముగా నున్నవి. ఈ పథకమును కన్నులారా గాంచినవారు చెవులారా విన్నవారికి ప్రభుత్వము యింతటితో తృప్తి చెందక యీ పథకమును ప్రతి హరిజనునకు ప్రతి గ్రామమునందు అమలు జరుగగలదను దృఢ విశ్వాసము కలిగినదని చెప్పుటలో అతిశయోక్తి లేదు.


"ఎక్కడ చూచినా నీరే కాని త్రాగటానికి నీరు లేదు" అని పెద్దలు చెప్పుదురు. దానిలోని అంతరార్థము అర్థము చేసుకున్న వారికే తెలుస్తుంది. ఈ సత్యాన్ని ఆ గ్రామవాసులు గ్రహించి ఉంటారు. అందుచేత ఆ గ్రామములో సురక్షిత మంచినీటి పథకమును రు. 32,743 ల వ్యయముతో నిర్మించుకొనిరి. కంబుస్తంభములవలె గోచరించు కుళాయిలు గ్రామమంతటా విస్తరింపజేసికొన్నారు. అంతటితో సరిపెట్టుకొనలేదు సాంఘిక

సంక్షేమశాఖ ద్వారా రు 5,700 లు నిధులు సమకూర్చుకొని హరిజనవాడలో అవసరమున్న ప్రతిచోట కుళాయిలను విస్తృతము చేసి ఏర్పరచుకొనిరి.

" తిన్నది ఒంటికి పుష్టి " అంటారు యీ గ్రామవాసులు అంతే వీరు బలవర్ధక ఆహార పథకమును అమలుపరచుకొన్నారు. ఈ పథకము క్రింద ఒక హరిజనుడు కోళ్ళ పెంపకమును గూర్చి సాంకేతిక శిక్షణ పొందాడు. అతనికి ఒక కోళ్ళ కేంద్రము యిచ్చారు. దానివల్ల యిక్కడ హరిజనులందరు నవీన కోళ్ళ పెంపకమునకు అలవాటు పడ్డారు. తద్వారా ఆర్థిక లాభము పొందగలుగుతున్నారు. ఈ పథకము క్రింద గర్భిణీ స్త్రీలకు, హరిజన బాలురకు, హరిజనవిద్యార్థులకు కోడి గ్రుడ్లు, చేపలు, కూరగాయలు లభించినవి.

" విద్యలేనివాడు వింత పశువని " పెద్దలు నిర్వచించుతారు. వీరు తమ పిల్లలను విద్యావంతులు చేయుటకు ప్రత్యేకమైన పాఠశాలను నిర్మించుకొన్నారు. కాని దానికి భవనము లేదు. సమితి అధ్యక్షులైన శ్రీ కోసూరి రామకృష్ణంరాజు గారు హరిజనుల పట్టుదలను, ఉత్సాహమును గ్రహించి సమితి నిధుల నుండి రు 10,000 లు విలువగల ప్రాథమిక పాఠశాల భవనమును యీ నూతన కాలనీలో నిర్మించిరి. ఈ పాఠశాలలోని విద్యార్థులకు కేర్ సంస్థ ద్వారా లభించే మధ్యాహ్నపు ఉచిత భోజన సదుపాయములు సమకూర్చబడుచున్నవి. హరిజనవాడలో నలుమూలల రాజబాటలు ఏర్పాటు కాబడెను. వెళ్ళిన దారిని రాకుండా గ్రామమును చుట్టిముట్టి వచ్చినట్లు రాజబాటలు తీర్చియున్నవి.

వారిలోని యీ నూతన మార్పు భవిష్యత్తులో యే యే మార్పులు తీసుకరాగలవో వేచి చూద్దాం. ★



ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీతో అఖిల భారత స్వాతంత్ర్య యోధుల కార్యవర్గ సమితి సభ్యులు.
ప్రధాని ఎడమవైపున రాజామహేంద్ర ప్రతాప్ (అధ్యక్షులు), కుడివైపున పండిత్ జనార్దన జోషీ (ఉపాధ్యక్షులు).

# "మూఢ నమ్మకాలు, మూఢ ఆచారాలు"

జె. వీరాస్వామి

మనిషి బ్రతకటానికి ముఖ్యంగా కావల్సినవి గాలి, నీరు, నిద్ర, ఆహారం అవి అందరికి తెల్సు. ఈ కోవకు చెందినవే మరో రెండు ఉన్నాయి. బ్రతకాలనే ఆశ, భవిష్యత్తు మీద నమ్మకం.

మనం సరిగ్గా గమనించం గాని, 'నమ్మకం' అనేది ప్రతి వాడి జీవితంలోను చాలా ప్రముఖ పాత్ర వహిస్తుంది. అదే అడుగడుగున చెయ్యి పట్టుకొని, మనల్ని ముందుకు నడిపిస్తూ ఉంటుంది. మన డబ్బు బ్యాంకులో ఉంటే ఎక్కడికీ పోదని బోలెడంత నమ్మకం. కన్నకొడుకును పైకి తీసుకొస్తే కష్టాల్లో ఆదుకుంటాడని కొండంత నమ్మకం. భార్యాభర్తల మధ్య నమ్మకం ఉండాలి. యజమానికీ, సేవకునికీ మధ్య నమ్మకం ఉండాలి. వ్యాపారానికి నమ్మకం అయువు పట్టు. నిజమైన స్నేహితుల మధ్య నమ్మకం ఉండాలి. ఇలా మనిషి మనుగడకు ఎంతో ముఖ్యమైనదీ నమ్మకం.

ఎక్కడ నమ్మకం బీటలు వారుతుందో, అక్కడ అనుమానం తొంగి చూస్తుంది. చుట్టూ సుఖమయ జీవితాడంబరాలు ఎన్ని ఉన్నా, తన చుట్టూ ఉన్నవారి మీద రవ్వంత నమ్మకమైనా లేకపోతే, అతని జీవితం ముళ్లపాన్పే.

అయితే ప్రతిదానికీ ఒక పరిమితి అంటూ ఉంది. బ్రతకటానికి గాలి కావాలిగదా అని, గాలిదుమారంలో నిలబడలేం. త్రాగటానికి నీరు కావాలిగదా అని వరదలో కొట్టుకు పోలేం. నిద్ర కావాలిగదా అని, బ్రతుకంతా నిద్రలో గడపలేం. ఏదైనా క్రమబద్ధంగా ఉన్నప్పుడే దాని అందం, ఆనందం. ఈ నమ్మకం శృతిమించి రాగానపడితే మూఢ నమ్మకం అవుతుంది. నమ్మకానికి మూఢనమ్మకానికి ఉన్న వ్యత్యాసం తెలుసుకుంటేనే మానవ పురోభివృద్ధి సాధ్యమవుతుంది.

ఒక్కపక్క నమ్మకం చెయ్యిపట్టుకుని నడుస్తూనే, మరో పక్క మూఢనమ్మకాల బారినుంచి తప్పించుకొని బయటపడాల్సిన అవసరం ఎతైనా ఉంది. ఈ రెండింటినీ వేరు చేసి చూడటంలోనే మనిషి ప్రజ్ఞ, ఉపజ్ఞ ద్యోతకమవుతుంటుంది. అయితే ఏది మూఢనమ్మకం అన్నది ముఖ్య ప్రశ్న.

ఏది తర్కానికి హేతువాదానికి నిలబడదో; ఏది మన ప్రగతికి పగ్గాలువేసి ఉగ్గబడుతుందో, ఏది మనచేత అర్థంలేని అనాచారాలను పెంపొందిపజేస్తున్నదో, అదల్లా మూఢ నమ్మకమే.

ఈ మూఢనమ్మకాల గాఢ ప్రభావానికి లోనయిన వాళ్లలో అజ్ఞానులు, నిరక్షరాస్యులు, వివేకహీనులేకాదు, విద్యావంతులు, సంస్కారహృదయులు, పండితవర్యులు గూడా మనకు కనబడతారు. గొప్ప శాస్త్రవేత్తలు అని చలామణి అవుతున్న వారిలో గూడా ఇవి ఉండడం. మన దేశపు వింత ఒకటి. వీటికి కారణాలు అసంఖ్యాకంగా దొరుకుతాయి. పెద్దవాళ్లు కొందరు సాంప్రదాయంగా వచ్చేదానిని నమ్మకపోతే ఏమవుతుందోనని ముందే భయపడేవాళ్లు ఇంకొందరు. పాటించలేదు కాబట్టే మొన్నవాడలా దెబ్బ తిన్నాడని ఉదాహరణతో సహా ఉపన్యసించే వాళ్లు మరికొందరు. ఈ కొందరు ఇంకొందరు మరికొందరు కల్సి ఎదురు తిరిగిన వాళ్ల మీద దుమ్మెత్తిపోస్తారు.

ఇలా మూఢనమ్మకాలు తరతరాలుగా వేళ్లు దించుకునికి శాఖోపశాఖలుగా విస్తరించి ఊడలు దించుకుని, పెకలించడాని, వీల్లేని వటవృక్షంలా ఎదిగి పోయినవి. ఈ వటవృక్షాల నీడలో నిద్రపోతున్నవాళ్లు చాలా మంది ఉన్నారు. ఈ చెట్టు మరి దేన్నీ ఎదగనివ్వడంలేదు. ఖర్మ సిద్ధాంతాల కథలు చెప్పుకుంటూ నిద్రపోవటానికి కార్యదీక్షను ఆలోచానా శక్తిని చంపడానికి తప్ప మరి దేనికి ఇది ఉపయోగ పడడంలేదు. దీన్ని పూర్తిగా కొట్టేసి సత్సాంప్రదాయాల కొత్త మొక్కల్ని అందంగా నాటుకుని బ్రతుకు బృందావనం చేసుకుంటాం అంటే చెవిని పెట్టరు. ఇదీ స్థూలంగా నేటి మన సమాజంలోని స్థితి.

తొండ ముదిరి ఊసరవెల్లి అయినట్లుగా ఈ మూఢ నమ్మకాలు క్రమంగా దురాచారాలుగా మారినయి. విజ్ఞానము పెంపొందుతూ ఉంటే మూఢనమ్మకాలు సడలిపోతూ ఉండాలి. కాని అలా జరగటంలేదు. మనిషి ఈ దురాచారాల ముళ్లబాటన నడుస్తున్నాడే తప్ప తనదారిని సుగమం చేసుకొందామని అతను ఆలోచించినట్టే కనబడదు. అతని ధ్యానం అంతా ధనార్జనమీదే. ఇప్పుడు భూమి తన చుట్టు తాను తిరుగుతూ డబ్బు చుట్టూ తిరుగుతున్నది. ఈజీమనీ రావాలి. రోజా పువ్వులా బ్రతకాలి. ఇదీ ఈ వేళ ప్రతివాడి జీవిత లక్ష్యం. దీనికి నిదర్శనం కావాలంటే లక్షల సంఖ్యలోపోతున్న లాటరీ టిక్కెట్లను చూడండి. వందలకి వందలు జేబులో వేసుకుని గుర్రపు పందెములకు పరుగెడుతున్న ప్రజావాహిని వంక చూడండి. ఇలా ఎన్నో రకాలుగా జూదాలకు డబ్బు తగలేస్తున్న వాళ్ళందరి ధ్యేయం ఒకటే. ప్రతివాడి ఆశా కష్టపడకుండా డబ్బు సంపాదిద్దామనే. నూటికి తొంభైతొమ్మిది మంది లాటరీల్లోను, జూదాల్లోను డబ్బు పోగొట్టుకుంటారని అందరకూ తెలుసు. ఆ ఒక్కడూ తనెందుకు కాగూడదు అనే మూఢ నమ్మకమే తప్ప తనూ మిగిలిన తొంభైతొమ్మిది మందిలో జేరటానికే ఎక్కువ అవకాశం ఉన్నదనే సత్యాన్ని విస్మరిస్తాడు. ఇది అర్థంలేని గుడ్డి నమ్మకం. వీళ్ళంతా పోటీలుపడి చందాలేసుకుని ఒక్కణ్ణో, ఇద్దర్నో లక్షాధికార్ని చేస్తున్నారు. ఎప్పటికప్పుడు ఆ లక్షాధికారి పీఠంకోసం ఉన్నదంతా తగలేసుకుని లక్షలాదిమంది భిక్షాధికారులుగా మిగులుతున్నారు. ఉన్నది ఊడ్చిపెట్టడమేకాక

అప్పులుగూడా చేసి జూదాలు ఆడుతున్నారంటే, వాళ్ళని గూర్చి బాధపడాలో, జాలిపడాలో గూడా తెలియటం లేదు.

మనం ఏదైనా పనిమీద బయలుదేరి వెళ్ళేటప్పుడు, "ఎవరైనా తుమ్మితే, వెళ్ళిన పని కాదు అని ముందుగానే మనవాళ్లు నిర్ధారణ చేసి చెబుతారు. అలాగే శకునంగూడా. పిల్లిగాని, పిచ్చివాడుగాని, విధవరాలుగాని, ఒంటి బ్రాహ్మణవ్యక్తిగాని ఎదురు పడటం అపశకునంగా భావిస్తారు. ఎన్నిసార్లు అలా ఎదురు వచ్చినప్పుడు నష్టం కష్టం వచ్చింది అన్న ప్రశ్న వేసుకోరు. కష్టాలు నష్టాలు వస్తూనే ఉంటాయి. ఇది ప్రకృతి సిద్ధం. అది జరిగినప్పుడే శకునానికి ముడిపెట్టుతూ ఉంటారు. ఎన్నోసార్లు అలా జరుగక పోయినా శకునం మాట జప్తికి రాదు. ఈ నమ్మకాలు ఎప్పుడు ఎలా ప్రారంభమైనవో తెలియదుగాని, నేటి సగటు మనిషిమీద వాటి ప్రభావం చాలా ఎక్కువగా ఉన్నది. జీవితంలో ప్రతిదీ అనుకున్నట్లు జరగదు. జరిగినా అనుకున్న వెంటనే అన్నీ జరగవు. కొన్ని పనులు ఆలస్యంగా జరుగుతుంటాయి. మరి కొన్ని పనులు అసలు జరగవు. ఈపని జరగనప్పుడో, ఆలస్యముగా జరిగినప్పుడో ఈ నిరాశను మరోదానికి ముడివెయ్యటం మనకు బాగా అలవాటు. ఆ శకునం మంచిదిగాదు కాబట్టి, ఆ పని జరగలేదు అని ముద్రవేస్తారు. మరి, మంచి శకునం చూసుకొని వెళ్ళినప్పుడుగూడా, చాలాపనులు జరగవు. ఆ మనిషి దొరకడు. దొరికినా ప్రయోజనం ఉండదు. ఇక్కడ శకునం ప్రభావం ఏమైనట్లు? మంచి శకునం, మంచి ముహూర్తం పని పూర్తి చేయించాలిగదా? ఎందుకు విఫలమవుతున్నది? ఏ దోవా దొరక్కపోతే, చివరకు దాన్ని తీసుకుపోయి కర్మ సిద్ధాంతానికి ముడిపెట్టేస్తారు. వాడికి ప్రాప్తం లేదనో, యోగం లేదనో తేల్చేస్తారు. ఇందులో ఇంకో గమ్మత్తుకూడా ఉంది. ఈ దుశ్శకునాలకు కొన్ని సడలింపులున్నాయి. వెనకనుంచి తుమ్మితే ఫరవాలేదట జలుబు చేసినవాడు తుమ్మితే పట్టింపులేదుట. ఇంట్లో తిరిగే పెంపుడు పిల్లి ఎదురయితే అపశకునం కాదుట. వీటినిబట్టే తెలుస్తుంది, ఇవన్నీ వారి మూఢ నమ్మకాలేగాని, వాటి వెనుక ఎలాంటి శాస్త్రీయ పరిజ్ఞానమూ లేదని, అయితే కొన్ని ఉదాహరణలు చూపిస్తారు. అవి కేవలం యాదృచ్ఛికాలు.

జన్మ నక్షత్రాలుచూసి, జాతకాలుచూసి, గ్రహాలను సంప్రదించి, విగ్రహాలను పూజించి సుముహూర్తంలో పెళ్ళి జరిపిస్తారు. అయినా వచ్చే కీడు తొలగిపోవటంలేదు. పెళ్ళయిన కొద్ది రోజులకే పెళ్ళికొడుకు ప్రమాదంలో మరణించిన సందర్భాలూఉన్నాయి. పెళ్ళి అవుతుండగానే ప్రమాదాలు జరిగిన సందర్భాలూ లేకపోలేదు. ఈ ముహూర్తాల ప్రభావం ఏమవుతున్నట్లు? అమావాస్య హిందువులకు చాలా చెడ్డరోజు. ముస్లిములు ఆ రోజు వివాహాలు చేసుకుంటారు. అది చాలా పవిత్ర దినం వారికి. ఒకే రోజు మహమ్మదీయులకు మంచీ, హిందువులకు చెరుపు చేస్తుందా? కనుక ఈ మంచి రోజు, చెడ్డ రోజు అన్నదీ కొందరు తమ సంతృప్తి కోసం నిర్ణయించుకున్నదేగాని, మరేం లేదు. రోజుకు మంచి, చెడ్డ ఆపాదించటం ఒక మూఢ నమ్మకమే.

ఫలానా పీడకల వస్తే, ఫలానా కీడు జరుగుతుందని చెబుతుంటారు. చెప్పినట్లుగానే ఒక్కోసారి ఏదో కీడు జరుగుతుంటుంది, ప్రతిసారీ జరగదు. వందసార్లు జరగకపోయినా దాన్ని పట్టించుకోం. ఒక్కసారి జరిగితే మాత్రం అది రూఢి అయిపోయినట్లే భావిస్తాం. ప్రతి మనిషీ రోజుకు దాదాపు ఏడెనిమిది గంటలు నిద్రలో గడుపుతాడు, అంటే రోజులో మూడోవంతు నిద్రలో గడిపేస్తున్నాం. ఆ లెఖ్ఖన ముప్పయి ఏళ్ళ మనిషిని తీసుకుంటే, కనీసం పదేళ్ళపాటు నిద్రలో గడిపాడన్నమాట! ఇంత సుదీర్ఘమైన కాలంలో కొన్ని వందలసార్లో, వేల సార్లో పీడ కలలు వచ్చి ఉంటాయి. అవన్నీ వాస్తవంలోకి సరఫరా చెయ్యబడుతున్నవా? ప్రతి పీడకలా నిజమవుతున్నదా? లేదు. నిద్రలో కలలు మంచివీ, చెడువీ కలగా పులగంగా వస్తుంటాయి. పొద్దున లేచాక ఎన్నో పనులు మంచివీ, చెడువీ కలగా పులగంగా జరుగుతుంటాయి. మనం పనిగట్టుకుని వాటికీ, వీటికీ ముడివెయ్యాలని ముప్పతిప్పలు పడుతుంటాం, అలా పోల్చుకుని తృప్తిపడటంలో మనస్సుకు అదొక రకమైన ఓదార్పు. అంతకన్నా మరేం లేదు.

అలా అంతరాత్మను చిచ్చికొట్టి నిద్రపుచ్చటానికి చేసే ప్రయత్నాలే ఈ మూఢనమ్మకాలన్నీ. మనిషి చనిపోయిన తర్వాత ఈ ప్రాణి ఏమౌతున్నదనేది ఎవరికీ అంతుపట్టని విషయం. అయినా దానిమీద అంతులేనన్ని కథలున్నాయి. పైన స్వర్గం ఉందనీ, క్రింద నరకం ఉందనీ, పాపపుణ్యాలను బట్టి వాళ్లకక్కడ సీట్లు దొరుకుతుంటాయనీ చెబుతుంటారు. పోయిన మనిషి జాడ ఏమీ మనకు కన్పడదు కానీ ఆ చనిపోయిన వాళ్ళ ఆకలి తీర్చటం కోసం మాసికాలనీ, తద్దినాలనీ ఏర్పాటు చేశారు. శాస్త్రకారులు రోదసినంతా శోధించారు గాని, ఈ స్వర్గం అనేది ఎక్కడా కనబడలేదు. నరకం అనేది అసలే అంతుదొరకలేదు. కాని శ్రాద్ధాలు తప్పటం లేదు.

ఇహ భగవంతుడు. ప్రపంచంలో దేవుణ్ణి గురించి జరిగినంత చర్చ బహుశః మరే విషయం మీదా జరిగిఉండదు. అయినా ఆయన ఆచూకీ తెల్పిన వాళ్లెవరూ లేరు. అసలు దేవుడున్నాడా, లేడా అన్న సందేహం ఇవాళ కొత్తగా కలిగిందేమీ కాదు. కలడు కలండనెడి వాడు కలడో లేడో అన్న సందేహం అనాదిగా అందర్నీ వేధిస్తూనే ఉన్నది. దేవుడున్నాడన్నారు కొంత మంది. లేడన్నారు కొంతమంది. దేవుడు మనిషి ఊహలోనే ఉన్నాడు, మనిషి లేకపోతే దేవుడు లేడు అంటారు ఇంకొందరు. భగవంతుడనేవాడు నిజంగా లేకపోతే, ఆయన్ని సృష్టించాల్సిన అవసరం ఉందంటారు' వోల్టైర్ అనే మహాశయుడు.

దేవుడనే వాడు ఒక్కడే అంటాడు ఒకాయన. తమ దేవుడు ఒక్కడే సరియైన దేవుడంటాడు ఇంకొకాయన. రాముడు, కృష్ణుడు, ఏసు ప్రభువు (దేవుని కుమారుడు) అల్లా, వీళ్లంతా దేవుళ్ళే. అగ్ని, వాయువు, వర్షం, ఇవన్నీ మనిషికి ఎంతో అవసరమైనవి గనుక ఇవి గూడా దేవుళ్ళ జాబితాలోకే చేరిపోయినయి. పాము కాటువల్ల మనిషి ప్రాణాలు పోగొట్టుకోవటం జరుగుతుండేది. అందువల్ల నాగుపామును గూడా పూజించటం మొదలు పెట్టారు. ఇంకా కొన్ని వందలమంది చిల్లర దేవుళ్ల

ఉన్నారు. తమ దేవుడొక్కడే ప్రపంచాన్ని సృష్టిస్తాడు, రక్షిస్తాడు, శిక్షిస్తాడు అని నమ్ముతారు భక్తులు. ఇన్ని కరువు కాటకాలు, కష్టాల ముసుర్లు, నష్టాల వరదలు ఎందుకొస్తున్నట్లు? బంగ్లాదేశ్, వియత్నాం మారణహోమం లాంటివి ఎందుకు జరుగుతున్నట్లు?

పాపం పెరిగిపోయింది కాబట్టి వర్షాలు పడటం లేవంటారు. అందరూ పాపాలు చెయ్యటంలేదు గదా. కొందరు పాపాలు చేస్తుంటే మరికొందరు దానికి బలి ఎలా అవుతున్నారు? భగవంతుడు ఆ పాపకర్ములను మాత్రం శిక్షించి, మిగిలిన వారిపై తన కరుణా రసధారల్ని కురిపింపవచ్చునే! పోనీ ఒకరి దేవుడికి కోపమొస్తే మరొకరి దేవుడయినా తన కటాక్ష వీక్షణాల్ని ప్రసరింపవచ్చునే?

వర్షాలు కురవటం కోసం క్రతువులు చెయ్యాలంటారు. అందరూ కల్పిచేస్తున్నారా? లేదు. ఒక వర్గం వాళ్లే చేస్తున్నారు. మిగిలిన వర్గాల వాళ్లు ఆ దేవుణ్ణి నమ్మరు. ఆ క్రతువులు చెయ్యరు. చేసినా, చెయ్యక పోయినా వర్షాలు వచ్చినప్పుడు కులమత వర్గ విభేదాలు లేకుండా వస్తున్నాయి. రానప్పుడు ఎవరి మహిమా పనిచెయ్యటంలేదు. క్రతువుల కోసం ఖర్చయ్యే డబ్బులు నెయ్యి డబ్బాలు, ఆహార పదార్థాలు మాత్రం అందరికీ ఉపయోగ పడేవే గదా అనిపిస్తుంది. నలభై రోజులు వర్షాకాలంలో క్రతువు ప్రారంభిస్తే ఏదో ఒక రోజు వర్షం పడకుండా ఉంటుందా? అద్గో ప్రభావం అంటారు. ఈ మధ్య ఒక పెద్దగుడి దగ్గర చాల పెద్ద క్రతువు జరిగింది. వర్షము ఆ జిల్లా అంతటిలో పడలేదు శ్రద్ధగా క్రతువు జరుగలేదంటారేమో. ఏ క్రతువు జరగని ఉత్తర హిందూస్థానములో, వర్షము ఎలాపడింది? క్రతువు జరిపించుకొని, మొక్కులు తీర్చుకొని, పూజలు జరిపించుకొన్న తర్వాత గాని ప్రజల కష్టాలు తీర్చబూనుకోడా భగవంతుడు?

తన దేశం దుర్భిక్షం కాకుండా ఉండాలని, తన రక్తంతో శివుడికి అభిషేకం చేసే యువకులు, ధనధాన్యాదుల కోసం కన్న బిడ్డల్ని కాళీమాతలకు బలి ఇచ్చే అజ్ఞానులు మనలో ఉన్నారని 'అయ్యోపాపం' అనిపిస్తుంది. కాళికాదేవిని తాను పూజిస్తానని, ఆమె భక్తుడనని, ఆమె వాహనమైన సింహం తనని ఏమీ చెయ్యదనీ, ఒక యువకుడు 'జూ'లోని సింహంతో పోరాడి ప్రాణాలు పోగొట్టుకున్నాడు ఈ మధ్యే. ఎంత మూఢ నమ్మకం గల వాళ్లు ఉన్నారో చూడండి.

మనకున్న వందలాది దేవుళ్లకు వేలాది ప్రతినిధులు ఉన్నారు. వీళ్లకి ఆ దేవుడి అడ్రసు తెలియదు. కానీ వాళ్లకి తెలియనిది లేదని ప్రచారం చేస్తుంటారు. ఆ ప్రతినిధులకున్న అసంఖ్యాకమైన శిష్యకోటి. ఈ దేవుడి ప్రతినిధులు వారి మహిమ చూపటం కోసం కొన్ని 'ఫీట్సు' చేసి ప్రజల్ని ఆశ్చర్య సముద్రంలో ముంచేస్తుంటారు. విదేశపు గడియారాలను, విభూదిని ఊహామాత్రములో సృష్టించి చేతికందించగలరు. తీర్థం ఇచ్చి దీర్ఘ రోగాల్ని నయం చెయ్యగలమనేవారు కొందరు. ఆ స్వామీజీలు, గురూజీలు ఆకలితో అలమటిస్తున్న అశేష ప్రజానీకానికి తమ మహిమచేత అన్నపానాదుల నొసగి తృప్తి పరచవచ్చునే! ఆస్పత్రుల అవసరం లేకుండా రోగాల్ని నయం చెయ్యవచ్చునే! అదేమని, అడిగితే వాళ్ళదగ్గర 'రెడీమేడ్' సమాధానం ఉంది. ఎవరి ఖర్మను వాళ్ళు అనుభవించాలని అంటుంటారు. అలా అయితే ఆ స్వామీజీల, గురూజీల మహిమ ఏమిటి?—వారి భ్రమలో పడి పోయ్యేవారు కేవలం యుక్తాయుక్త విచక్షణా జ్ఞానం లేని వారే కాదు. మిక్కిలి విద్యావంతులైన వాళ్ళు, పదిమందికి ఆదర్శ ప్రాయంగా నిలబడవల్సిన వాళ్లు శాస్త్రవేత్తలు గూడా ఉన్నారు. అటువంటి వారే దాసోహం అంటూంటే, సామాన్యులు మూఢ నమ్మకంతో ఆ స్వాముల్ని కొలవటంలో ఆశ్చర్యమేముంది?

కొచ్చిన్‌లోని శ్రీకోవూర్ అనే పేరుబడసిన డాక్టరు, మహిమలు మహత్తులు గలవారెవరైనా సరే, దైవిక శక్తులున్నాయని ఋజువు చేసినట్లయితే, లక్ష రూపాయలు బహుమతినిస్తానని ఈ మధ్యే సవాల్ చేశాడు. ఆయన తన యాభై సంవత్సరాల జీవితాన్ని ఈ పరిశోధనలోనే గడిపి, చివరికి మహిమలన్నీ బొట్టి బూటకాలని నిర్ధారణకు వచ్చి, వాటిని ఋజువు చేసినవారికి లక్ష రూపాయలు ఇస్తానని, తాను జీవించి ఉన్నంతవరకు ఎప్పుడైనా సరే, ఈ సవాల్‌ను ఎదుర్కొనవచ్చునని పేర్కొన్నాడు. తన తర్వాత, తన కుమారుడు గూడా ఈ పందెం ఉంచుతాడని ఆశిస్తున్నాననీ ప్రకటించాడు. ఎంతోమంది మహానుభావులు, తాము సాక్షాత్తు భగవంతుని ప్రత్యక్ష రూపాలని చెప్పుకుంటున్నారు గదా. వీరు మరి ఆ అవకాశాన్ని వినియోగించుకొని జనబాహుళ్యానికి సందేహనివృత్తి కలిగించుతారా?

దేవుడి పేరుమీద అప్పుడప్పుడు కొన్ని సంచలనం కలిగించే వార్తలు పుడుతుంటాయి. మద్రాసులో ఒకచోట దేవుని విగ్రహం భూమిలోనుంచి పైకి ఆవిర్భవిస్తుంటే, నేను చూశానంటే, నేను చూశానని చెప్పుకొచ్చారు. ఆ దేవుని మహిమ ఇంత అంతా కాదని, కోరిన కోర్కెలు వెంటనే తీర్చే ప్రత్యక్ష దైవంగా పూజించారు. కథలు అల్లారు. కావల్సినంత ప్రచారం చేశారు. తర్వాత పోలీసులు ఆరా తీసి కనుక్కుంటే, ఆ దేవుని విగ్రహం భూమిలో నుంచి వచ్చింది కాదని, కావాలని తీసుకొచ్చి ప్రతిష్ఠించిందేనని తేలింది. తమ స్వార్థ ప్రయోజనాలకై కొందరు దేవుని పేరు మీద గూడా ప్రజల్ని ఎంత నమ్మకంగా మోసం చెయ్యటానికి సిద్ధపడుతున్నారో చూడండి.

అన్ని మతాలు ఒక్క విషయాన్ని ఏకగ్రీవంగా ఒప్పుకుంటున్నాయి. మానవ సేవే మాధవ సేవ అని, మనిషిని ధర్మానికి, న్యాయానికి కట్టుబడి నడవమని బోధిస్తున్నాయి. పక్కవాళ్ళకి పిడికెడు జాలిని పంచిపెట్టమని, తోటివాడి కోసం, కనీసం ఓ పీసం ఎత్తయినా త్యాగం చెయ్యమనీ ప్రబోధిస్తున్నాయి. భయానికి లొంగినంతగా, మనిషి బోధనలకి లొంగడు. మనిషిలో పడగవిప్పే స్వార్థాన్ని అణగకొట్టటం కోసం, భయపెట్టి అయినా అన్యాయార్జితాన్ని కొంత ఖర్చు చేయించటం కోసం, పూజలనీ, పునస్కారాలనీ, కల్పించారు. వీళ్లకోసం స్వర్గంలో రంభలూ, నరకంలో కాగుతున్న నూనె బాండీలు తయారుగా ఉన్నాయన్నారు. పాప పుణ్యాల లెక్కల్నీ, చిత్రగుప్తుడి చిట్టాలనీ అడుగడుగునా గుర్తు చేసేది, మనిషిని ఆత్మ విమర్శ చేయించుకునే దానికేనేమో అనిపిస్తుంది.

మనిషికి ఎన్నో ఆలోచనలు. ఎన్నో ఆందోళనలు. అనుక్షణం అంతులేని మనస్తాపంతో మనిషి క్రుంగిపోతుంటాడు. ఈ బాధలను మర్చిపోయి కాసేపయినా ప్రశాంతంగా గడపటం కోసం, భారాన్నంతా భగవంతుని మీద నిలిపి, ప్రార్థన చేయమన్నారు. ఈ ప్రార్థనవల్ల మనస్సుకు కాస్తంత ఊరట కలుగుతుంది. మనిషికి కాస్తంత ధైర్యం కలుగుతుంది. నిశ్చలమైన మనస్సుతో తిరిగి తన కార్యకలాపాలను కొనసాగించుకొనే అవకాశం వుంటుందనే ఉద్దేశంతో, అన్ని మతాలు భగవంతుని ప్రార్థన చెయ్యమని చెబుతున్నాయి. కానీ ఏ మనశ్శాంతిని పొందటానికైతే ప్రార్థనాలయాలు, దేవాలయాలు ఏర్పడ్డాయో, అక్కడ ఆ మనశ్శాంతి కరువవుతున్నది. జనసందోహంవల్ల తోపిడి, తొక్కిసలాటలు జరుగుతున్నాయి ఉత్సవాల పేరుపెట్టి లౌడు స్పీకర్లు పెట్టి, అర్ధరాత్రి వరకూ పరిసర ప్రాంతాలవారికి నిద్రాభంగం కలుగజేస్తూ ఆరోగ్యభంగమయ్యే. అర్థంలేని గంద్రగోళం చేస్తుంటారు. ఇందువల్ల ఆ ప్రార్థనలు ఏర్పరిచిన అసలు ఉద్దేశమే భంగమైపోతుంది. ప్రశాంతమైన వాతావరణము. నిర్మలమైన మనస్సు. ఆర్భాటము లేని భక్తి, భగవత్ప్రార్థనకు ఎంతైనా అవసరం.

దయ్యాల్ని గురించి గూడ చెప్పుకుంటుంటారు. ఇవి మనుష్యులతో మాట్లాడుతాయనీ, పోట్లాడుతాయనీ, పాడుతాయనీ, ఆడుతాయనీ ఎన్నో రకాలుగా వర్ణిస్తారు. ఈ దయ్యాల నివాసం ఊరి చివరనో, పాడుబడ్డ కొంపల్లోనో అయి వుంటుంది. ఎప్పుడో, ఎక్కడో గుర్తులేదుగాని, ఒకచోట దయ్యాలున్నాయని కొంతమందీ, లేవని కొంతమందీ వాదించుకున్నారు. దయ్యాలు లేవనేవాడు ఎవడైనా సరే అమావాస్య అర్ధరాత్రి దయ్యాల కొంప అని పేరుబడ్డ ఆ భవనం చుట్టూ తిరిగి రావాలని సవాల్ చేశారు. ఒక కుర్రవాడు ముందు కొచ్చాడు. అమావాస్యనాటి అర్ధరాత్రి వాళ్ళంతా ఒకచోట పోగయినారు. అతనా బిల్డింగ్ చుట్టూ తిరిగి వచ్చినందుకు గుర్తుగా గోడమీద గజానికొకచోట '×' మార్కు గీతలు గీయమన్నారు. సరేనని వెళ్ళాడు. వెళ్ళినవాడు తెల్లారేదాకా తిరిగి రాలేదు. పొద్దున మిగిలిన వాళ్ళంతా వెళ్ళిచూస్తే అతను చచ్చిపడి ఉన్నాడు. పరీక్షగా చూసిన తర్వాత తేలిన దేమంటే, అతని చొక్కాకి గోడకున్న మేకు ఒకటి పట్టి, వెనక్కి లాగింది. భయంతో బిక్కచచ్చిపోయి ఉన్న అతనికి గుండె ఆగింది. మనిషి ఎక్కువగా భయపడేది భయానికే గదా!

ఇలాంటి మూఢ నమ్మకాలు గాఢంగా పాతుకుపోయినందువల్లనే కొన్ని కొన్ని అలవాట్లు దురాచారాలుగా మారి దుర్భరంగా తయారవుతున్నాయి.

పెళ్ళికెదిగిన పిల్లలున్నాగూడా భార్య చనిపోతే, భర్త తిరిగి వివాహం చేసుకోవచ్చు. ఈ పిల్లలంతా ఎవరిదోవన వాళ్ళు వెళ్ళిపోతే, పెద్దతనంలో నన్ను చూసేవాళ్ళు ఎవరున్నారు? అని సమర్థించుకుంటాడు పునర్వివాహాన్ని. నిజానికి మగవాడికన్న ఆడదానికున్న సాంఘిక సమస్యలే ఎక్కువ. మరో మగమనిషి సహాయ సహకారాలు లేకుండా స్త్రీ తన శేష జీవితానికి సంబంధించిన సమస్యల్ని పరిష్కరించుకోలేదు. అందువల్ల పునర్వివాహం పురుషుడికన్నా స్త్రీకే ఎంతో అవసరం. నిజానికిప్పుడు జరుగుతున్న దేమిటి? భర్త చనిపోయిన తర్వాత జీవితానందానికి దూరం కావటమే గాక విధవరాలు అయి, అనాకారి అయి, తోటివాళ్ళకు తన ముహాన్ని గూడా చూపించలేనిదై కుళ్ళిపోతున్నది. ఎంత క్రూరమైనదీ ఆచారం?

మగవాడు తిరుగుబోతు అయినా సరే. తాగుబోతు అయినా సరే, తన్ని తగలేస్తున్నా సరే. కట్టుకున్న నేరానికి ఆ బాధలన్నీ భరించవల్సిందే స్త్రీ. ఇది పతివ్రతా ధర్మంగా భావిస్తారు. మగవాడు ఇష్టం వచ్చినట్లు తిరుగవచ్చు. ఆయన భార్య మాత్రం పాతివ్రత్యాన్ని పాటించాలి. ఇది ఏమి కట్టుబాటు? అన్యోన్య అనురాగము, సరిసమాన బాధ్యతలు లేని దాంపత్యం ఎవరిని సుఖపెడ్తుంది?

మగవాడు పుచ్చుకున్న స్వేచ్ఛను, స్త్రీకి గూడా కాస్తంత పంచి పెట్టడం అవసరం. మంగళసూత్రాలు, మల్లెపూలు, పసుపు కుంకుమలు కేవలం స్త్రీ సౌందర్యాన్ని ఇనుమడింప జేయటానికి ఆమెకు అందించడమేగాని మరేం లేదు. అవి ధరించని అనేకమంది మిగిలిన మతాల స్త్రీలకు విదేశీ వనితలకు పతిగౌరవం లేదని అనగలమా? కాపోతే అవి మన అలవాట్లు, ప్రతివాళ్ళూ వాళ్ళ అలవాట్లకు ఏదో ఒక విశేషాన్ని జోడించి చెబుతుంటారు. సిగరెట్టు తాగకపోతే పిచ్చెక్కిపోతుందంటాడు ఒకడు. తాగని వాళ్ళందరికీ పిచ్చెక్కుతున్నదా? ఆ అలవాటు అతణ్ణి అంతగా లొంగదీసుకున్నదని అర్థం. ఏమైనా. నేటి మన సమాజంలో స్త్రీకి కొంత అన్యాయమే జరుగుతున్నది. భర్త ఉన్నన్ని రోజులూ అతని యిష్టా యిష్టాలకు అనువుగా లొంగదీయటం, భర్త చనిపోగానే ఆమె జీవితాన్ని బండలపాలు చెయ్యటం అమానుషం. మూఢనమ్మకాల ఇనుప గుప్పిటినుంచి బయటపడి ఆలోచించలేకపోవటమే దీనికి కారణం. నీతి గాని. శీలం గాని. సుఖం గాని మగవాడికి స్త్రీకి సమానంగా వర్తింపచెయ్యాలి. జనాభా పెరుగుదలను అరికట్టకపోతే, మానవ జాతికి అరిష్టాలు తప్పవని అభ్యుదయము సాధించిన అన్ని దేశాల శాస్త్రజ్ఞులు అంటూవుంటే మన దేశములో మత గురువులనబడేవారు కుటుంబనియంత్రణ పద్ధతి తప్పు అని ప్రచారముచేస్తూ ఉంటే ఇటువంటి మత మౌఢ్యాలు ఎప్పుడు అంతరిస్తాయని సందేహము కలుగుతోంది. విజ్ఞాన దీపికతో ప్రకృతిలోని రహస్యాలను కనుగొని కృత్రిమ వర్షాన్ని గూడా కురిపిస్తూ. ఆరోగ్యము. సిరిసంపదలు అభివృద్ధి జేసికొని, ఇతర దేశపు మానవులు పురోగమిస్తూంటే. ప్రాచీన యుగములోని మూఢ సిద్ధాంతాలను వల్లెవేస్తూ ఉండటం ఎంత తెలివిమాలిన పని!

తర్కానికి, హేతువాదానికి లొంగనిది ఏదైనా మూఢనమ్మకమే. మూఢ నమ్మకాలు దురాచారాలకు దారి తీస్తాయి. మనిషి బ్రదుకులో ఈ దురాచారాల ముళ్ళజెముడు పొదల్ని పెకలించివేసి, ప్రమాణానికి నిలబడే సత్సాంప్రదాయాల సన్నజాజుల తీగల్ని పెంచుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకొని మానవుడు పురోగమించాలని ఆశిద్దాం.

★

ధీరోదాత్తుడు - విప్లవమూర్తి :

# శ్రీ అన్నాప్రగడ కామేశ్వరరావు

వి. యల్. సుందరరావు

విప్లవ సంభరితము. త్యాగపూరితము అయిన శ్రీయుత అన్నాప్రగడ కామేశ్వర్రావుగారి జీవిత చరిత్ర ఆంధ్ర దేశములో తెలియనివారులేరు. అడుగడుగునా ఆశ్చర్యకర సంఘటనలతో సాహస కృత్యాలతో నిండి ఉంది. ఆయన జీవితగాథ, అది మాతృదేశ దాస్యశృంఖలావిచ్ఛేదం కోసం ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని చెరలాటమాడిన సాహసగాథ. ఆయనలోని ఆ త్యాగశీలత, దేశభక్తి, దీక్ష, సాహసం, యావజ్జీవ కృషి ఒక తపస్సు వంటిది. యిటువంటి తపస్వుల కారణంగానే ఆనాడు జాతీయోద్యమం క్రమక్రమంగా యువజనుల్ని, విశాల ప్రజానీకాన్ని ఆకర్షించుకొంటూ, విస్తరించుకొంటూ, పెంపు వహించుతూ, విస్తృత ఉద్యమంగా రూపొందింది, విరాజిల్లింది. ఉత్తేజకరమైన, ఆదర్శప్రాయమైన. యిటువంటి విప్లవనాయకుల చరిత్రలు ఆనాడు వేలు లక్షల మందిని జాతీయోద్యమ పరిధిలోనికి ఆకర్షించాయి. ప్రభావితంజేశాయి. త్యాగాలు జేయించాయి.

జాతీయ సంస్థలు– జాతీయోద్యమాలు– దేశచరిత్రలు–యీ మహనీయుల జీవితాలతో పెనవేసుకొని ఉన్నాయ్ ఈ మహనీయుల సంస్మరణ మన చరిత్ర సంస్మరణ అనేచెప్పాలి. వీరి జీవిత విశేషాలే మనల్ని మన ముందుతరాలవారిని_దేశభక్తి, దేశ సమైక్యతా, దేశ సంక్షేమం పట్ల ప్రేరేపితుల చేయగలవనుటలో సందేహంలేదు.

## జననం-బాల్యం

1902 సం॥ అక్టోబరు 21వ తేదీన కనుపర్తిలో శ్రీ అన్నాప్రగడ కామేశ్వర్రావుగారి జననం. గుంటూరు జిల్లా, నరసరావుపేట తాలూకాలోని నాదెళ్ళ పక్కన ఒక కుగ్రామం కనుపర్తి. శ్రీయుతులు వెంకటేశ్వర్లు, వెంకటరత్నం. సత్యనారాయణ అనే ముగురు సోదరులు, ఐదుగురు సోదరీమణులు గలరు. పాఠశాలలో చదువుకొనేటప్పుడే శ్రీ కామేశ్వర్రావుగారిని జాతీయ భావాలు ఆకర్షించాయి. వంగరాష్ట్ర విభజనకు వ్యతిరేకంగా "వందేమాతరం" ఉద్యమం దేశంలో ముమ్మరంగా సాగుతున్నరోజులవి. నిర్దిష్టమైన గమ్యం, కార్యక్రమం నిర్ణయించుకోలేని లేత్రాయం శ్రీ కామేశ్వర్రావుకు. పొంగివచ్చే ఆ ఉత్సాహం దారి దొంకా గానక పరువులెత్తుతుంది. తోటి బాలురతో కలిసి జాతీయ ప్రచారానికి దిగాడు. గుంటూరు, నరసరావుపేట, కర్నూలు లాంటి పట్టణాలు పరిసర గ్రామాలు తిరుగుతూ యింటిమొఖం చూడకుండా వాలంటీర్లతో చేరి కొన్ని మాసాలు ప్రచార కార్యక్రమంలో నిమగ్నమైనాడు.

పూవు పుట్టగనే పరిమళం విరజిమ్మినట్లు, పది పన్నెండు సంవత్సరాలు నిండని ఆ వయస్సులోనే దేశమాత పాదాలకడ ఆ జీవితం అంకితం కానున్నదని స్పష్టమైంది.

## మిలటరీలో చేరిక-తిరుగుబాటు

బొంబాయిలో మహాత్మాగాంధీ కాలూనారు. యిరవై ఎనిమిది సంవత్సరాలు దక్షిణాఫ్రికాలో సత్యాగ్రహ పోరాటాలు నడిపిన అనుభవం గడించి వచ్చారు. భారత రాజకీయాలు అక్కడే కేంద్రీకరించాయి. శ్రీ కామేశ్వర్రావుకు ఏమీ తోచ లేదు. 1917లోనే తాను గూడా బొంబాయి చేరాడు. అక్కడ నుండి అనాలోచితంగా అనేక ప్రదేశాలు మెట్టాడు. ప్రథమ ప్రపంచయుద్ధం ముమ్మరంగా సాగుతున్నది. మిలటరీ కవాతులు, విన్యాసాలు ఆకర్షించాయి. జాతీయోద్యమానికి మిలటరీలో తర్ఫీదు పొందిన యువకులు కావాలని విప్లవకారులు ప్రచారంచేస్తున్న రోజులు. యువకులంతా సైన్యంలోచేరి యీ యుద్ధంలో ఇంగ్లీషు వారికి సహాయం చేయండని గాంధీజీగూడా ప్రచారం చేస్తున్నారు. ఈ మాట మన కామేశ్వర్రావుగారి చెవిన పడినది. వెంటనే తన పేరు మిలటరీలో నమోదు చేసుకొన్నాడు. నాగపూరు, జబల్పూరు కంటోన్మెంటులలో శిక్షణ పూర్తిచేసి యుద్ధరంగానికి తరలించారు ఆయనను.

19.9 లో మొదటి ప్రపంచయుద్ధం సమాప్తమైంది. సార్వభౌమాధికారంపై తిరుగుబాటు చేయాలని మిలటరీలో రహస్యంగా దేశభక్తులు కొందరు ప్రచారం చేస్తున్నారు. తన దళంలోనే పనిచేస్తున్న జాతీయ వాదులతో శ్రీ కామేశ్వరావు మిలాఖత్ అయ్యారు. యుద్ధం ముగిసేటప్పటికి యిరాక్ లోని బసరా అనే

చోట ఉన్నది వీరి సైనిక పటాలం. దేశభక్తులైన యీ సైనికులు జరుపుతున్న ప్రచార సమాచారం పై ఉద్యోగులు పసిగట్టారు. మన కామేశ్వరావుగారు అందలో ప్రముఖుడని కూడా గ్రహించారు. రాజద్రోహనేరం మోపి కోర్టు మార్షలు చేశారు. అంటే రాజద్రోహ నేరంక్రింద కాల్చివేయుటకు ఉత్తరువులు యిచ్చారు.

'రేపు' ముహూర్తం నిర్ణయం చేశారు ఈ తీర్పు ఇచ్చింది. కెప్టన్ కానన్ అనే బ్రిటీషు ఆఫీసరు. సాయంత్రం ఆఫీసర్ల క్లబ్బులో యీ కెప్టన్‌కానన్ విజయోత్సహంతో కేరింత లాడుతున్నాడు, మధుపానాలు సేవించి. శ్రీ కామేశ్వర్రావుకు గురిపెట్టిన ఆ తుపాకిగుండును ఎట్లా తొలిగించాలని ఎందరో సాటి సైనికులు తహతహ పడుతున్నారు. అట్లాగే మన కామేశ్వర్రావులోని పొంగులెత్తే ఆ యువకత్వాన్ని ఆ ఉత్సాహాన్ని చూసి మమకారం పెంచుకొన్న ఒక యింగ్లీషు ఆఫీసరుగూడా ఉన్నాడు. ఆయన పేరు లెఫ్టినెంటు వారన్. క్లబ్బులో కేరింతలాడుతున్న కెప్టన్ కానన్ దగ్గరకు వెళ్ళాడు లెఫ్టినెంటు వారన్. "మనం యుద్ధం గెలిచాం. విజయోత్సవాలు జరుపుకొంటున్నాం. మన విజయానికి కారకులైనవారు మన భారత సైనికులు. వారిని ఇప్పుడు శిక్షించుట మంచిదికాదు. తప్పుచేసిన క్షమించాలి, ఆ యువకుడు కామేశ్వర్రావు నాకు తెలుసు. చాలా భవిష్యత్ గలవాడు. ఆయన ప్రాణదానాన్ని చెయ్యండి" అని అర్థించాడు.

ఈ అభ్యర్థనను మన్నించి కెప్టను కానను షూటింగు ఆర్డరును రద్దుచేసి జైలుశిక్ష విధించాడు. కొన్ని మాసములు జైలు శిక్ష చేసి విడుదల కాబడినాడు. 1921 సం॥ అక్టోబరు మాసంలో శ్రీ కామేశ్వర్రావుగారు కరాచీ జేరుకున్నారు. అప్పుడు దేశంలో నలుమూలలా సత్యాగ్రహోద్యమం ముమ్మరంగా జరుగుతున్నది. ప్రభుత్వ బిరుదులు, కోర్టులు, విద్యాలయాలు బహిష్కరణ "ట్రిపుల్‌బాయ్‌కాట్" ఉద్యమంతో ప్రతిచోట ప్రతినిత్యం మారు మ్రోగుతున్న రోజులు. లాఠీచార్జీలు అరెస్టులు సర్వసాధారణంగా ఉన్నాయ్. మిలటరీ తిరుగుబాటుకు ప్రయత్నంచేసి విఫలమైన సైనికులు మిలటరీ వదలివచ్చి యీ ఉద్యమంలో చేరారు. ప్రభుత్వసేవకు ప్రతిఫలంగా, భూములు, పెన్షన్లు, సివిలు ఉద్యోగాలు లాంటి ఎంగిలి మెతుకులు ఆశించి, వారు ప్రభుత్వ విధేయులుగా ఉండలేక పోయారు దేశభక్తులైన యువకులు త్యాగానికి పోటీ పడుతారుగాని స్వార్థానికి తలవంచరు గదా! ఉగ్గుపాలతోనే మాతృదాస్య విమోచనకై దీక్షబూనిన శ్రీ కామేశ్వరావుగారి విషయం చర్చించనేల?

## సత్యాగ్రహిగా జైలు

కరాచీనుండి మధుర అక్కడనుండి వివిధ ప్రాంతాలు పర్యటన చేసి శ్రీ కామేశ్వర్రావుగారు 1921 సంవత్సరాంతానికి స్వగ్రామమైన నాదెళ్ళ చేరారు. పల్నాడులో పుల్లరి సత్యాగ్రహం జరుగుతున్నది. ఆంధ్రదేశానికి గర్వకారణమైన యీ పల్నాడు సత్యాగ్రహంలో దేశభక్త కొండ వెంకటప్పయ్య పంతులు, శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణగార్ల నాయకత్వాన ముఖ్యమైన వారంతా కారాగార వాసంలో బందీలుగా ఉన్నారు. పోలీసు నిరంకుశత్వం మిలటరీ జులుం విలయతాండవం చేస్తున్నది. ఎక్కడచూసినా 144 వ సెక్షనే. ప్రతిగ్రామం ఒక రంగస్థలమైంది. మాతాపితలను, బంధువులను, స్నేహితులను చూసి తన వయస్సు వారితో తన ముచ్చట్లు అనుభవాలు చెప్పుకోవాలని వచ్చిన మన కామేశ్వర్రావుకు స్వగ్రామం చేరేటప్పటికి పరిస్థితులు వేరుగా కనిపించాయి

తనకోసమై తయారుచేసిన రంగస్థలం తన పాత్రాభినయనం చేయమని ఆహ్వానించుతున్నట్లు ఉన్నాయ్ పరిస్థితులు. వెంటనే ఖద్దరుటోపి ధరించి సత్యాగ్రహం చేశారు. స్వగ్రామంలోనే 144 సెక్షను ధిక్కరించి జైలుకు వెళ్ళారు. ఒక సంవత్సరం ఉన్నారు జైలులో. విడుదలయ్యాక వెంటనే 1922 డిసెంబరులో గయలో జరిగిన అఖిలభారత కాంగ్రెసుకు హాజరయ్యారు. 1924 లో బెల్గాంలో జరిగిన కాంగ్రెసుకు కూడా హాజరువేశారు. అచటనుండి బెలూచీస్తాన్ చేరుకన్నారు. మన సరిహద్దులు, పర్వతశ్రేణులు, దేశసౌభాగ్యం, చరిత్రలలోని విశిష్టాను భూతులను ప్రేరేపించుకొన్నారు. యిప్పటికి తన ఆలోచనలు అనుభవాలు పరిపక్వాన్ని చెందాయనే చెప్పాలి.

## విప్లవ పార్టీలో అధ్యాపక స్థానం

మాతృదేశ దాస్యశృంఖలా విచ్ఛేదనకై క్రిమశిక్షణతో గూడిన పార్టీ కావాలని, తుపాకి పట్టాలని నిశ్చతమైన నిర్ణయాలు కొన్ని కలిగాయి. అప్పుడే తటస్థపడినాడు ఒక మహావిప్లవకారుడు శ్రీ వి.వి.యస్ అయ్యరు. ఆయన కొంతకాలం యింగ్లండులో వినాయక దామోదర సావర్కారుతో సాహచర్యం నెరపి_ భారత దేశంలోని విప్లవోద్యమాన్ని నిర్మాణం చేస్తున్నారు. విధివిరామం లేకుండా దేశంలో విప్లవ కార్యక్రమాలు నడుపుతున్న సావర్కారు సోదరులు డ॥ సావర్కారు, గణేశ సావర్కారులను శ్రీ అయ్యరు మన కామేశ్వరావుగారికి మిలాఖత్ చేశారు. వీరంతా కామేశ్వర్రావు గారిని బరోడాలోని విప్లవకారుల తాలింఖానాలో అధ్యాపకులుగా నియమించారు. దానినే జుమ్మాదాదా వ్యాయామ మండలి అని పిలిచేవారు యిచట లేజీమ్స్, లాఠీ, కర్ర, కత్తిసాము, జాతీయ ప్రబోధం ముఖ్యమైన తరగతులు. వీటితోపాటు రహస్యంగా తుపాకి, రివాల్వారు తర్ఫీదులు యిస్తారు శ్రీ కామేశ్వర్రావుగారు వీటన్నిటిలో సిద్ధహస్తులే గదా! యిక్కడ నుండి 1925 లో కాన్పూరులో జరిగిన అఖిలభారత కాంగ్రెసు సభకు వెళ్ళినపుడు భటకేశ్వరదత్తుతో పరిచయం లభించింది, అప్పటినుండి హిందుస్థాన్ రిపబ్లికన్ ఆర్మీలో గూడా సభ్యత్వం లభించింది. ఉత్తర దేశంలోని అన్ని రాష్ట్రాలలోని విప్లవపార్టీ కార్యకలాపాలలో భాగస్వామ్యం గలిగింది. బరోడా మహారాజు శ్రీ గయక్వాడు యీ పార్టీ తరపున ఆయుధాలు సంతరించుకొని వచ్చే కార్యక్రమం గూడా నిర్వహించారు. శ్రీ కామేశ్వర్రావుగారు, భగత్‌సింగు, రాజగురు, దత్తు, సుఖదేవ్, జోగేస్‌చటర్జి, మన్మదనాథ్ గుప్త మొదలగు విప్లవవీరులతో కలిసి పనిచేసిన కాలం అది.

## శ్రీమతి సరళాదేవిగారితో వివాహం

శ్రీ కామేశ్వరరావుగారి విప్లవ కార్యక్రమాలు. జాతీయ ప్రచారం గుజరాతు రాష్ట్రానికి అచట జాతీయోద్యమానికి హెచ్చు సంబంధమున్నట్లు రుజువైనాయి. విధి లిఖితం కాబట్టి ఆంధ్ర సీమలో జన్మస్థలమైనా గుజరాత్ రాష్ట్రంలో తన సహధర్మ చారిణిని పొందగలిగాడు. ఆమె పేరు శ్రీమతి సరళాదేవి. వారి కుటుంబం కూడా దేశభక్తిలో అగ్రశ్రేణికి చెందిన కుటుంబం. శ్రీమతి సరళాదేవి త్యాగానికి శీలానికి మచ్చుతునక. పుట్టినింటికి మెట్టినింటికి కీర్తి ప్రతిష్ఠలు సంపాదించిన మహాసాధ్వి. 1929 సం॥లో శ్రీ కామేశ్వరరావుగారికి సరళాదేవిగారికి సూరత్‌లో వివాహం జరిగింది. స్వర్గీయ శ్రీ మాచిరాజు రామమూర్తిగారు సశాస్త్రీయంగా యీ దంపతులకు గుంటూరులో సుస్వాగతం పలికారు. శ్రీమతి సరళాదేవిగారు—ఆ గుజరాతీలాగు, పొడుగాటి చొక్కా, క్రాస్‌బెల్టు, తల్వారు ధరించిన, ఆ వీర నారీరత్నాన్ని ఆంధ్రదేశానికి కోడలుగా స్వీకరించడం చరిత్రలో సగర్వంగా లిఖించబడినది. సదా యువకత్వంతో పొంగులువారే మన కామేశ్వరరావు ఎన్నిపరవళ్ళు చేసినా, ఏకపత్నీ వ్రతుడుగా సాటిలేని ఖ్యాతినార్జించిన ఆంధ్రమాత ముద్దుబిడ్డడనుటలో అతిశయోక్తి కానేరదు.

## గుంటూరు సత్యాగ్రహంలో దంపతుల అరెస్టు

1930 లో గుంటూరులో సత్యాగ్రహోద్యమం ముమ్మరంగా సాగుతున్నది. విదేశీ వస్తు బహిష్కరణ. 144 సెక్షను ధిక్కరణ చేసి సత్యాగ్రహులు వంతులు వంతులుగా స్వరాజ్య మైదానంలో అరెస్టు కాబడుతున్నారు. లాఠీచార్జీలు సర్వ సాధారణంగా ఉన్నాయి. పోలీసు సర్కిల్ యిన్‌స్పెక్టరు కనకరాజు వీర విహారం చేస్తున్నాడు. సత్యాగ్రహులను యీగలు దోమలను పారద్రోలినట్లు తన లాఠీతో చెలరేగుతున్నాడు.

మన కామేశ్వరరావుగారు అశ్వారోహుడై బారైన జెండా చేబూని, వూరేగింపుతో వచ్చి స్వరాజ్య మైదానంలో ప్రవేశించగనే అరెస్టుచేసి జైలుకు తీసుకువెళ్ళారు.

మరొక రోజున స్వర్గీయ నేత చలపతిరావుగారి నాయకత్వాన సత్యాగ్రహ దళం స్వరాజ్య మైదానం ప్రవేశించగనే విపరీతమైన లాఠీచార్జి చేసి రక్తం చిందించారు. శ్రీ చలపతిరావుగారి తల చిట్లింది. ప్రజలలో ఉద్రేకాలు పెరిగాయి. స్వర్గీయ వింజమూరి అనంతాచారిగారి నాయకత్వాన మహిళా వాలంటీరులతో కలసిన మరొక సత్యాగ్రహ దళం స్వరాజ్య మైదానం ప్రవేశించింది. కొందరిని అరెస్టుచేసి మరికొందరిని లాఠీచార్జిచేసి, మహిళలను నేలకు విసిరికొట్టి సుప్రసిద్ధ పోలీసుబంటు కనకరాజు సార్థక నాముడయ్యాడు. సాయంత్రం నాలుగు గంటలనుండి క్రమ క్రమంగా ప్రజలలో పెరుగుతున్న ఆవేశ కావేశాలు చల్లబడుటకు మార్గంలేక పోయింది.

మహిళా సత్యాగ్రహులను అవమానకరంగా చూశారన్న సమాచారం తెలిసి శ్రీమతి. సరళాదేవి మరొక దళానికి నాయకత్వం వహించి బ్రాడీపేటనుండి స్వరాజ్య మైదానానికి బయలుదేరింది. పోలీసు బలగం ఎదురు తాకిళ్ళు చేస్తానికి రైలుగేటు దగ్గరకు వెళ్ళారు. వారితోపాటు ప్రజా సమూహంగూడా వచ్చింది. శ్రీమతి సరళాదేవితోపాటు తన చిన్న తనయుడుగూడా జాతీయ జెండా పట్టుకొని వెంటఉన్నాడు. సర్కిల్ యిన్‌స్పెక్టరు కనకరాజు బలవంతంగా ఆజెండా గుంజుకొన్నాడు. దబాయించి లాగిన కారణంగా చేయి నొప్పిగలిగి ఏడ్చాడు, ఆ బాలుడు. ఆ బాలుని యిన్‌స్పెక్టరుపైకి త్రోసి "నీకు ధైర్యముంటే కాల్చు" అన్నది సరళాదేవి. ఆమె ప్రతి సాహసానికి చిన్నబోయిన యిన్‌స్పెక్టరు ఆమెచేతిలోని జెండాను గుంజాడు. ఆమె చెయ్యి గట్టిగా పట్టుకొని నిన్ను అరెస్టుచేస్తున్నాను అని రంకెవేశాడు. వెంటనే తన తల్వారును దూసి చేయి వదుల్తావా నరకమంటావా? అని గర్జన చేసింది వీరనారి సరళాదేవి. కనకరాజు శునకరాజు అయ్యాడు. పది గజాలు దూరం పరారు చిత్తగించాడు. ఈ సంఘటనను స్వయంగా వీక్షిస్తున్న వేలమంది ప్రజలు శెభాస్ అని ఆనందించారు. భారత మహిళ శౌర్య సాహసాలముందు. సత్యాగ్రహుల ఆగ్రహంముందు యీ పోలీసు తొత్తుల పరాక్రమేపాటిదని ఎల్లరూ సంతసించారు. ఆ తరువాత సరళాదేవి గారిని గూడా జైలుకు పంపించారు.

## దంపతుల విదేశీ యాత్ర

1931 సం॥ జైలునుండి విడుదలైన తరువాత దంపతులిరువురూ దక్షిణాఫ్రికా ప్రయాణం చేశారు. ఆఫ్రికాలోని టాంగనీకా రాజ్యానికి ప్రధాన నగరమైన జింజా పట్టణంలో శ్రీమతి సరళాదేవి సోదరి శ్రీమతి. క్షీరమతి పటేల్, ఆమె భర్త అంబాలాల్ పటేల్‌లు చాలాకాలంగా ఉన్నారు. అచటి కార్మికోద్యమ నేతలు వీరు వారి ఆతిథ్యాన్ని స్వీకరించుటకు వెళ్ళారు. 1933లో అక్కడనుండి నావలోని కెప్టెనుసహాయంతో రహస్యంగా శ్రీ కామేశ్వరరావుగారు మొంబాసా పోర్టునుండి రష్యాదేశం వెళ్ళారు. సోషలిస్టు సమాజ వ్యవస్థాపనద్వారా రష్యా సాధించిన విప్లవ విజయాలను రెండు సంవత్సరాలు ఉండి స్వయంగా అవగాహన చేసుకొన్నారు, మాతృదేశ విముక్తికై, పేదప్రజల సంక్షేమంకై నూతన మార్గాలు అన్వేషించే విజ్ఞానాన్ని సంతరించుకొన్నారు. వివిధప్రదేశాలు నాయకులను పరిచయం చేసుకొన్నారు, అనేక అనుభూతులు సంపాదించారు. అంతేగాదు, రష్యానుండి యూరపు ఖండంలోని జర్మనీ, ఫ్రాన్సు యిటలీ మొదలగు దేశాలు పర్యటించారు. మాతృదేశ స్వాతంత్ర్యాన్నిగురించి విశేష ప్రచారం చేయుటకు యీపర్యటనను ఉపయోగించారు. ఉద్దండ పిడుగు వోలిన శ్రీ కామేశ్వరావుగారి యీ సాహసయాత్రలు పరికించుతున్న బ్రిటిషు ప్రభుత్వం యీదంపతులు భారతదేశంలో కాలూనుటకు వీలు లేదని ఆంక్షలు విధించినది. ఆ కారణంగా ఆఫ్రికాలో చాలాకాలం గడపవలసి వచ్చింది.

## కొత్తపట్నం రాజకీయ పాఠశాల

ఆంధ్రదేశంలో కాలూని మరుక్షణమే శ్రీ కామేశ్వరావుగారు కార్యక్రమానికి ఉపక్రమించారు. తన తీవ్రవాద సోషలిస్టు

ఆదర్శాలకు అనుగుణ్యంగా రాష్ట్రంలో కార్యకర్తలను తయారు చేయాలని రాజకీయ వేసంగి పాఠశాలను నడుపుటకు సంకల్పించారు. 1937 లో ఒంగోలు సముద్రతీరంలోని కొత్త పట్నం వద్ద యీ పాఠశాలను ఆర్గనైజు చేశారు. యిదే ఆంధ్రదేశంలోనే కాక భారత దేశంలో ప్రథమ రాజకీయ పాఠశాల అని చెప్పాలి రాష్ట్రంలోని ఎందరో సేవకులు యిందులో విద్యార్థులుగా నమోదు అయ్యారు. దేశంలోని అతివాద నాయకులందరికి ఆహ్వానాలు అందజేశారు. పాఠశాల ప్రారంభమైంది. పదునిమిది రోజులు గడచింది. కలెక్టరు గారు నిషేధాజ్ఞలను జారీచేశారు కాని నిషేధాజ్ఞలకు బెదరి స్వగృహాలు చేరుటయా? లేక ధిక్కరించుటయా? అనే విషయం చర్చించి ధిక్కరించుటకు నిర్ణయం చేశారు. క్యాంపులోదూరి రిజర్వు పోలీసులు లాఠీచార్జి ప్రారంభించారు. ఆ లాఠీచార్జి ఎంత కఠోరమైనదో, ఎంతమందిని చిత్రహింస చేశారో ప్రత్యేకంగా ముచ్చటించుకోవలసిన విషయం. ముఖ్యంగా శ్రీ అన్నాప్రగడ కామేశ్వరావును స్వర్గీయ అల్లూరి సత్యనారాయణరాజును ఆ లాఠీచార్జి రక్తపాతంలో ముంచి ఎత్తింది. శ్రీ కామేశ్వరరావుకు వెన్నుపూస చిట్లిన కారణంగా శాశ్వత వికలాంగుని చేసింది. క్యాంపు ఆర్గనైజరుగా, స్వర్గీయ సాగి విజయరామరాజు ప్రదర్శించిన ధీరోదాత్తత సాటిలేనిది. శ్రీ గుళ్ళపల్లి ఆదినారాయణ శ్రీ యన్. పద్మనాభం ఒంగోలులోని యితర మిత్రులు ఎందరో ఆనాడు తోడ్పడ్డారు

మరునటి సంవత్సరం తిరిగి శ్రీ కామేశ్వరరావుగారు బాపట్ల తాలూకా మంతెనవారి పాలెంలో ఈ రాజకీయ పాఠశాలను నడిపారు. చక్కని మామిడితోట–విశాలమైన ప్రదేశం–దాపులో సముద్రం ఉంది. శ్రీయుతులు జయప్రకాశ నారాయణ, యం. యన్. రాయ్, ఇందూలాల్ యాగ్నిక్, డాంగే, అధికారి, రణదేవు, పి. సి. జోషి, బుకారి, ఆచార్యరంగా మొదలగు తీవ్ర వాద నాయకులంతా అధ్యాపకులుగా వచ్చారు. ఈ రాజకీయ పాఠశాలకు ఆతిథ్యం యిచ్చింది స్వర్గీయ మంతెన వెంకటరాజు శ్రీమతి అన్నపూర్ణమ్మ దంపతులు. ఆ మంతెన వారి పాలెంలోని యిళ్ళు సావిళ్ళు, తోటలు, ఆదరాభిమానాలు 40 రోజుల పాటు విద్యార్థులు కోకొల్లలుగా అందుకొన్నారు.

వేసంగి రాజకీయ పాఠశాల ముగిసిన తరువాత "విద్యావనం" నామకరణంతో జాతీయ విద్యాలయాన్ని అచటనే శాశ్వతంగా నడిపుటకు శ్రీ కామేశ్వరరావు దంపతులు ఉపక్రమించారు. చాలా పట్టుదలతో వ్యయంతో నడిపారు. 1940 జనవరి 8వ తేదీన ఏలూరు శ్రీ సుభాస్ చంద్రబోసు వచ్చిన సందర్భంగా యీ విద్యావనం బాలబాలికలచే విన్యాసాలు చేయించారు. యూనిఫారంతో లేజీమ్స్ మొదలగు ఉత్తరదేశంలోని వ్యాయామ పద్ధతులు చూచిన అందర్ని ముగ్ధులచేసినవి. శ్రీ సుభాస్ చంద్రబోసు, ఆ బాలబాలికలను చూసి ఎంతో గర్వపడుతున్నానని, తనను ముగ్ధుణ్ణి చేశారని, యిటువంటి జాతీయ విద్యాసంస్థలు విరివిగా నెలకొల్పాలని ప్రశంసించారు.

శ్రీ కామేశ్వరరావుగారు 1942 క్విట్ ఇండియా ఉద్యమంలో కొంతకాలం రహస్యంగా పనిచేసి అనేక కార్యక్రమాలు నడిపించారు తరువాత అరెస్టుచేసి యుద్ధం సమాప్తమయ్యేటంత వరకు డిటెన్యూగా జైలులో ఉంచారు.

1946లో జరిగిన ఎన్నికలలో గుంటూరు పట్టణ నియోజక వర్గం నుండి శ్రీ కామేశ్వరరావుగారు కాంగ్రెసు అభ్యర్థిగా మద్రాసు శాసన సభకు ఎన్నికయ్యారు.

శ్రీ అన్నాప్రగడ కామేశ్వరరావుగారు "అంకుశం" అనే వారపత్రికను మద్రాసునుండి చాలాకాలం నడపారు విప్లవచరిత్ర విప్లవకారులను గురించి వ్రాస్తూ ఉండేవారు

## సంతానము

శ్రీ అన్నాప్రగడ కామేశ్వరరావుగారికి ముగ్గురు కొమరులు ఒక కుమార్తె. విద్యావత్సలుడనే చిన్నకుర్రవాడు యింటర్ మెడియట్ చదువుతూ 17వ ఏట అమరావతి వద్ద క్రిష్ణానదిలో స్నానం చేస్తూ నదిలో కాలుజారిపడి చనిపోయాడు. ఆయన పెద్దకుమారుని పేరు క్రాంతికిరణ్. సీనియర్ కేంబ్రిడ్జీ చదివి అమెరికాలో ఎయిరొనాటిక్స్ మెకానిక్సు చదివాడు మహారాష్ట్రలో లోండా వద్ద వయపేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. వయస్సు యిప్పుడు 40 సం॥లు. 1957లో బరోడాలోగల ఆర్యకన్యా మహావిద్యాలయంలో ఉన్న పార్వతి అనే బర్మా అమ్మాయిని వివాహం చేసుకొన్నాడు. రెండవ వాని పేరు విపించంద్రనాద్. ఈయన వయస్సు 38 సం॥లు లైబ్రరీ సైన్సులో యం. ఎ. పట్టభద్రుడయ్యాడు. 1968లో రేఖారాజ్యలక్ష్మి అనే నేపాలు అమ్మాయిని వివాహం చేసుకొన్నాడు. ఈయన ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగిగా ఉన్నాడు. యిరువురికి సంతానం గలదు.

పుత్రిక పేరు చిరంజీవి సౌధామిని. ఆమె వయస్సు 34 సం॥లు పూనాలో సంగీత కళాశాల ప్రిన్సిపాలుగా పనిచేస్తుంది. మాతాపితలను తనదగ్గరే ఉంచుకొని జాగ్రత్తగా చూచుకొంటుంది. చిరంజీవి సౌదామిని ఎంతో వ్యయంతో భారతీయ శాస్త్రీయ నృత్యాలన్నీ నేర్చింది.

శ్రీ కామేశ్వరరావుగారికి స్వంతయిల్లు ఆస్తి అనేవి లేవు. కీర్తి ప్రతిష్ఠలు ప్రతిఫలంగా మిగిలాయి. రేపు అనే ఆలోచన యింత వరకు ఆయన జీవితంలోరాలేదు రాదు. మిత్రులు కనికరించలేదని ఏడ్వడు. కుల తత్వంతో, స్వార్థంతో, సంకుచితంగా వ్యవహరించే తన సహచరుల్ని దేశభక్తుల్ని మంత్రివర్యులను చూసినప్పుడు పంటిమీద యీగల్ని విదళించినట్టు విదలించుతాడు. ఆ మహాసాధ్వి సరళాదేవి యింతకంటెమిన్న. అన్ని ప్రశ్నలకు ఒక చిరునవ్వు సమాధానంగా చెబుతుంది.

ఢిల్లీలో జరిగిన రజితోత్సవ సందర్భంగా శ్రీ కామేశ్వరరావు గారిని ఢిల్లీ ఆహ్వానించినారు ఆయన తిరస్కరించారు కాని, నవంబరు 1వ తేది హైదరాబాదు రమ్మని ఆంధ్రప్రభుత్వం పంపిన ఆహ్వానాన్ని మన్నించి తామ్రపత్రాన్ని అందుకొన్నారు. ఈ మహనీయుని విప్లవ జీవితాన్ని చూసి గర్వించని ఆంధ్రుడు, భారతీయుడు ఉండడని నా విశ్వాసం. ఈ పాఠకులకు పరిచయం చేయుట ద్వారా ఆ దంపతుల దేశసేవకు కృతజ్ఞతా అంజలులు అర్పించుటే నా అదృష్టమని భావించుతా।

# మహాభారతము

తెంపెగంటుల లక్ష్మణశాస్త్రి

మార్కండేయ మహాముని యీ కథ చెప్పుచు యుధిష్ఠిరునితో నిట్లనెను:— "రాజా! ఇంద్రుడు దేవతలందరి సమక్షములో కుమారస్వామికి దేవసేనాధిపత్యమునందు పట్టాభిషేకము చేసెను. అప్పుడు కుమారస్వామి అతి శోభాయమానముగా విరాజిల్లెను. పార్వతీ సహితుడై పరమేశ్వరుడు వచ్చి విశ్వకర్మకృతమగు సువర్ణ మాలను కుమారస్వామికి స్వయముగా నలంకరించి ఆదరించెను. అగ్ని రుద్రస్వరూపుడే కనుక స్కందుడు (అగ్నిపుత్రుడు గనుక) రుద్రపుత్రుడుగానే భావించబడుచున్నాడు. రుద్రుని వీర్యము శ్వేత పర్వత రూపములో మారెను. దానియందు కృత్తికలు అగ్ని వీర్యమును తెచ్చిరి. రుద్రుడు అగ్నిలో ప్రవేశించి యీ శిశువును పుట్టించెను. అందువలన స్కందుడు రుద్రపుత్రుడే యగును. ధర్మరాజా! రుద్రస్వరూపుడైన అగ్ని, స్వాహాదేవి, మరి ఆరుగురు స్త్రీలు వీరందరు స్కందుని జన్మకు కారణము. అందుచేత స్కంద భగవానుడు రుద్రపుత్రుడగును."

స్వచ్ఛమగు రెండు రక్తవస్త్రములను ధరించి అత్యంత తేజస్సుతో విరాజిల్లుచున్న స్కందుడు రెండు రక్తమేఘముల మధ్యనున్న సూర్యుని వలె విరాజిల్లెను. అగ్నిదేవుడిచ్చిన కోడిపుంజు స్కందుని ధ్వజములో యెఱ్ఱగానున్న ప్రళయాగ్నివలె ప్రకాశించుచుండెను. సర్వ ప్రాణులయందు గల చేష్టలు, కాంతి, శాంతి బలము ఇవన్నియు కార్తికేయ కుమారుని యెదుట 'శక్తి' రూపము ధరించి నిలిచెను. ఆ శక్తియే దేవతల విజయలక్ష్మికి దోహదకారిగా నుండెను. అతని శరీరమునందు సహజమగు కవచము ప్రవేశించి యది యతడు యుద్ధము చేయుచున్నప్పుడెల్ల ప్రకటమై యుండును. రాజా! స్కందునితో పాటే అతనియందు స్వాభావికముగా "శక్తి—ధర్మము—బలము—తేజస్సు—కాంతి—సత్యము—ఉన్నతి—బ్రాహ్మణభక్తి—వివేకము—భక్తరక్షణము—శత్రుసంహార గుణము—సమస్త జగద్రక్షణ శక్తి" యివన్నియు పుట్టెను. ఈ యన్నిటితోను సంపూర్ణ చంద్ర మండలమువలె ప్రకాశించుచుండెను. దేవసేనాధిపత్యము నందు అభిషిక్తుడైన స్కందుని వేదఘోషములు, దేవతలవాద్య ఘోషములు, గంధర్వుల గీతధ్వనులు చుట్టుముట్టగా నతనిముందు అప్సరసలు నృత్యము చేసిరి. అప్పుడు చీకట్లను నశింపజేసి యుదయించిన సూర్యునివలె భాసిల్లుచున్న స్కందుని జూచి దేవతలు సంతసించిరి.

అప్పుడు దేవతా సేనలన్నియు నతనికడకు వచ్చి 'నీవే మాకందరకు పతివి' అని చెప్పిరి. అతడు వారినందరిని ఆదరించెను. అప్పుడు ఇంద్రుడు తాను విడిచిన 'దేవసేన'ను స్మరించెను. స్కందునితో 'ఈ కన్య నీవు పుట్టకముందే ఉదయించెను. అప్పుడే యీమె నీకు పత్నియగునని నిర్దేశించెను. కనుక నీవే పాణిగ్రహణము చేయుము' అని యింద్రుడు చెప్పగా స్కందుడామెను పెండ్లియాడెను. బృహస్పతి పురోహితుడుగా నుండి వివాహ కార్యము జరిపించెను. ఈ విధముగా దేవసేన స్కందునకు పత్నియయ్యెను. ఆమెకే 'షష్ఠి, లక్ష్మి, ఆశ, సుఖప్రద, సినీవాలి, కుహూ, సద్వృత్తి అపరాజిత' అను పేర్లుగూడ గలవు. అప్పటినుండియే స్కందుని శోభారూపురాలగు లక్ష్మి ఆశ్రయించెను. పంచమినాడు ఆమె అతని నాశ్రయించుటచేత 'శ్రీపంచమి' యనియు, అతడు షష్ఠినాడు కృతార్థుడగుటచేత షష్ఠికి 'మహాతిథి' 'స్కందషష్ఠి' యనియు పేర్లు వచ్చినవి.

## కృత్తికలు—గ్రహముల వివరణము

మార్కండేయ మహాముని ధర్మరాజునకు తరువాతి వృత్తాంతమిట్లు చెప్పదొడగెను:—

"ధర్మరాజా! దేవసేనాపతిగా పట్టాభిషిక్తుడై దేవసేనను వివాహమాడి సుఖముగానున్న స్కందుని కడకు సప్తర్షుల పత్నులలో నార్గురు (వసిష్ఠ పత్ని అరుంధతి తప్ప) వచ్చిరి. వారు పతివ్రతలైనప్పటికిని వారిని ఋషులు విడిచిపెట్టియుండిరి. వారు స్కందునితో "కుమారా! మమ్ము అకారణముగా మాపతులు విడుచుటచేత మేము పుణ్యలోకములకు దూరమైయున్నాము. నీవు మా గర్భమునుండ పుట్టితివని యెవరో అన్యాయముగా ననుటచేత ఈ దుర్గతి మాకు పట్టినది. ఎట్లైనను మమ్ము కాపాడుము. మాకు స్వర్గప్రాప్తి శాశ్వతముగా కలుగుగాక. ఇంతేకాక మేము నిన్ను పుత్రునిగా కూడ స్వీకరించెదము. కనుక మమ్ము ఉద్ధరించి ఋణమునుండి విముక్తుడవు కమ్ము." అని యనిరి. ఆ మాటకు స్కందుడు, 'మీరు నాకు తల్లులుగానే భావించెదను గనుక మీ యిష్టార్థము నెరవేరుగాక' అనెను. ఆ తరువాత ఇంద్రుడు నక్షత్రములను గూర్చి యిట్లు వివరింపదొడగెను:—

" రోహిణి చెల్లెలగు అభిజిత్తు అను దేవి రోహిణితో పోటీపడి తానే పెద్దది కావలెనను ఇచ్ఛతో తపస్సు చేయుటకు వనమునకు పోయెను. స్కందదేవా! ఆకాశమునుండి యీ విధముగా రాలిపోయిన 'అభిజిత్' నక్షత్రస్థానమును ఎట్లు పూరించవలెనను చింతలో నున్నాను. దయచేసి నీవు బ్రహ్మదేవుడు యోచించి ఈ నక్షత్ర పూర్తికి ఉపాయము చెప్పుడు. ఈ మాటలు వినగానే స్కందుని అభిప్రాయమును కనుగొని ఆర్గురు కృత్తికలు అభిజిత్ స్థానమును పూర్తిచేయుటకు ఆకాశములో నిలిచిపోయిరి. కృత్తికా నక్షత్రము అగ్నిదేవతా సంబంధమైనది. అది యేడు తలలతో ఆకాశమునందు ప్రకాశించుచున్నది.

తరువాత గరుడ జాతికి చెందిన అనతాదేవి స్కందునితో 'నాయనా' నీవు నాకు పిండదాతవగు పుత్రుడవుగా స్వీకరించితిని కనుక నేనెల్లప్పుడు నీతోనే వుండదలిచాను.' అనెను. ఆ మాటకు స్కందుడామెతో 'తల్లీ! అట్లేకానిమ్ము. నీవు నాయెడల పుత్రప్రేమతో కర్తవ్యమును నాకు ఆదేశించుచుండుము. నీ కోడలగు దేవసేన గూడ నిన్ను పూజించుచుండగలదు.' అని యనెను.

ఆ తరువాత సమస్త మాతృగణము వచ్చి స్కందునితో 'పుత్రా! మేము సమస్త లోకములకు తల్లులుగా విద్వాంసులు మమ్ము స్తుతించిరి. కనుక మేమిప్పుడు నీ తల్లులముగా కూడ కాదలచుచున్నాము. మాతృభావముతో మమ్ము పూజించుము' అనిరి. అప్పుడు మాతలకు స్కందునకు నిట్లు సంవాదము జరిగెను.

స్కందుడు:— తల్లులారా! నేను మీకు పుత్రుడను. ఏమియాజ్ఞ?

మాతలు:— పూర్వమునుండి లోకమాతలుగా ప్రసిద్ధులైయున్న 'బ్రాహ్మీ మహేశ్వరీ, మొదలగు మాతలు తమ స్థానములను వీడవలెను. వారి స్థానములో మమ్ము ప్రతిష్ఠింపజేయుము. నేటినుండి మేమే లోకములో పూజ్యస్థానము గలవారమయ్యెదము. వారు మాపైన అసత్యముగా అపవాదమును మోపి మా పతులనుండి దూరముచేసి మాకు సంతానోత్పత్తి లేకుండ జేసిరి. నీవు మమ్ము మా పతులకు అనుకూలపరచి తిరిగి మాకు సంతాన సుఖము కలుగునట్లు చేయుము.

స్కందుడు:— మాతలారా! ఆ ప్రజోత్పత్తికి కాలము మీకు దాటిపోయినది. ఇప్పుడు ఇతర సంతానము కలుగునట్లు చేసెదను.

మాతలు:— అట్లైనచో, ఆ లోకమాతల సంతానమును మాకు వశపరచుము. మేము వారిని తినెదము. ఆ సంతానమునకు తండ్రులగు వారిని గూడ మేము తినదలచినాము.

స్కందుడు:— మాతలారా! మీరు చాల దుఃఖకరమైన కోరికను కోరితిరి. అయినను మీకు ఆ మాతల సంతానమును అర్పించెదను. కాని వారిని మీరు రక్షించవలెను. ఆ సంతానము వలన మీకు మేలు కలుగును.

మాతలు:— నాయనా! నీ మాట ప్రకారమే ఆ సంతతిని మేము రక్షించెదము. మేము నీసన్నిధినే స్థిరనివాసమేర్పరచుకొని యుండెదము.

స్కందుడు:— మాతలారా! మానవ బాలకులు పదునారు వత్సరముల ప్రాయము గలవారగువరకు మీరు అట్టి రూపములో వారిని బాధించుచుండుడు. నేను మీకు వినాశము చెందని ఒక భయంకరుడగు పురుషుని ఇచ్చెదను. అతను నాకంటే వేరుకాడు. అతని పూజలనందుచు మీరు సుఖముగా నుండుడు.

వెంటనే స్కందుని శరీరమునుండి అగ్ని తేజస్సుతో నొక పురుషుడు వెలుగుచు బయలువెడలెను. అతడు సమస్త మానవ ప్రజలను భక్షింపగోరుచుండెను. అతడు కలి బాధతో భూమిపై పడి మూర్ఛిల్లెను. అప్పుడు స్కందునియాజ్ఞచే నతడు భయంకర గ్రహరూపము ధరించెను ఆ గ్రహము మానవులను పట్టినప్పుడు 'స్కందాపస్మారము' అని యందురు ఇదేవిధముగా అతి రౌద్ర రూపమును ధరించినట్టి వినతకు 'శకునిగ్రహము' అని పేరు. పూతన ఒక రాక్షసి. దానిని 'పూతనాగ్రహము' అని యందురు. అతి భయంకర రూపమును ధరించి ఆ రాక్షసి బాలకులను బాధించుచుండును. ఇదిగాక భయంకరాకారముగల యొక పిశాచి గ్రహముండును. దానిపేరు 'శీతపూతన' యని కలదు అది మనుష్య స్త్రీల గర్భస్థ శిశువులను ఘోరముగా హరించుచుండును అదితి దేవికి 'రేవతి' యనిపేరు. రేవతీగ్రహము 'రైవత' నామము గలదైయుండును. భయంకరమగు ఆ మహాగ్రహము గూడ పిల్లలకు చాల బాధకలిగించుచుండును. రాక్షసులతల్లియగు 'దితి'కి 'ముఖమండిక' యనిపేరు. ఆ గ్రహము శిశుమాంసముచేతనే తృప్తి చెందుచుండును. స్కందునినుండి పుట్టిన కుమారులు—కుమారికలు గూడ గర్భస్థ శిశువులను భుజించు మహాగ్రహములు. ఆ కుమారికలకు పతులే కుమారులు. వారు పుట్టని శిశువులనే హరించు భయంకరులు. గోమాతయగు సురభిపైన కూర్చొని 'శకుని'— అనగా 'వినత' గ్రహము ఇతర గ్రహములతో గలిసి శిశువులను భక్షించుచుండును. 'సరమా' అను శునకమాత (దేవజాతి శునకము) గూడ మానవస్త్రీల గర్భస్థ శిశువులను సర్వదా హరించుచుండును. వృక్షములమాత కానుగు చెట్టుపై నివసించుచుండును. ఆమె వరములనిచ్చునదిగా నుండి సౌమ్యముగా నుండును. ఎల్లప్పుడు సమస్త ప్రాణులను దయతో చూచుచుండును. కాబట్టి సంతానమునుగోరు మానవస్త్రీలు కానుగు (కరంజ) చెట్టుపైనుండు ఆ వృక్షమాతను పూజించుచుందురు.

పూర్వము చెప్పబడినవేకాక మరి పదునెనిమిది యితర గ్రహములుగూడ మధుమాంసములయందు ప్రేమగలవై పురిటింటిలో పది రాత్రులు సర్వదా నిలిచియుండును. 'కద్రూ' అనెడు సర్పమాత సూక్ష్మ శరీరమును ధరించి గర్భిణీస్త్రీ గర్భములో ప్రవేశించియుండి గర్భస్థ శిశువును భక్షించును. అందుచేత ఆ గర్భిణి సర్పమును కనును. గంధర్వమాత గర్భిణీస్త్రీ గర్భమును హరించుకొనిపోవును. దానివలన ఆ మానవ గర్భిణీస్త్రీ గర్భము

లీనమైయున్నట్లు కనిపించును. అప్సరసల మాతగూడ స్త్రీల గర్భమున పట్టుకొని యుండును అప్పుడా గర్భము నశించి పోయినదని అందురు. రక్తసముద్ర కన్యకు 'లోహితాయని' అని పేరు ఆమె స్కందుని 'దాది' యని అందురు. ఆమె కడిమి చెట్టుపై నివసించి యుండును గనుక స్త్రీలు కడిమిచెట్టుపైనున్న ఆ దేవిని పూజించుచుందురు.

పురుషులలో 'రుద్రభగవానుడు' శ్రేష్ఠుడైనట్లే స్త్రీలలో 'ఆర్యా' దేవి ఉత్తమురాలు. ఆ దేవి కుమారస్వామికి జనని యగును. కనుక ప్రజలు తమ యిష్టసిద్ధికై పైన జెప్పబడిన గ్రహములనేకాక ఈ ఆర్యాదేవినగూడ వేరుగా పూజించుచుందురు. ఈ విధముగా నేను కుమారస్వామికి సంబంధించిన గ్రహములను గూర్చి వివరించితిని. బాలబాలికలకు పదునారు వత్సరముల ప్రాయము వచ్చువరకు ఈ గ్రహములు వారికి అశుభమును కలిగించుచుండును ఈ చెప్పబడిన మాతృగ్రహములు, పురుష గ్రహములు 'స్కందగ్రహములు' అనబడును.

మనుష్యులను కష్టపెట్టు ఈ స్కందగ్రహములు తామసవృత్తిగలవై యుండును. ఇవి రుద్రభగవానుని భూత ప్రేత గణములువలె. కుమారస్వామి (స్కందుడు) శరీరము నుండి ఉత్పన్నములై తామస ప్రవృత్తిగల కుమారస్వామి సహచరులుగా భావింపబడుచున్నవి. ఈ గ్రహములనుండి రక్షింపబడుటకు సర్వదా పరమేశ్వరుని ఆరాధించుచుండవలెను. ఈ గ్రహములు భయంకరములైనప్పటికిని ఇవి కారణముగా భగవంతుడగు పరమేశ్వరుని మానవులు పూజించెదరను భావముతో ఈ గ్రహములను గూర్చి వివరించబడినది. భగవద్భక్తులను ఈ గ్రహములు స్పృశించవు. తమోగుణముగల మానవులపైననే యీ తామసగ్రహముల ప్రభావముండును. అట్టివారే ఈ గ్రహములను పూజించుచుందురు.

ఇవి శాంతించుటకు స్కందదేవుని పూజించి, యీ గ్రహములకు గూడ ధూపదీపాలతో పూజసలుపవలెను. పూజితులగు ఈ గ్రహములు శుభములు గలిగించును. ఆయుష్యమును బలమును ఇచ్చును. మానవులకు పదునారు వర్షముల వయస్సు తరువాత వచ్చు గ్రహముల పీడలను గూర్చి మార్కండేయముని పరమేశ్వరునకు నమస్కరించి ధర్మరాజునయుకిట్లు చెప్పదొడగెను :–

ఏ మనుష్యుడు మెలకువతో నున్నప్పుడుగాని లేక నిద్రించినప్పుడుగాని దేవతలను చూచి పిచ్చివాడగునో అట్టివానికి పట్టిన గ్రహము 'దేవగ్రహము' అనబడును. ఎవనికి కూర్చొని యుండగాను, లేక శయనించినప్పుడుగాని పితృదేవతలు కనపడి ఆ వెంటనే పిచ్చివాడగునో వానికి పట్టిన గ్రహము 'పితృగ్రహము' అనబడును. సిద్ధపురుషులను అవమానపరచినప్పుడు వారు క్రుద్ధులై శపించగా పిచ్చివాడై పోవువానికి పట్టిన గ్రహము పేరు 'సిద్ధగ్రహ' మని యందురు. వేరు వేరు సుగంధములను వాసన చూచికాని, లేక వివిధరుచులను ఆస్వాదించికాని పిచ్చివాడైన వానికి పట్టినగ్రహము 'రాక్షస గ్రహ' మనబడును. భూలోకములోని మనుష్యునిలో గంధర్వులు ప్రవేశించినప్పుడు అతడువెంటనే పిచ్చివాడగును. అట్టిగ్రహమునకు 'గంధర్వ' గ్రహమని పేరు. ఎవనియందు ప్రతిదినము పిశాచములు ఆవేశించుట వలన ఉన్మత్తుడగునో వానిని ఆవహించిన గ్రహము 'పిశాచ గ్రహ' మనబడును. ఇట్లే యక్షులు ఆవేశించినప్పుడు 'యక్షగ్రహ' మనబడును.

'వాత–పిత్త–శ్లేష్మ'ము లనబడు దోషత్రయ ప్రకోపము వలన చిత్తవిక్షేపము గలిగినప్పుడు వైద్యులచేత అతనికి చికిత్స చేయించవలెను. బెదరు–భయముల వలనను భయంకర వస్తువులను చూచుటవలనను పిచ్చి యేర్పడిన మనుష్యుని ఊరడించి దానిని శాంతింపజేయవలెను.

గ్రహములు పట్టిన వారు మూడు విధములుగా నుందురు కొందరు విపరీతంగా ఆటలాడుకొనవలెననియు, మరికొందరు భోజనము చేయవలెననియు, కొందరు విశేషముగా స్త్రీ కామోపభోగము చేయవలెననియు ఇచ్ఛ కలవారై యుందురు. ఇవి యన్నియు గ్రహపీడలే యగును. డెబ్బది సంవత్సరముల వయస్సు వచ్చువరకు పై గ్రహములు బాధించుచునే యుండును. ఆ తరువాత ఈ గ్రహములే గ్రహరూపములో వృద్ధులను బాధించుచుండును ఇంద్రియములను అన్ని దిక్కులనుండి బంధించి, జితేంద్రియులై, పవిత్రవర్తనముగలవారై, సర్వదా సోమరితనము లేకుండువారై, ఆస్తిక బుద్ధికలవారై శ్రద్ధతో వ్యవహరించు వారిని గ్రహములేమియు చేయజాలవు. అవి, వారికి దూరముగా నుండును. రాజా! ఈ ప్రకారముగా మనుష్యులకు ఏర్పడు గ్రహబాధలను గూర్చి వివరముగా నీకు చెప్పితిని. భగవంతుడగు పరమేశ్వరుని ఆరాధించు భక్తులను ఈ గ్రహములు బాధించజాలవు. అవి వారి దరిజేరవు" అని మార్కండేయ ముని ధర్మరాజునకుజెప్పి ఆ తరువాత స్కందుని కథ యిట్లు చెప్పదొడగెను:–

## స్కందుడు స్వాహాదేవిని సత్కరించుట

'స్కంధుడు మాతృగణములకందరికి ప్రియముచేసిన తరువాత స్వాహాదేవి స్కందునితో నాయనా! నీవు నాకు ఔరస (కడుపున బుట్టిన) పుత్రుడవు. కనుక నీవు నా యెడల జూపు ప్రీతి యెట్టిది? అని తెలియగోరుచున్నాను. నేను దక్ష ప్రజాపతి యొక్క ప్రియ పుత్రికను. నాపేరు 'స్వాహాదేవి'. నేను బాల్యమునుండియు అగ్నిదేవుని యెడల ప్రేమగలదాననై యుంటిని. కాని పుత్రా! నేనతనిని ప్రేమించుచున్నట్లతనికి తెలియకుండెను. నేనెల్లప్పుడును అగ్నిదేవునితోనే నిత్యనివాస మేర్పరచుకొని యుండగోరుచుంటిని" అని యనెను. ఆ మాటకు స్కందుడిట్లనెను:– "దేవీ! నేటినుండి ధర్మాత్ములగు మనుష్యులు దేవతలకు 'హవ్యములు' ఇచ్చునపుడును, పితృదేవతలకు 'కవ్యములు' ఇచ్చునపుడును ఆహవ్య–కవ్యద్రవ్యములు అగ్నిలో 'స్వాహా' అను శబ్దమును ఉచ్చరించి వేదమంత్రములద్వారా వేయుదురు. అనగా 'అగ్నయే స్వాహా' అని యందురు అందుచేత నీవెల్లప్పుడును అగ్నిదేవునితోనే నివసించియుందువు గాక" ఆమాటవిని స్వాహాదేవి మిక్కిలి సంతోషం చెంది పతియైన అగ్నితోచేరి

స్కందుని పూజించెను. ఆ తరువాత బ్రహ్మదేవుడు స్కందునితో నిట్లనెను:-

## రుద్రునితో స్కందుని భద్రవటయాత్ర

"వత్సా! నీతండ్రియగు పరమశివుని వద్దకుపొమ్ము. ఆ భగవానుడు అగ్నిలోను, పార్వతీదేవి స్వాహాదేవితోను ప్రవేశించి నీవంటి మహావీరుడగు పుత్రుని కనినారు. రుద్రదేవుడు పార్వతీదేవి గర్భమునందు విడిచిన వీర్యము ఐదు విధములుగా విభజింపబడినది. అందొక భాగమీపర్వతముపైనబడి దానినుండి 'మింజికా-మింజిక' యను దంద్వవ్యక్తులు ఉత్పన్నులైరి. కొంత వీర్యము రక్తసముద్రములో పడెను, మరికొంత సూర్యునికిరణములతో చేరెను, కొంత భూమిపైన పడెను, మరికొంత వృక్షములపైన బడెను. ఐదుగా విభక్తమైన ఆ వీర్యమునుండియే భిన్నభిన్నాకృతులుగల మాంసభక్షములు, భయంకరములునగు పార్షదులు పుట్టిరి. ఈ విషయము బుద్ధిమంతులకు మాత్రమే తెలియును." ఆ మాటలు విని కుమారస్వామి పితృభక్తిగలవాడై తండ్రియగు పరమేశ్వరుని పూజించెను. తరువాతి వృత్తాంతము మార్కండేయుడిట్లు చెప్పదొడగెను:-

"ధర్మరాజా! ధనార్థులైన పురుషులు, పైనజెప్పబడిన ఐదు 'స్కందగుణము'లకు జిల్లేడుపువ్వులతో పూజచేసినచో పుష్కలముగా ధనమును పొందెదరు. రోగనివృత్తికొరకు గూడ రోగులీగణములను పూజించవలెను. 'మింజికా-మింజిక' అను మిథునము రుద్రునివలననే ఉత్పన్నమైనది. బాలకుల హితముకొరకు తల్లిదండ్రులీ మిథునమునకు సర్వదా నమస్కారము చేయవలెను. వృక్షములపై బడిన రుద్రవీర్య భాగమునుండి 'వృద్ధికా' అను పేరుగల స్త్రీలు పుట్టిరి. వారు మనుష్యుల మాంసమును భక్షించెదరు. సంతానేచ్ఛగల స్త్రీలు ఈ దేవతలకు నమస్కారము చేయవలెను." 'రాజా! ఈ విధముగా నీకు పిశాచములను, గ్రహములనుగూర్చి చెప్పితిని. ఇప్పుడు స్కందుని గంటలు-పతాకనుగూర్చి చెప్పెదను వినుము' అని మార్కండేయుడిట్లు చెప్పదొడగెను:-

"ఇంద్రుని ఐరావతగజమునకు ఇరువైపుల వ్రేలాడ గట్టబడిన 'వైజయంతి' అను పేరుగల రెండు గంటలను ఇంద్రుడు స్కందునకు సమర్పించెను. అందులో నొక గంటను విశాఖుడు తీసుకొనెను. మరియొకటి స్కందుని కడనేయుండెను. కార్తికేయునకు-విశాఖునకు ఇరువురికిని రక్తవర్ణముగల పతాకలే ఉండెను. ఆసమయములో దేవతలు మహాసేనునకిచ్చిన ఆటవస్తులతోనే అతడు ఆడుకొనుచుండెను. ఆ పర్వత శిఖరముపైన పిశాచాది గ్రహములతో కూడుకొని స్కందుడు మహా శోభాయమానముగా విరాజిల్లుచుండెను. అప్పుడా పర్వతము సూర్యునితో విరాజిల్లుచున్న మందర పర్వతమువలె శోభిల్లుచుండెను. వివిధ పుష్ప ఫల వృక్షములతోను, మృగ సమూహముతోను, పక్షి గణములతోను ఆశ్వేత పర్వతము శోభిల్లుచుండెను. అచ్చట దేవ-దేవర్షి గణములు వివిధ ధ్వనులు చేయుచు నుల్లాసముగా నుండిరి. అప్సరసలు-గంధర్వులు నృత్యము చేయుచుండిరి. సర్వ ప్రాణిగణము హర్షముతో కోలాహల ధ్వనులు చేయుచుండెను. సమస్త ప్రపంచ జనులు శ్వేత పర్వతము పైనున్న యింద్ర సహితుడగు స్కందుని జూచి ఆనందించుచుండిరి.

స్కందుడు దేవసేనాపతిత్వమునందు పట్టాభిషిక్తుడైన తరువాత భగవంతుడగు పరమ శివుడు పార్వతీదేవితో భద్రవటమునకు పోవుటకు బయలుదేరెను. ఆ భగవానుడు సూర్య తేజస్సుతో విరాజిల్లు రథముపైన కూర్చొనియుండెను. ఆ రథమునకు వేయి సింహములు కట్టబడియుండెను. ఇంద్ర సహితులై సమస్త దేవతలు పరమ శివుని అనుసరించి పోవుచుండిరి. శివుని రథమునకు యముడు సారథిగా నుండి చురుకుగా సింహ వాహనములను తోలుచుండెను. అవి ఆకాశమునందెగురుచు ఆకాశము నంతటిని త్రాగుచున్నట్లుండి, సమస్త చరాచర జంతువులను భయపెట్టుచుపోవుచుండెను. ఇంద్ర ధనస్సుతో గూడిన మేఘము వలెనున్న రథము పైన మెఱపుతో గూడిన సూర్యుని వలె పార్వతీదేవితో భగవంతుడు కూర్చొని యుండెను. ఆరథమునకు ముందు కుబేరుడు యక్షులతో పుష్పక విమానముపై పోవుచుండెను. వెనుక వైపు ఇంద్రుడు దేవతలతో నైరావతముపై పోవుచుండెను. అన్ని వైపులందు మహాయక్షుడు యక్షగణముతోను, వసువులు, రుద్రులు యమలోకవాసులు, మత్యుదేవత, అనేకవ్యాధులు, శివుని త్రిశూలము, జలజంతువులతో పాటు వరుణ దేవుడు, శివుని అనేకాయుధములు, ఛత్రచామరాదులు, కమండలువు, దండము ఉండెను. ఈ యందరితో రుద్రుడు యాత్ర చేయుచుండెను. అందరు ఆ మహాదేవుని పూజించుచుండిరి.

దేవసేనాపతియగు స్కందుడు గూడ పరమశివుని వెనుక పార్శ్వమునందు పోవుచుండెను. అతనితో శివుడు 'నాయన' నీవు 'మారుతస్కంధమనెడు దేవతా వ్యూహమును సదా కాపాడుచుండు' మనెను. 'అట్లే' యని స్కందుడు చెప్పి 'ఇంకేదైన ఆజ్ఞయిండు' అని భగవంతునితో వేడెను. దానికి శివుడు 'పనిపడినప్పుడు నీవు నన్ను కలియుచుండుము. నాదర్శనము చేత నీకు శ్రేయస్సు కలుగును' అని చెప్పి అతనిని ఆలింగనము చేసుకొని పంపెను. స్కందుడు పోయిన వెంటనే గొప్ప ఉత్పాతము కలిగెను.

## దేవదానవుల యుద్ధము

"ఆకస్మాత్తుగా నక్షత్ర సహితమైన ఆకాశము మండుచు దేవతల నందరిని మోహపరచెను. అప్పుడు ప్రపంచమంతయు స్తంభించి పోయెను. భూమి కంపించెను. ప్రపంచము గగ్గోలుపడెను. అంతయు అంధకారబంధుర మయ్యెను. పరమేశ్వరుడు మొదలుకొని దేవతలు, మునులు అందరు అప్పుడు క్షోభిల్లిరి. అంతలో అనేకాయుధధారులై రాక్షస సైనికులు పర్వతపంక్తులవలెను మేఘపంక్తులవలెను భయంకరంగా గర్జించుచు వచ్చిపరమేశ్వరుని పైనను, దేవతలపైనను దాడిసల్పిరి, వారు విడిచిన బాణాద్యాయుధముల దెబ్బకు తట్టుకొనజాలక దేవతల పరుగెత్తి పోయిరి. పెద్ద కార్చిచ్చు అడవిని దగ్ధము చేసి శూన్యము చేసినట్లు దానవులు దేవతల సైన్యమును ఊడ్చి వేసెను. ఈ విధముగా జరిగిన ఘోరయుద్ధమునందు అనేక విధములుగా ఖండింపబడిన అవయవములు గలవారై దేవతలు తమకు రక్షకుడు లేక దిక్కులకు పారిపోయిరి. (సశేషం)

# తెలుగుదేశంలో సంఘ సంస్కరణ



చావలి రామమూర్తి

భారత దేశములో ఉద్భవించిన ప్రతి ఉద్యమముతోను, సంఘసంస్కరణ తోడను తెలుగు వారికి సన్నిహిత సంబంధము కలదు. రాజకీయ, సాంఘిక విప్లవములు తెలుగు దేశ చరిత్రలో కొల్లలుగా ఉన్నవి.

## బౌద్ధమతము

ఆదిని వైదిక మతములోని లోపాలను సరిదిద్దటానికి బుద్ధ భగవానుడవతరించి బౌద్ధమతమును స్థాపించి గొప్పవిప్లవ కారుడయ్యెను. బౌద్ధము మత సంస్కరణోద్యమము. యజ్ఞ యాగాదులు, వర్ణాశ్రమము మానవాభ్యుదయమునకు ఆటంకములని బుద్ధుని భావన. బౌద్ధానికి తెలుగు దేశములో గొప్ప ఆదరణ లభించినది ప్రభువులు, ప్రజలు ఆ మతాన్ని స్వీకరించారు. ఎందరో తెలుగువారు బంగాళాఖాతము మీదుగా ప్రయాణముచేసి, బౌద్ధ మతాన్ని ఆగ్నేయాసియా దేశాలలో ప్రచారము చేసారు. హీనయాన బౌద్ధమతానికి ప్రధానభాష్యకారుడుగా కొనియాడ బడుచున్న నాగార్జునుడు మన తెలుగువాడు.

## జైనమతము

ఇలాగే జైనమతానికి కూడ మన తెలుగు దేశములో గొప్ప ఆదరణ లభించినది. జైనముకూడ బౌద్ధములాగే హిందూమతాన్ని సంస్కరించటానికి ఉద్దేశింపబడినది.

## పల్నాటి యుద్ధము

వర్ణాశ్రమ వ్యవస్థ జాతిక్షీణతకు మూల మనియు. అమానుష మనియు, అనాగరికమనియు, అంటరాని తనమును అనుసరించుట పరమేశ్వరుని ప్రత్యక్షముగా పరాభవించుట అనియు నమ్మిన బ్రహ్మనాయుడు తన చాపకూడు (సహపంక్తి) ఉద్యమమును అమలు చేయుటకు నాయకురాలుతో యుద్ధము చేయవలసి వచ్చినది. 12 వ శతాబ్దమున గుంటూరు సీమలో జరిగిన ఈ యుద్ధమునకు కేవలము సంస్కరణ సిద్ధాంతములేకాని రాజకీయ సిద్ధాంతములు కారణముకావు.

## పాలకుల కృషి

తూర్పు చాళుక్యరాజులు, కళింగదేశపు చక్రవర్తులు, మన జాతిని తేజోవంతము చేయుటకు. సంఘవ్యవస్థలోని కరుడుగట్టిన తనాన్ని తీసివేయ కృషిచేసారు. "మన మతము కరుడు కట్టుకొని బిగవనిదగుట వలననే చరిత్రకాలమునాడు మన తెలుగువారు ఆగ్నేయాసియా దేశములకువెళ్ళి మన సంస్కృతి అక్కడ స్థాపించ కలిగి స్థానికులతో కలసిపోయి మనజాతికి విశేషమైన కీర్తి ప్రతిష్ఠలు తేగలిగిరి." అని కీ. శే. మల్లంపల్లి సోమశేఖర శర్మ గారు వ్రాసినారు.

## విజయనగర పతనానంతరము

విజయనగర సామ్రాజ్య పతనానంతరము తెలుగు దేశ చరిత్రలో అంధయుగమేర్పడి, మనలో వికాసభావములు వెనుకబడి కులభేదములు, వర్ణవ్యవస్థ కట్టుతప్పి వ్యాపించినవి. అంటరాని తనము పరుగులు వేసింది, మానవత్వము మంట కలిసింది.

## కందుకూరి ప్రొద్దుచుక్క

సంఘమును ఈ దురవస్థనుండి కాపాడుటకై నేపాళమున బుద్ధుడు, జూడియాలో ఏసుక్రీస్తు, అరేబియాలో మహమ్మదు జన్మించినట్లే క్రీ. శ. 1848 వ సంవత్సరములో ఆంధ్రదేశములో కందుకూరి వీరేశలింగము పంతులుగారు జన్మించిరి. వీరి ప్రతిభ బహుముఖమైనది. వీరి దేశభక్తి అపారమైనది. సంఘమునకు, సాహిత్యమునకు వీరి సేవలు అపారమైనవి. ప్రగతి శీలురు ప్రేమ మూర్తులు, కరుణార్ద్ర హృదయులు, దయామయులు అగు పంతులుగారు దైవాంశ సంభూతులు గాని వేరొక్కరు కానేరరు. భయమన్నది వారెరుగరు. బాల్యవివాహములు నిషేధించిరి, కులాంతర మతాంతర వివాహములు ప్రోత్సహించిరి. విధవా వివాహములు జరిపించిరి. అంటరానితనము ద్వేషించిరి. స్త్రీ విద్యను ప్రోత్సహించిరి. బ్రహ్మ సమాజ మతము స్వీకరించి ఏకేశ్వరోపాసన చేపట్టిరి

1906 వ సంవత్సరములో యజ్ఞోపవీతమును త్యజించి, అనుష్ఠానైక బ్రహ్మ మతస్థుల మైతిమనియు, ఆబ్దికములను బ్రహ్మ సమాజ మతాను సారముగానే జరుపుచుంటిమనియు, తమ స్వీయ చరిత్రలో వ్రాసుకొనిరి. రాజమహేంద్రవరమున వితంతు శరణాలయము స్థాపించిరి. స్త్రీలకొరకు పాఠశాలలు స్థాపించి, గ్రంథములు వ్రాసిరి. నాటి బ్రాహ్మణ సమాజమునగల అనాగరిక కృత్యములను పత్రికా ముఖమునను, గ్రంథ ముఖమునను నిరసించిరి. అగ్రవర్ణ, అధమవర్ణ భేదమును నిరసించి, మానవులందరూ ఒక్కటే అని గొంతెత్తి వాదించిరి.

## సరోజినీదేవి వివాహము

పంతులుగారు నాడు సాధించిన ఘన విజయములలో పేర్కొనవలసినది, గానకోకిలగా ప్రపంచఖ్యాతి నార్జించిన శ్రీమతి సరోజినీదేవి వివాహము. ఈమె హైదరాబాదు వాస్తవ్యుడు, వంగీయుడు, బ్రాహ్మణుడు అగు అఘోరనాథుడను నొక కళాశాల ఉపాధ్యాయుని అనుంగుబిడ్డ. అఘోరనాథుడు తీవ్ర బ్రహ్మ సమాజికుడు. వీరేశలింగమహోదయునికి మిత్రుడు. అఘోరనాథుడు పంతులుగారి సలహా ననుసరించి సరోజినీదేవికి ముత్యాల గోవిందరాజుల నాయుడు అను వరునితో 1898 సంవత్సరములో మద్రాసులో వివాహము జరిపించెను. ఈ వివాహమునకు వీరేశలింగము పంతులుగారు అగ్రాసనాధిపత్యము వహించి, మనస్ఫూర్తిగా నూతన దంపతులను అభినందించి ఆశీర్వదించిరి. ఆ ఆశీర్వచన మమోఘమై, ఆ దంపతులు పురాణ దంపతులై యితరులకు ఆదర్శప్రాయులైనారు.

## వెంకటరత్నం బ్రహ్మర్షి

వీరేశలింగము పంతులుగారికి ఆనాడు చేదోడు వాదోడుగా నుండి, సంఘ సంస్కరణ ఉద్యమమును ప్రోత్సహించినవారు. బ్రహ్మఋషి సార్థక బిరుదాంకితులైన రఘుపతి వేంకటరత్నము నాయుడుగారు. నాయుడుగారు బ్రహ్మసమాజకులైన పీడిత ప్రజాభ్యుదయమునకు జీవితము ధారపోసిన కారుణ్యమూర్తులు. బ్రహ్మచారులైన అచంచల దేశభక్తులు. వీరు కళాశాల అధ్యాపకులుగా, కళాశాల ప్రిన్సిపాల్‌గా, విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులుగా మచిలీపట్టణము, కాకినాడ, మద్రాసునగరములలో నివసించి వర్ణాంతర కులాంతర వివాహములకు విధవా వివాహములు జరిపించి. యెందరో సంస్కర్తలను తయారుచేసి, మహర్షి సార్థక నామధేయులైరి.

## పిఠాపురము

నాటి పిఠికాపురాధీశ్వరులైన శ్రీరావు సూర్యారావు బహద్దురు వారున్ను బ్రహ్మసమాజకులై గొప్ప సంఘసంస్కర్తగా కీర్తిని గాంచిరి. వీరేశలింగము, వేంకటరత్నములకు కుడిభుజముగా ఉంటూ ఆర్థిక సహాయముచేస్తూ ఉండేవారు. నాటి పిఠాపురము, సంఘసంస్కరణకు, సాహిత్య సేవకు పెట్టనికోట.

## గురజాడ-కన్యాశుల్కము

మహాకవి గురజాడ అప్పారావుగారు గాంధీమహాత్మునికి చాలకాలము క్రిందటనే మానవతావాదులై అస్పృశ్యతను ఆక్షేపిస్తూ వ్రాసిన పంక్తులు తెలుగుజాతికి అభ్యుదయము పట్లకల అభిమానమును వేనోళ్ల వ్యక్తపరచు ముత్యపు చినుకులు.

"మలినదేహుల మాలలనుచును
మలిన చిత్తుల కధిక కులముల
నెల వొసంగిన వర్ణధర్మమ ధర్మధర్మంబే"

అప్పారావుగారు జాతులన్నీ ఒకటే అనుచు మతములన్నీ సమానమే అని ప్రతిపాదించుచు,

"చెట్టపట్టాల్ పట్టుకొని దే
శస్థులంతా నడవవలెనోయి
అన్నదమ్ములవలెను జాతులు
మతములన్నీ మెలగవలెనోయి"

"మతం వేరైతేను మోయి
మనసులొకటై మనుషులుంటే
జాతియన్నది లేచిపెరిగి
లోకమున రాణించునోయి"

అప్పారావుగారిలో ఉన్న సంఘ సంస్కరణాభిలాషకు, మాలిన్య నిర్మూలనాశయమునకు, వారి కన్యాశుల్కమే సాక్షి. ఈ నాటకము ద్వారా బాల్యవివాహములను, వ్యభిచారమును, కన్యావిక్రయమును నిరసించిరి. విధవా వివాహము సంఘ శ్రేయస్కరమనియు నైతికమనియు నిరూపించిరి.

## చిలకమర్తి

కీ. శే. చిలకమర్తి లక్ష్మీనరసింహ కవిగారు సంస్కరణాభిలాషులుగాని పండితులను నిరసించుచు "గతాను గతికో లోకోన లోకః పరిమార్థికః" అనులోకోక్తివలె ప్రవర్తించుచున్నారు. అని నిరసించిరి.

కవిగారికి నిమ్నజాతి ఉద్ధరణ యందుగల అభిమానము అసామాన్యమైనది. తమ స్వీయచరిత్రలో వీరినిగూర్చి "వీరి అవస్థ పశువుల అవస్థకన్న దీనముగా ఉన్నది.........దీని కుత్తర వాదులెవరన్న నగ్రజాతులమని విఱ్ఱవీగుచున్న బ్రహ్మ. క్షత్రియ. వైశ్య. శూద్రులే. ఈ వర్ణములవారు పంచములు మొదలైన నిమ్న జాతులచేత తమకు కావలసిన సేవలన్నియు చేయించుకొని, వారిని యిండ్లకు రానీయక, దరికి చేరనీయక, యంటరాని వారనియు, చెప్పరానివారనియు, వారికసహ్యములైన పేర్లుపెట్టి హీనముగా జూచుచున్నారు పశువులు మనయింట నుండవచ్చును, కుక్కలుండవచ్చును. కాని పంచములు మట్టుకు మన గృహావరణలోనికి రాకూడదు. వారు మన పశువులను మేపవచ్చును. కాని మనము నోరువిచ్చి వారితో మాటలనైన నాడజాలము. వారు భగవంతునిచే సృష్టించబడిన మనుషులే యనియు, నగ్రవర్ణముల వారి కున్నట్లే వారికికూడ క్షుత్పిపాసలు, సుఖదుఃఖములు గలవనియు మనవారు తలంపరు. తలంచిన పక్షమున వారి నారీతిగా నుంతురా?" అని అంటరానితనమును నిరసించెను.

కేవలము మాటలతోనేకాక కవిగారు చేతలలో తమ అభిమానమును అభిలాషను ధ్రువపరచిరి. 1909వ సంవత్సరమున పంచములకొరకు రామమోహన్ పాఠశాలను, వారిస్వంత ధనముతోను, పిఠాపురం రాజా యిత్యాదుల సహాయముతోను, స్థాపించి విద్యార్థులకు వేతనములు విధించక, వారికి పుస్తకములుకూడ ఉచితముగనిచ్చి, పదమూడు సంవత్సరములు నడిపించిరి. ప్రత్యేకించి నిమ్న జాతులకొరకు ఆంధ్రదేశమున రాజమహేంద్రనగరమున వెలసిన మొదటి పాఠశాల యిదియే.

కవిగారు బ్రాహ్మణ, అబ్రాహ్మణ సిద్ధాంతములు అభ్యుదయ నిరోధకములనియు, ఒకే కుటుంబములోని వారు తలా ఒక పనికి బూనినట్లే వ్యక్తిచేయు పనినిబట్టి వర్ణములు కులములు యేర్పడినవని చెప్పుచు. "శ్రీరాముడెవరు? బ్రహ్మణేతరుడు గాడా? వారలను భగవంతుడని అన్నివర్ణములవారును పూజించుటలేదా? పన్నిద్దరాళ్వార్లలో బెక్కండ్రు బ్రహ్మణేతరులులేరా? వారిని దేవతార్చన పెట్టెలో నుంచుకొని పూజించుట లేదా? భారతము భారతీయ బ్రాహ్మణేతరులైన పాండవుల చరిత్రమేగదా? దానికి పంచమ వేదమని పేరుపెట్టి దానిని బ్రాహ్మణులు పారాయణము చేయుట లేదా? విశ్వామిత్రుడు బ్రాహ్మణేతరుడు గాడా? మహాపవిత్రమైన గాయత్రీమంత్రము నతడుకదా నిర్మించినది. వేదవ్యాసుడెవడు? పల్లెదాని కొడుకు. అతడే పంచమవేద రచయిత. అతడే నాలుగు వేదములు విభజించెను. అతడే పదునెనిమిది పురాణములు రచించెను. అతడే బ్రహ్మజ్ఞానగర్భితములైన బ్రహ్మసూత్రములు రచించెను. వాటినన్నిటిని బ్రాహ్మణాదులు శిరసావహించుట లేదా? బ్రాహ్మణేతరులెవ్వరు? బ్రాహ్మణులెవ్వరు? అని కవిగారు ప్రశ్నించి, విమర్శించి వీరేశలింగము గారి మార్గము ననుసరించి అనుష్ఠాన బ్రహ్మసమాజికులైరి.

స్త్రీలకు విద్య లేకపోవుటను కవిగారు గర్హించి, స్త్రీ విద్య కొరకు విశేషమైన కృషిచేసిరి. స్త్రీల శక్తిసామర్థ్యములను కొనియాడుచు.

చదువన్నేర్తురు పూరుషుల్ బలెనె
  శాస్త్రంబుల్ పఠింపించుచో
నదుమన్నేర్తురు శత్రుసేనల
  ధనుర్వ్యాపారముల్ నేర్పుచో
నుదితోత్సాహముతోడ నేలగలరీ
  యుర్విన్ బ్రతిష్ఠించుచో
ముదితల్ నేర్వగ రాని విద్యగలదే
  ముద్దార నేర్పించినన్,

అనిన కవిగారి పలుకులు యెంతయో యదార్థము.

## ఆంధ్రకేసరి

కవిగారికి సన్నిహిత మిత్రులు, వీరేశలింగముగారి యెడల గురుభావము కలవారు నగు కీ.శే. టంగుటూరి ప్రకాశము పంతులు గారు గొప్ప సంస్కార ప్రియులు, ఆంధ్రకేసరి రాజకీయముగా అతివాది. సంస్కారిగా విప్లవవాది.

తమ స్వీయ చరిత్రలో తనకు బాల వితంతువైన చెల్లెలుండెననియు, ఆమెకు పునర్వివాహమును గూర్చి వీరేశలింగము గారితో ఆలోచించుచుండగా మృత్యువాత పడెననియు వ్రాసుకొనిరి.

అతివాదులైన ఆంధ్రకేసరి రాజకీయముగా అతివాద నాయకుడైన బాలగంగాధర తిలక్‌కు సన్నిహితులైరి. తిలక్ సిద్ధాంతములను. సంపూర్ణముగా సమర్థించిరి. సూరత్ కాంగ్రెస్‌లో తిలక్ పక్షము వహించిరి.

అయినను సంస్కరణ రంగమందు మాత్రము తిలక్ మహాశయుడు, వీరేశలింగము పంతులుగారంతటి ఆదర్శమూర్తి కారని విశ్వసించినారు.

## దేవులపల్లి కృష్ణశాస్త్రి

సుప్రసిద్ధ భావకవులగు శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు సాహిత్య క్షేత్రమున ఎంతటి పురోగాములో సంస్కరణ రంగమున అంతకు మించిన విప్లవ వాదులు. రఘుపతి వేంకటరత్నము నాయుడు గారికి సన్నిహితులు. కవిగారికి బాల్యమునుండియు హరిజనోద్ధరణ యందు మిక్కుటమైన అభిమానము. 1918 సంవత్సర ప్రాంతముననే తమ స్వస్థలమైన పిఠాపురము నందు హరిజనులకు వసతులను ఏర్పర్చియు, వారి సహపంక్తిని భోజన మాచరించుచు అంటరాని తనమును దీక్షతో నిర్మూలింప నుద్యుక్తులైనారు.

శాస్త్రిగారికి బొజ్జా అప్పలస్వామి గారను హరిజను డొక్కరు మిత్రులైరి. వారి తోడ్పాటుతో శాస్త్రిగారు అనేక మంది హరిజనులను ఉద్ధరించి ప్రజ్ఞావంతులను చేసెను. హరిజన సేవ కొరకు దీనజనోద్ధరణ కొరకు కవిగారు పడని పాటులేదు. అప్పల స్వామిగారు తమ కృతజ్ఞతను వెల్లడించుటకు తమ తనయులలో నొక్కరికి 'కృష్ణశాస్త్రి' అని శాస్త్రిగారి నామమిడెను.

కవిగారి విప్లవ భావాలు తెలుసుకోవడానికి వారి రచనలే సాక్ష్యము. ధర్మము, నైతికము, సాత్వికము కాని మతంవలదని పలుకుచు ;

నారాయణ! నారాయణ!
అల్లా ; అల్లా :
వా పాలిటి తండ్రీ, నీ పిల్లల మే మెల్ల;
మతమన్నది నా కంటికి మసకై తే
మతమన్నది నీ మనసుకు మబ్బై తే
మతంవద్దు. గితంవద్దు,
మాయామర్మం వద్దు—నారాయణ! నారాయణ!
ద్వేషాలు రోషాలు తెచ్చేదే మత మైతే
దాహాలు దుఃఖాలు కలిగించేదే గత మైతే
మతంవద్దు, గితంవద్దు.
మారణ హోమమువద్దు నారాయణ నారాయణ.

గాంధీజీ అడుగుజాడలలో వెళ్ళ నుద్దేశించినకవి, విశ్వ మానవ సౌభ్రాతృత్వాన్ని కాంక్షిస్తూ.

మతమన్నది గాంధీ జీవితమైతే
మతమన్నది లోకానికి హితమైతే
హిందువులం ముస్లిములం
హిందువులం క్రైస్తవులం
అందరమూ సోదరులం
అందరము మానవులం నారాయణ; నారాయణ;

## యజ్ఞేశ్వర చింతామణి

ప్రసిద్ధ పత్రికా రచయిత, ఆంగ్ల భాషాకోవిదులు. లిబరల్ పార్టీ నాయకులు, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రమున స్థిరపడిన ప్రవాసాంధ్రులు అయిన, కీ.శే సర్ చిత్తూరి యజ్ఞేశ్వర చింతామణిగారు. గొప్ప సంస్కర్తలు వీరేశలింగము, వేంకటరత్నము గార్లకు సన్నిహిత మిత్రుడు.

వీరు స్వయముగా వితంతు వివాహము కావించుకొనిరి. వీరి సంతానమంతయు సంస్కార భావములు కలవారై ఉన్నారు.

## కాశేశ్వరరావు

కీ. శే అయ్యదేవర కాళేశ్వరరావు పంతులు తాము బ్రహ్మ సమాజమత సిద్ధాంతములకు లోనై యజ్ఞోపవీతమును విసర్జించి నట్లు తమ స్వీయచరిత్రలో వ్రాసుకొన్నారు. పంతులు గారి చలువ వలననే అనేక మంది హరిజనులు విద్యావంతులు కాగలిగిరి. అందు పేర్కొనవలసిన వారు కీ. శే వేముల కూర్మయ్యగారు. కూర్మయ్యగారు గాంధేయవాది అయిన హరిజనుడు గొప్ప దేశభక్తుడు. స్వాతంత్ర్య సమరమున పాల్గొని పలుమార్లుజైలు శిక్షననుభవించెను. ఉమ్మడి మద్రాసు రాష్ట్రమున ప్రకాశంగారి మంత్రి మండలిలో సభ్యుడుగా కూడ వ్యవహరించెను. కూర్మయ్యగారి అభివృద్ధికి కాశేశ్వరరావు గారే కారకులు. కూర్మయ్యగారు, కాశేశ్వరరావు గారి యింట ఒకరుగా నుండి పెరిగినారు. అంతేకాక కాశేశ్వర రావుగారు అనేకమందికి పునర్వివాహములు చేయించిన సంస్కర్త.

## ఉన్నవ దంపతులు

కీ. శే ఉన్నవ లక్ష్మీనారాయణగారు సంస్కరణ పట్ల చూపిన శ్రద్ధ అమోఘమైనది. వారు, వారిభార్య ఉన్నవలక్ష్మీ బాయమ్మ, గుంటూరు మండలమున స్వాతంత్ర్యసమరములో పాల్గొని విశేషమైన సేవ చేసిరి. అనేకమంది అనాథ బాలికలకు తమఆశ్రమములో స్థానమొసంగిరి. లక్ష్మీబాయమ్మగారు తొలుత వితంతువై తరువాత లక్ష్మీనారాయణగారిని వివాహమాడెను. స్త్రీ పునర్వివాహములు కావించియు, స్త్రీలకు విద్యగరపియు కులాంతర వివాహములు చేయించియు హరిజనుల కొరకు అనేక వసతు లేర్పర్చియు నీదంపతులు ఘనమైన సేవచేసిరి.

లక్ష్మీనారాయణగారు వ్రాసిన మాలపల్లి ఒక గొప్ప విప్లవ శక్తులతో కూడిన సాంఘికనవల.

## కొండా వేంకటప్పయ్య

వేంకటప్పయ్యగారు గాంధీమహాత్ముని కన్న వయస్సున పెద్దవారు. మహాత్మునికి బహుసన్నిహితులు. మహాత్ముని ప్రేరణ వలన హరిజనోద్ధరణకు పూనుకొనెను. కొన్ని గ్రామములలో జరిగిన విందులకు హరిజనులను ఆహ్వానించని కారణమున వేంకటప్పయ్య పంతులుగారు ఆ విందులలో పాల్గొనలేదట.

## డా. ముత్తులక్ష్మి రెడ్డి

ఉమ్మడి మద్రాసు రాష్ట్రమున శాసనసభ్యురాలుగానున్న డా. ముత్తులక్ష్మి రెడ్డి గొప్ప సంఘసేవకురాలు. స్త్రీజనోద్ధరణకు, దీన జనరక్షణకు ఆమె అనేక విధముల కృషిసలిపినది.

స్త్రీల వివాహ వయఃపరిమితి గూర్చియు, హరిజన దేవాలయ ప్రవేశమును గూర్చియు, వేశ్యావృత్తిని నిషేధించుటను గూర్చియు, బహుభార్యాత్వ నిషేధమును గూర్చియు యామెశాసన సభ్యురాలుగా బహుకృషి సలిపినది. పతిత స్త్రీలకొరకు వసతులు; విద్యాసంస్థలు స్థాపించిన ఉత్తమురాలు.

## త్రిపురనేని రామస్వామి, గుడిపాటి వేంకటాచలం

సూతపురాణ గ్రంథకర్తలగు త్రిపురనేని రామస్వామి చౌదరిగారున్ను కులమతభేదములను నిరసించి, గొప్ప సంస్కర్తలుగా కీర్తిగాంచిరి. గుడిపాటి వేంకటాచలంగారున్ను వీరి కోవకు చెందినవారే. గొప్ప. విప్లవరచయిత.

## ఆచంట లక్ష్మీపతి దంపతులు

ప్రసిద్ధ ప్రకృతి వైద్యులగు ఆచంట లక్ష్మీపతిగారు గొప్ప సంఘ సంస్కర్త. వారి సతి రుక్మిణమ్మగారు, తొలుత వితంతువై తరువాత లక్ష్మీపతిగారిని వివాహమాడెను. అంతేకాక రాజకీయ

ములలోను పాల్గొని, జైలులోబడి పతితల రక్షణకొరకు బహు విధ ముల కృషిచేసి, ఉమ్మడి మద్రాసురాష్ట్రమున మంత్రి అయ్యెను.

## దుర్గాబాయమ్మ

గుమ్మిడిదల దుర్గాబాయమ్మగారు భారతస్వాతంత్ర్య సమరమున పాల్గొని, స్వయంకృషి వలన గొప్ప విద్యావేత్త అయి స్త్రీ జనోద్ధరణ కొరకు మద్రాసు, హైదరాబాదు నగరములలో అనేక సాంఘిక సంక్షేమ సంస్థలు విద్యాలయములు స్థాపించిన మహిళామణి దుర్గాబాయమ్మగారు తొలుత వితంతులై 1953 వ సంవత్సరమున డాక్టరు సి.డి దేశముఖ్‌గారిని వివాహమాడి, దుర్గాబాయి దేశముఖ్‌గా దేశమునకు అనేక విధముల సేవ చేయుచున్నారు.

## దరిశిచంచయ్య

నెల్లూరుజిల్లా వాస్తవ్యులైన దర్శి చంచయ్యగారు గొప్ప సంస్కారి. వీరు. వీరి ప్రథమ ద్వితీయ భార్యారత్నములగు అన్నపూర్ణ, సుభద్రమ్మలు, స్త్రీ పునర్వివాహము కొరకు విశేషమైన కృషిజరిపిరి. వీరు గొప్పదేశభక్తులై స్వాతంత్ర్య సమరమున పాల్గొనిరి. వీరి గృహమే ఒక పవిత్రమందిరమై అనేకమంది అనాథ బాలలు రక్షింపబడుచుండిరి. హరిజనోద్ధరణ కొరకు వీరు విశేషమైనకృషి సలిపిరి.

## తల్లాప్రగడ నరసింహశర్మ

తల్లాప్రగడ నరసింహ శర్మగారు తొలుత వీరేశలింగము గారి శిష్యులై బ్రహ్మసమాజమతము స్వీకరించి నేటికిన్ని రాజ మహేంద్రి వరమును, వీరేశలింగము గారి కృషిని నడిపించు చున్నారు. శర్మగారు స్వాతంత్ర్యసమరములో పాల్గొని. హరిజ నోద్ధరణకు గొప్పసేవ జరిపిరి. మహాత్ముని అడుగు జాడలలో జీవితము గడుపుచున్న కొద్దిమందిలోను శర్మగారొకరు.

## ధర్మతేజ తల్లితండ్రులు

జియంతి షిప్పింగు కార్పొరేషను వ్యవస్థాపకులగు డాక్టరు జయంతి ధర్మతేజ గారి తల్లి తండ్రులగు జయంతి నారాయణగారు. సూరమ్మగారు గొప్ప సంస్కర్తలు. బ్రహ్మసమాజ మతస్థులు. సంఘ సేవ చేయుటకు తద్వారా దేశసేవ చేయుటకు నారాయణగారు ఉన్నతమైన మేజిస్ట్రేటు ఉద్యోగమునకు రాజీనామానిచ్చెను.

## ఎందరో మహానుభావులు

వీరేకాక యెందరెందరోమహనీయులు సంఘ సంస్కర్తలై ఛాందస విధానములను నిరసించి, ప్రగతి పథమున కృషీవలురైరి. సుప్రసిద్ధ కవిరేణ్యులైన కీ.శే. వేటూరి ప్రభాకర శాస్త్రిగారు గొప్ప సంస్కర్తలు. హరిజనోద్ధారకులు. మాగంటి బాపినీడు, చక్రయ్య. ప్రభాకర్‌జీ, పొట్టి శ్రీరాములు వంటి సర్వోదయ నాయకులు, గాంధీ శకమున గొప్ప గాంధేయవాదులుగా రాజకీయ సమరము పాల్గొనిన, పట్టాభి, బులుసు సాంబమూర్తి, కాశీనాథుని నాగేశ్వరరావు, స్వామి సీతారాం యిత్యాదులందరు స్వాతంత్ర్య సమరముతోపాటు సంస్కార సమరమును జరిపిరి.

## వేమూరి రాంజీరావు

ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ మాజీమంత్రి శ్రీతానేటి వీర రాఘవులుగారును హరిజనులు బందరు వాస్తవ్యులైన వేమూరిరాంజీ పంతులుగారి ఆదర అభిమానముల వలన విద్యార్జనచేసి ఉన్నతమగు దేశభక్తుడుగా రూపొంది, రాజకీయ రంగమున గౌరవ స్థానము సంపాదించెను, ఇట్లే అనేకులు మట్టిలోని మాణిక్యములను వెతికి తీసిరి

## ఆంధ్ర రత్న–నవబ్రాహ్మణమతము

ఆంధ్రరత్న బిరుదాంకితులైన కీ.శే.దుగ్గిరాల గోపాల కృష్ణయ్యగారు గొప్ప దేశభక్తులు. వారు ప్రాచీనతా పక్ష పాతము కలిగి అభ్యుదయ నిరోధకులగు అనేక మంది మత పెద్దలతో అంట రాని తనమును గూర్చి వాదించి, అంటరాని తనము శాస్త్ర విరుద్ధమని, అమానుషమని, స్వార్థపరుల ఘాతుకచర్య అని నిరూ పించ కలిగెను. గోపాలకృష్ణయ్యగారు విశ్వబ్రాహ్మణ మతము (Universal Brahmanism) స్థాపించవలెనని ఎన్నియో కలలు కనెను ఆ మతముయొక్క సారాంశములోని విషయ ములను ఆంధ్రరత్న జీవిత చరిత్ర (రచన కనక్ ప్రవాసి. వేంకట రామా ప్రచురణలు) నుండి కొన్ని –నిచ్చట యథాతథముగా పేర్కొనుచున్నాను.

"తిరుచునాపల్లి జైలులో నుండగా గోపాలకృష్ణకు ఒక క్రొత్త ఆలోచన వచ్చెను." రాజకీయ స్వాతంత్ర్యము కంటె ముందుగా సాంఘిక సమైక్యమును సాధింపవలసి యున్నది. దానికై ఒక నూతన సిద్ధాంతమును (మతమును) రూపొందింపవలెను." "1922 అక్టోబరు 2వ తేదీన తిరుచునాపల్లి జైలు నుండి నూతన తేజో వికాసములతో, పెరిగిన గడ్డముతో ఒక క్రొత్త వ్యక్తిగా గోపాలకృష్ణయ్య విడుదలయి వచ్చి తన నూతన మత సిద్ధాంత మును మద్రాసు, మచిలీపట్నము, ఆలమూరు. తదితర సభలలో వినిపించెను. అదియే అతడు స్థాపించదలచిన నూతన బ్రాహ్మణ మతము"

"తన మతముతో గోపాలకృష్ణయ్య భారత దేశమునందలి బ్రాహ్మణే తరులనే గాక, భారతీయేతరులను కూడ బ్రాహ్మణులను జేయ సంకల్పించెను. "బ్రాహ్మణుడనగా బ్రహ్మతత్వము పొందినవాడు. బ్రహ్మాన్వేషకుడు బ్రాహ్మణుడు. భారత దేశములో బ్రహ్మ (దైవము) అందరులకు లక్ష్యము. అందుచే అందరును బ్రాహ్మణులే. విదేశీయులు మన మతమును బ్రాహ్మణ మత మనియు, మన సంస్కృతిని బ్రాహ్మణ సంస్కృతి యని యనుట వాడుక. బ్రాహ్మణ మతము బ్రాహ్మణులది–అనగా బ్రహ్మను పూజించు వారిది, భారతీయులది, ప్రపంచములో అందరిది."

"బ్రాహ్మణులనబడువారు తమ పద్ధతులను, ఆచారవిధానములను, విధులను విడనాడుచు వచ్చిరి, సంఘములో వారి పవిత్రతకు కళంకము వచ్చెను. పురుషులు స్వార్థపరులుగను, స్త్రీలు అజ్ఞానులుగను మారుటచే బౌద్ధమతము తిరుగుబాటు బయలుదేరెను. అర్థములేని కర్మ కాండలతో మూర్ఖమగు ఆచారవ్యవహారములు పెరిగెను. చండాలురుపై నిరంకుశముగా ప్రవర్తించుటతో దీనిని సరి చేయుటకు 2500 సంవత్సరములకు పూర్వము గౌతమ బుద్ధుడు అవతరించెను."

కులమత శాఖా భేదములు లేక సర్వమతముల వారిని దైవ ప్రథాములో ముంచి ప్రపంచమంతను బ్రాహ్మణము చేయుట ఈ నవీన బ్రాహ్మణ మతా దర్శము.

"ఆధునికావసరముల కనుగుణముగా హిందూ సంఘమును సంస్కరించుటకు ఒక నూతన స్మృతిని రచింపదలచితిని......
......ఇక పెక్కు కులములు, శాఖలు, అంటరానివారు అంట తగిన వారుందరనియు, ఒకే బ్రాహ్మణ కులము ఉండుననియు...
......చాటెను.

"......సర్వసమత్వ సిద్ధాంతముద్వారా అందరను బ్రాహ్మణులను చేయవలసి యున్నది. గాయత్రిమంత్రము యొక్క పరమ రహస్యము నెరిగినవాడే నిజమగు బ్రాహ్మణుడు, క్షత్రియ, వైశ్య, శూద్ర, చండాలు రెవరైనను గాయత్రీ మంత్రోపదేశమును పొందినచో నిర్మల మనస్కులు, నిశ్చలాత్ములగుదురు ॥

"ఆ బ్రాహ్మణఋషి విశ్వామిత్రుడు తన ఆధ్యాత్మిక శక్తిచే బ్రాహ్మణుడైనాడు. అదే విధముగా శ్రీకృష్ణుడుకూడ. కులముతో నిమిత్తము లేకుండా బుద్ధుడు నిర్వాణ మార్గము నందరకు బోధించెను. హిందూసమాజమును మంచి పునాదులపై పునర్నిర్మించుటకు శ్రీ శంకరాచార్యులుకాని, రామానుజాచార్యులుగాని, ప్రారంభించిన కృషి పూర్తికాక అసంపూర్ణముగా నుండిపోయెను. సాంఘిక సమైక్యమను గొప్ప ఆదర్శమును పరిపూర్ణము చేయుటకు గాంధీజీ సంకల్పించెను. అంటరాని తనమును తొలగించుట, సత్యమును, అహింసను పాటించుట—ఆయన ప్రధాన సూత్రములు. ఇవియే భారతదేశములో 'నూతన బ్రాహ్మణోద్యమమునకు ప్రాణప్రదములు. కులమునుబట్టి కాక అన్ని వృత్తులు అందరు చేపట్టవలెను వృత్తి సాంకర్యము ముఖ్యముగా జరుగవలసి యున్నది."........

ఈ విధముగా గోపాలకృష్ణయ్య గొప్ప సంస్కారమును చేయదలచినను, అకాలమరణము పొందుటవలన ఆయన ఆశయము నెరవేర లేదు.

## కాశేశ్వరరావు ఆక్టు

"The Madras Hindu (Bigomy Prevention and Divorce] Act, 1949 Madras Act-(VI of 1949) అనే చట్టానికి మనవాళ్లు కాశేశ్వరావు ఆక్టు అంటారు. దీనికి కారణం కీ శే. అయ్యదేవర కాశేశ్వరరావు గారు ఉమ్మడి మద్రాసురాష్ట్ర శాసనసభలో సభ్యుడుగా ఆక్టు యొక్క బిల్లు తయారుచేసి సభవారి అమోదము కొరకు ప్రవేశపెట్టుట. ఈ బిల్లుయొక్క ఉద్దేశ్యము, బహు భార్యత్వమును హిందువులలో నశింపచేసి, స్త్రీలకు విడాకులనిచ్చు సౌకర్యము కలిగించుట. ఈ బిల్లు ప్రాచీనస్మృతి శ్రుతులలోని సాంప్రదాయాలను చీల్చి సంస్కార ప్రేరితమై, ఆధునిక కాలమున కనుగుణమైనదై ఒప్పారినది.

## గోరా

సంస్కర్తలందరిలోకి భారతదేశము మొత్తము పైననే మహనీయుడు అనదగినవారు మనతెలుగు దేశములో అవతరించి వర్తమాన కాలమున మన మధ్యనున్నారు. రాజకీయ మేధావులెందరో ఉపన్యాసాలు యివ్వటమేకాని తమవరకు వస్తే తమ మతాభిమానాన్ని కులాభిమానాన్ని చంపుకోలేక పోవుచున్నారు. వీరందరికి అతీతుడు 'గోరా'! నిజమైన సంస్కారి అయి మాటలతో కాక చేతలతో చేయవలసిన పనిని చూపించారు.

వారి పూర్తి పేరు శ్రీ గోపరాజు రామచంద్రరావు. సంపన్న బ్రాహ్మణ కుటుంబమున జన్మించి ప్రకృతి శాస్త్రములో, యం ఏ, పట్టముపొంది, కాకినాడలోను, శ్రీ లంక (Sri Lanka) లోను ఉపన్యాసకుడుగా పనిచేసి, శాస్త్ర విరుద్ధము (Un Scientific) లైన మూఢాచారములను, నమ్మకములను, ఆచారములను నిరశించెను. గాంధీమహాత్మునికి సన్నిహితులు. సర్వోదయ వాది. వీరు తమపుత్రిక నొకరిని హరిజనునకిచ్చి వివాహము చేసిరి. ప్రముఖ కవులు హరిజనులు అగు జాషువాగారి కుమార్తెను కోడలుగా స్వీకరించిరి. వీరి కుమార్తెనొకరిని కమ్మకులజునకిచ్చిరి.

నిరాడంబరుడగు, గోరా మహాత్మునివలెనే కొల్లాయిగుడ్డ మాత్రమే ధరింతురు. కాని గోరా నాస్తికుడు. ఈ ఒక్క విషయములోనే మహాత్మునికి గోరాకు తేడా.

వీరేశలింగముగారి భార్యపేరు రాజ్యలక్ష్మి అమ్మగారు, పంతులుగారికి యెంత చేదోడువాదోడుగా ఉండి, ఆయనసంస్కరణాభిలాషకు దోహదము చేసెనో, గోరాగారి భార్యఅగు సరస్వతి అమ్మగారుకూడ, భర్త అడుగుజాడలలోనే నడచుచు, ఆదర్శ గృహిణిగా ఒప్పారుచున్నారు.


## కుల నిర్మూలన సంఘము

హైదరాబాదు నగరమున మాజీమంత్రి సుప్రసిద్ధ సంఘ సంస్కర్తలు అగు శ్రీ అరిగె రామస్వామిగారు, వారి అనుచరులు, ముప్పదినలువది సంవత్సరములుగా కులనిర్మూలన కొరకు విశేష కృషి సలుపుచు, కులాంతర వివాహములు ప్రోత్సాహించి చేయించుచున్నారు.

ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రులు శ్రీ జె. రాజారామ్, శ్రీ భాట్టం శ్రీరామమూర్తి, శ్రీమతి జయప్రదగారలు ఆంధ్ర విశ్వవిద్యాలయ వైస్‌ఛాన్సలర్ శ్రీ బుల్లయ్యగారు కులాలను అతిక్రమించి ఆదర్శప్రాయమైన వివాహములు చేసుకొనినవారే.


వీరేకాక గడిచిన ముప్పదినలువది సంవత్సరములలో యెందరో తెలుగువారు సంస్కార వివాహములు చేసుకున్నారు. ★

# నగరంలో వార్తాచిత్రాలు



ఉత్తరప్రదేశ్ గవర్నరు శ్రీ ఆక్బర్ అలీఖాన్ హైదరాబాద్‌లో అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనానికి 1973 జనవరి 1వ తేదీన ప్రారంభోత్సవంచేశారు.


హైదరాబాదలోని కేంద్ర ఆంగ్లభాషాధ్యయన సంస్థలో డిశెంబరు 22 న జరిగిన టెక్నాలజీ సెమినార్‌ను ఉస్మానియా విశ్వవిద్యాలయ ఉపాధ్యాయులు శ్రీ ఎన్. నరోత్తమ రెడ్డి ప్రారంభించారు.






అఫ్గనిస్థాన్ యువరాజు శ్రీ అహమద్‌షా సతీసమేతంగా డిశెంబరు 18 వ తేదీన హైదరాబాదుకు వచ్చారు.

కేంద్ర వ్యవసాయ మంత్రి ఫక్రుద్దీన్ అలీ అహమద్ డిశెంబరు 19 వ తేదీన న్యూఢిల్లీలో 1971-72 కృషిపండిత్ బిరుదు గొల్లపల్లి గ్రామానికిచెందిన శ్రీ పి. గోవిందరెడ్డికి ప్రదానంచేశారు.








## నగరంలో వార్తాచిత్రాలు

డిసెంబరు 8 వ తేదీన (1972) మాల్దేవియన్ జానపద నృత్య బృందం హైదరాబాదు సందర్శించారు.

వారి నృత్య ప్రదర్శనలలో వివిధ భంగిమల దృశ్యాలు





# వీరపూజ

పోచిరాజు శేషగిరిరావు

నీలనీలనభోంగణమ్మున
తేలియాడుచు, చల్లచల్లగ
పిలుపువెత్తు మనీషి తెల్గుల
నేలమీదకు చూచునెవ్వడు ?
ఆతడు విప్లవ మారుతమ్మా !
తెలుగు నేర్పెడు పంతులయ్యా !
యుగము కెత్తిన దీప శిఖయో
కందుకూరి విభుండు కాదొకో !
తాళపత్రపు టరణ్యములన్
రాచబాటలు వేసినాతడు
కవి కలమ్ముల కెన్నిటికొ, జీ
వనపు రేఖలు దిద్దెనాతడు.
సర్వ వాఙ్మయ శాఖలందున
తానె శ్రీకారమ్ము చుట్టెను
మేని రక్తపు బొట్టు బొట్టును
జాతి సేవకు మీదు కట్టెను
'బ్రాహ్మ మత' విద్యుద్ధ్వనమ్మున
'కోటి వాట్టుల బల్బు' కాదొకో !
కార్య శౌండిమ గండరించిన
జీవ శిల్పము ! ఈ మహాత్ముడు.

× × ×

గుండె గూటను దీప శిఖలను కూర్చి వెల్గగఁజేసె నెవ్వడు
నిండు గుండెలలోని పొరలను నిల్పె సేవా భావ మాతడు
కండ కలిగిన పలుకుబడితో గ్రంథ నిర్మాణమ్మొనర్చెను
గాంధి హరిజన సేవ కాలకయి కాలు మోపకమున్నె. ఈయన
ఇరుకు సందుల మురుగు కొంపల హీనముగ జీవించువారికి
పరువు నిల్పుటె ధ్యేయమయ్యెను పాపమా తెలుగయ్య వారికి
ధర్మ సంస్థల నిల్పి సర్వము ధారవోసెను వాటికొఱకై
తాను నిల్పిన సంస్థ లెన్నొ ఉదాత్త రీతిని వరలె నేటికి
తానునమ్మిన సూత్రములకు సదా నిలంబడె ఒడ్లు విరిగిన
పులుల మీసలు పట్టి యూగెను పుంజుకొను శౌర్యమ్ముతో.
పతుల బాల్యమునందు బాసిన పడతులకు పెండ్లిండ్లొనర్చెను
శోక తీరస్థులకు వారికి, సుఖప్రదమయి సాగె జీవిత
చెప్పునదియే చేసెనాతడు చేయలేనిది చెప్పబెలుగడు
ముప్పు వచ్చిన, మున్గిపోయిన పూనికను విడనాడ లేడట !
లంచగొండుల రాత్రి చరులను రచ్చకీడ్చిన వీరయోధుడు
కోర్టుకెక్కిరి కొందఱయ్యలు గూఢ చరితము వీధిబడగా.
బురద గుంటలు వీసడించెను, బూర్జువాలను త్రోసి రాజనె
'వచన గంగా భగీరథుడై' వరలెవాఙ్మయ జగతి లోపల
'గద్యతిక్కన' తెలుగు శారద కంఠహారమునై వెలింగెను.
ఎన్ని చెప్పిన ఆంధ్రజాతికి ఈతడొకడే మహాపురుషుడు.

# సామర్లకోటగా మారిన శ్యామల కోట

తూర్పు గోదావరి జిల్లాలో రైలుకూడలి సామర్లకోట. ఇది ఈ జిల్లా ముఖ్యపట్టణమగు కాకినాడకు సింహద్వారము కూడా. ఈ సామర్లకోటే యింగ్లీషులో సామల్‌కోటగా వాడుకలోనికి వచ్చింది. ఈ గ్రామము వెనుక చాల చరిత్రాత్మక గాథ వుండుటయే గాక మహోత్కృష్టమైన పురాణగాథగల మహా పుణ్య క్షేత్రము గూడ.

కృతయుగములో తారకాసురుడను రాక్షసుడు మానవులపైన దేవతలపైన సార్వభౌమాధికారము సంపాదించుటకు పరమశివుని గూర్చి ఘోర తపస్సు చేసెను. శివుడు అతని తపస్సుకు మెచ్చి దానవులు, మానవులు, దేవతలు ఎవరివల్ల చావులేకుండా వర మిచ్చెను. ఆ వరప్రభావమున అతడు మదాంధుడై మునీశ్వరులను దేవతలను బాధింపసాగెను. అందువలన వారు ఆ తారకాసురుని అంతమొందించుటకు ఆ పరమ శివునే శరణు వేడిరి. కానీ దక్షయజ్ఞమున తండ్రిచే తన భర్త అవమానము భరించలేక శరీరము చాలించిన సతీదేవి మరణము శివుని భార్యావియోగిని చేయుట, హిమవంతుని కుమార్తె పార్వతిని పరిణయమాడుట, వారిరువురికి కుమారస్వామి వుద్భవించి తారకాసురుని చంపుట అందరకు తెలిసిన పురాణగాథ. పరమశివ భక్తాగ్రేసరుడైన తారకాసుర సంహారమునందు అతని ఆత్మలింగము 5 భాగములై పడి పంచారామములుగా వెలసినవి. అవి ద్రాక్షారామము, భీమారామము, కుమారారామము, అమరారామము, క్షీరారామము. అందులో ఒకటి ప్రస్తుత సామర్లకోట కాలువకు అవలివైపున వెలసి ప్రస్తుతము బేచరాకు గ్రామముగా వ్యవహరింపబడుచున్న కుమార భీమేశ్వరారామము. ఈ లింగము 12వ శతాబ్దములో ప్రతిష్ఠ చేయబడినట్లు శాసనములు చెప్పుచున్నవి. రెడ్డిరాజుల కాలములో మంత్రిగావున్న మంత్రి ప్రగడ సూరన్న యీ ఆలయ నిర్మాణము జరిపించినట్లు చరిత్ర గ్రంథములు చెప్పుచున్నవి. దక్షిణ భారతీయ శిల్పులు యీ ఆలయము తీర్చిదిద్దినట్లు కనబడుతుంది. ఈ ఆలయమునందున్న నందీశ్వరుడు బాలాత్రిపుర సుందరి మంత్రి ప్రభావమున స్వయముగా నడిచివచ్చినట్లు ఇప్పటికి పెద్దలు చెపుతారు. ఈ ఆలయ సంరక్షణకు నిత్య ధూప దీప నైవేద్యములకు భూములుకూడ యిచ్చియుండిరి. ఈ శివ లింగమును నిత్యము [illegible]0 కపిల గోవుల పాలతో అభిషేకము చేసెడివారు. ఇందుకుగాను యీనాముగాను యిచ్చిన ఉండూరు, దోయలు మొదలగు దేవదాసీజనములకు యీనాముగా యిచ్చిన బోయినపూడి గ్రామములు యిప్పటికి కలవు. ఈ ఆలయమునందు స్వామికి నిత్యాభిషేకము జరుపుటయేగాక మహా శివరాత్రికి భక్తులు వేల సంఖ్యలో వచ్చి వైభవముగా వుత్సవములు జరుపుదురు.

## భీమవరక్షయము

మహా పవిత్రమైన యీ పుణ్యక్షేత్రమును దర్శించుటకు వేములవాడ భీమకవి యీ భీమవరము గ్రామమువచ్చారు. ఆయన మహాశక్తి సంపన్నుడు. కానీ దురదృష్టవశమున యీ మహాకవి యీ గ్రామమునందు అగౌరవము పొందుట, అందుకు ఆయన ఆగ్రహము నొంది పాలకుల గ్రామము కూడ నశించి పోవాలని శపించుట ఆ రోజునుంచి దాని అనతి కాలములో భీమవరము గ్రామము యావత్తు నశించిపోవుట జరిగిపోయాయి. ఇంతకుమించి పేరు ఆధారాలు లేవు. ఆ తర్వాత కాలవ యీవలివైపున ఒక గ్రామము బయలుదేరి దినదిన ప్రవర్ధమానము పొందుతూ వచ్చింది. అదే యీ నాటి సామర్లకోట.

## నామకరణము

1800 A.D. లో యీ నూతన గ్రామమువందు మంచి నీటికై ప్రస్తుతమున్న కోటమ్మ చెరువు త్రవ్వుతూవుండగా మహిషాసురమర్దనియగు శ్యామల విగ్రహము బయల్పడినది. అందువలన పె[illegible]మసప్రభువుల సంతతిలో ఒకరు యీ చెరువుకు కొంత దూరమున ఒక కోట కట్టి శ్యామలకోట అని నామకరణము చేసిరి. ఈ కోటకొరకు పెద్దాపురము బొబ్బిలివారు యుద్ధములు

పి. వి. సుబ్బారావు

జరిగినట్లు ప్రమాణములున్నవి. ఈ కోట శిథిల మైదానమే ప్రస్తుత జిల్లాపరిషత్తు వున్నతపాఠశాల. ఒక మూల శిథిలావస్థనందున్న బురుజు కూడా యున్నది. అయితే యీ శ్యామల విగ్రహమే ప్రస్తుత రాజమండ్రిలోవున్న "సోమాలమ్మ" అను దేవతగా పూజింపబడి ప్రజల ఆదరాభిమానములు చూరగొన్నది. అయితే యీ విగ్రహము ఎపుడు ఎవరు తరలించింది తెలియదు.

ఈ పేరుకు కొందరు యింకొక నిర్వచనము చెబుతారు. మహమ్మదీయ పాలనయందు ఉత్తరముల రవాణావాహకుల ద్వారా జరిగేవిది. ఇటు విజయనగరము వైపు అటు రాజమండ్రి వైపు పోవు ఉత్తరములు గ్రామగ్రామములనుండి సాయంత్రము యీ గ్రామము చేరెడివి. సాయంత్రము టపా గ్రామము కనక దానిని

క్షమ్-కోటాగా వ్యవహరింపబడెడిది. ఆ పదము రానురాను శామల కోటగా మారింది.

ఈ రెండూ కాక పెద్దపురం, పిఠాపురం ఎస్టేటులందు పండితులందరూ భీమేశ్వరస్వామి దర్శనము కొరకు యీ గ్రామమందే వుండేవారని, వారు గణనగల పండితులు కనకు పండిత పరిషత్తుగా వుండేదని చాలమంది వచ్చి యిచట సత్కరింపబడుచుండెవారని ప్రతీతి. ఆ రోజులలో పండితులను "స్వాములు" అని వ్యవహరించెడివారు. కావున యిది స్వాములకోట అయిందని ఒక వాదన గలదు.

ఏదియేమైనా యీ విధముగా సామల్ కోటగా నామకరణము చేయబడి తూర్పుగోదావరి జిల్లాలో రైలు కూడలిగా కాకినాడకు 13 కి.మీ. దూరమున ముఖద్వారమై మంచి ప్రాముఖ్యము పొందుతూంది. పంచాయతి సమితి కార్యాలయము, సువిశాలమైన మైదానములో గ్రామ సేవకులు (V.L.Ws) సేవికలు (G.S) శిక్షణ కేంద్రము, పచ్చని రత్నకంబళి పరచి నట్లుండు వరి పొలాలు మనోహరమైన తోపులతో నిత్యనూతన శోభనొంగు వ్యవసాయ పరిశోధనా కేంద్రము యీ గ్రామ నిసర్గసౌందర్యమునకు మెరుగులు దిద్దిన దనుట నిర్వివాదాంశము. ఆంధ్రప్రదేశ్‌లో అతి ప్రాచీన Parry & Co వారి పంచదార ఫాక్టరీ, పారిశ్రామికముగా వెనుకబడి వ్యవసాయదారుల అవసరములు తీర్చుటకు అన్నట్లు చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధికిగాను నెలకొల్పబడిన యిండస్ట్రియల్ ఎస్టేటు (Industrial Estate). ఒక ఎముకల పిండిమిల్లు 5-6 అపెంకుల మిల్లులు ఆర్థికాభివృద్ధికి గర్వకారణమై యీ గ్రామమును మంచి పారిశ్రామిక కేంద్రముగా తీర్చిదిద్దుచున్నది. కాటన్ దొరవారి ధర్మమా అని గోదావరితల్లి కాలువ ఒకటి యీ గ్రామము ప్రక్కగా ప్రవహించుచు పుణ్యక్షేత్రమును సస్యశ్యామల క్షేత్రముగా మార్చుచు కొద్ది దూరాన సముద్రుని ఒడిలో చేరుచున్నది. సంపూర్ణరవాణా సదుపాయములు గల యీ గ్రామము చక్కటి వ్యాపారకేంద్రముగా రూపొంది పేరెన్నికగన్న నువ్వులనూనె వ్యాపారము, వట్టి వేళ్ళతడికల వ్యాపారము, పెంకులవ్యాపారము, మూసలు వ్యాపారమునకు ఆటపట్టయినది. ఒక పురాతన జిల్లా పరిషత్తు మల్టీపర్పస్ హైయర్ సెకండరీ స్కూలు, ఒక మునిసిపల్ హైస్కూలు, ఒక విటీకర్ సెకండరీ ట్రైనింగు బాలికల హైస్కూల్, వాడవాడకు ప్రాథమిక పాఠశాలలు యీ క్షేత్రపు విద్యాభివృద్ధి చెప్పకయే చెప్పుచుండును. పేరెన్నికగన్న నటనా ధురంధరులగు డాక్టరు చాగంటి సన్యాసిరాజుగారి వంటి నటకుల పుట్టిల్లయిన యీ గ్రామము సాంస్కృతికాభివృద్ధియందు గీటురాయియని అచటి కళాసమితులే చెప్పుచుండును. క్రీడారంగమున "బుచ్చి"బాబువంటి జాతీయ ఆటగాళ్ళకు వుగ్గుపాలు పెట్టినదీ గ్రామమే. చాల ప్రాంతములకు పోవు సుమారు 100 బస్సుల కూడలిఅయిన యీ గ్రామము దర్శించినవారు దీనికి చక్కటి భవిష్యత్తు కలదని తలపోయుటలో ఆశ్చర్యము లేదు.

---

## ఈ సంచికలోని రచయితలు

శ్రీ కూరెళ్ల రామనరసింగరావు, కృష్ణనగరం, విశాఖపట్టణం

శ్రీ పండ్రంగి రాజేశ్వరరావు, అడ్వకేట్, ఏలూరు.

శ్రీ ఎం. తులసీదాస్, ఎం. ఎల్. ఎ., గాంధీభవనం, హైదరాబాదు

శ్రీ ఆదిభట్ల వెంకటరమణ, తెలుగుపండితులు, ఎం. హెచ్. పాఠశాల, సారంగదోలవీధి, శ్రీకాకుళం

శ్రీ కాళిపాక మధుసూదనరావు, తెలుగుపండితులు, ప్రికాట్‌బజారు హైస్కూలు ఖమ్మం

శ్రీ రావెళ్ల వెంకటరామారావు, ఖమ్మం

శ్రీ జి. పుల్లయ్య, బి.ఎ పి.ఆర్.ఒ. కొత్తపేట, తూ. గో. జిల్లా

శ్రీ జె. వీరాస్వామి, న్యాయశాఖ కార్యదర్శి, సెక్రెటేరియట్, హైదరాబాదు

శ్రీ వి.ఎల్. సుందరరావు, రైలుపేట, బాపట్ల, గుంటూరుజిల్లా

శ్రీ కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, 69,ఆదర్శనగర్, హైదరాబాదు

శ్రీ చావలి రామమూర్తి, స్మాల్ సేవింగ్ ఆర్గనైజరు, నిజామాబాదు

శ్రీ పోచిరాజు శేషగిరిరావు, లెక్చెరర్, మహారాణీ కళాశాల, పెద్దాపురం. తూ.గో. జిల్లా.

శ్రీ పి. వి. సుబ్బారావు, బి.ఎ పి.ఆర్ ఒ. అడ్డతీగల

శ్రీ గుంటి పుండరీకాక్షయ్య, గుంటూరు చేనేత వస్త్రాలయం, శ్రీకాకుళం

---

# తెలుగు దేశంలో నేడు వర్ధిల్లుతున్న

# కుటీర పరిశ్రమలు

గుంటి పుండరీకాక్షయ్య

భారత దేశానికి గ్రామాలు వెన్నెముకలాంటివి. ఆ గ్రామాలు

బ్రిటీషువారు మన దేశానికి రాక పూర్వము స్వయం సమృద్ధంగా వుండేవి. ఆయా గ్రామాలలో లక్షలాది పారిశ్రామికులకు జీవనోపాధిని కల్పించి, వారిలో వుండే కళాభిజ్ఞతను చాటే కుటీర పరిశ్రమలు నాడు మూడుపూవు లారుకాయలుగ సర్వతోముఖ వికాసాన్ని గాంచాయి. బ్రిటీషువారి రాకతో యీ వ్యవస్థ ఛిన్నాభిన్నామైంది. చేతి వృత్తులకు ఆదరణ లభించలేదు. తత్ఫలితంగా భారత దేశంలో ఎన్నో కుటీర పరిశ్రమలు రూపుమాసిపోయాయి. మరికొన్ని నామమాత్రా వశిష్టంగా వున్నాయి. ఎందరెందరో పారిశ్రామికులు జీవన భృతి కోల్పోయి అన్య వృత్తులను స్వీకరించారు.

ఆంధ్రదేశం కూడ యీ విపరీత పరిస్థితికి గురికాక తప్పలేదు. నాడు చేనేత పరిశ్రమ, అద్దకం పరిశ్రమ, కుమ్మరము, కమ్మరము వడ్రంగము, శిల్పము, చిత్రలేఖనము మొదలగు చేతి వృత్తులెన్నో వుంటున్నాయి. భారత స్వాతంత్ర్యానంతరము భారత ప్రభుత్వము యీ కుటీర పరిశ్రమల పరిస్థితి నర్థముచేసి కొన్నది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వముకూడ పతనావస్థలో నున్న యీ పరిశ్రమల నుద్ధరించటానికి పూనుకుంది. అందుకు ఎన్నెన్నో పథకాలను రూపొందించి యీ కుటీర పరిశ్రమలకు సహాయ సహకారా లందిస్తున్నట్లుగా మనం పత్రికలలో చూస్తున్నాం.

ప్రస్తుతం తెలుగు దేశంలో నెలకొన్న కుటీర పరిశ్రమలు, వాటి స్థితిని వివరించటమే యీ వ్యాసోద్దేశము.

## చేనేత పరిశ్రమ

ఆంధ్రదేశములో ప్రధాన కుటీర పరిశ్రమగా పేర్కొనదగినది చేనేత పరిశ్రమ. ప్రస్తుతం ఆంధ్రదేశములో ఐదు లక్షలకు పైగా మగ్గములున్నట్లు అనధికార అంచనా. ముఖ్యంగా యీ చేనేత పారిశ్రామికులు ఆంధ్రదేశంలోని అన్ని గ్రామాలలోను విస్తరించి వున్నారు. పద్మసాలి, పట్టుసాలి, దేవాంగ, తొగట వగైరా తెగలవారు దీనిని కులవృత్తిగా స్వీకరించారు. చేనేత పారిశ్రామికుని యింటిల్లపాది పనిచేస్తేగాని జీవనము గడువదు.

చీరాల, వెంకటగిరి, గద్వాల్ మొదలైన చోట్ల వెండి జరీ అంచులతో ప్రశస్తమైన చీరలు తయారు చేయుచున్నారు. ముఖ్యంగా వెంకటగిరి, నారాయణవనం ఉప్పాడ జరీ చీరలు సన్నని నేతకు ప్రసిద్ధి చెందాయి. చీరలపై రంగురంగుల డిజైనులతో, బుటాలతో నేత పనివాడు తన హస్తకళా కౌశల ముపయోగించి యీ చీరలను తయారు చేయుచున్నారు. షుమారు రూ. 20లు మొదలుకొని రూ. 500 ల వరకు యీ చీరెలు తయారు చేయబడుతున్నాయి. సిద్ధిపేట కూడ చీరెల రంగులకు, పనితనానికి పేరు గాంచింది. మాధవరం చీరెలు నేత నాణ్యానికి, పనితనానికి పేరు పొందాయి.

ఈ చేనేత వృత్తిపై ఆధారపడి యితరులు పలువురు జీవిస్తున్నారు. చేనేత వృత్తిలో ఉపకరించే మగ్గం, అసు, దోనె మొదలైనవన్ని వడ్రంగి తయారుచేయవలసిందే. అలాగే అచ్చు, పన్ని మొదలైనవన్ని తయారుచేసే ప్రత్యేక పనివాళ్ళున్నారు.

## టేపు పరిశ్రమ

చీరాలలో కట్టుగాని, అతుకుగాని లేకుండ వలయాకారంలో టేపును తయారుచేస్తారు. టేపు తయారైన పిదప ఆ టేపుకు మొదలు చివర చెప్పటం ఎవ్వరి తరముకాదు. అంతటి పనితనాన్ని ఉపయోగించి జాయింట్ చేసిన యీ టేపులు అమెరికాలో సిగరెట్ ఫ్యాక్టరీలలో రోలర్లుగా ఉపయోగిస్తున్నాయి. ఈజిప్టు ప్రత్తితో ఇంగ్లాండులో తయారైన దారంతో చీరాలలో నేయబడి అమెరికాకు ఎగుమతి చేయబడుతుంది. చేనేత వృత్తి చేసే పారిశ్రామికులే యీ టేపులను నేసున్నారు. షుమారు 60 కుటుంబాలకు పైగా యీ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారు.

## హిమ్రూ వస్త్రాలు

చక్కని బొమ్మల డిజైన్లతో ఇంపయిన రంగుల పొందికతో యీ వస్త్రాలు మనసున కాహ్లాదం కలిగిస్తాయి. లాల్చీ గుడ్డలు, శాలువలు, కర్టెన్ల గుడ్డలు, టేబుల్‌క్లాత్స్, సోఫా అలంకరణ వస్త్రాలు తయారవుతున్నాయి. మిల్లు వస్త్రాల పోటీకి తట్టుకోలేక యీ పరిశ్రమ నీరసించిపోతున్నది.

హైద్రాబాద్ నగరంలో యీ పరిశ్రమకు సంబంధించిన సహకార సంఘ మొకటున్నది.

## లేసు అల్లిక

ఈ పరిశ్రమ పశ్చిమ గోదావరి జిల్లా నర్సపూరు, పాలకొల్లు తాలూకాలలో విస్తృతంగా కొనసాగుతున్నది. ఒక్క నర్సపూర్ తాలూకాలోనే 60 గ్రామాలలో యీ పరిశ్రమ కొనసాగుతున్నది. సుమారు 5000 మంది యీ పరిశ్రమలో పని చేస్తున్నారు.

లేసు అల్లకానికి "డైమండ్" దారాన్ని వాడుతున్నారు. ముఖ్యంగా టేబుల్‌క్లాత్ అంచులు, కిటికీ తెరలు, పరికిణి అంచులకు యివి తయారు చేయబడుతున్నాయి.

ఇంతకు పూర్వం వీటికి విదేశాలలో మంచి గిరాకీ వుండేది. గత పది సంవత్సరాలుగా వీటి ఎగుమతులు క్రమంగా తగ్గిపోతున్నాయి.

## ఉన్ని పరిశ్రమ - తివాచీలు

అనేక మంది యాదవులు యీ పనిలో నిమగ్నులై వున్నారు ఆంధ్రప్రదేశ్ మొత్తం మీద 1400 ఉన్ని మగ్గము లున్నాయని అంచనా. 1951 జనాభా లెక్కల ప్రకారం ఈ పరిశ్రమలో 31, 251 మంది పనిచేస్తున్నారు.

వరంగల్లు తివాసీలు దక్కను కంతటికి గర్వ కారణాలు, 1857 లో లండనులో జరిగిన బ్రిటీష్ ఎంపైర్ ప్రదర్శనలో అందమైనవిగా ఎన్నబడిన 'దక్కను రగ్గులు' వరంగల్ లోనివే. పశ్చిమ గోదావరి జిల్లా ముఖ్య పట్టణమగు ఏలూరు కూడ యీ పరిశ్రమ కొక ముఖ్య కేంద్రము. 15 వ శతాబ్దము నుండి యీ పరిశ్రమ ఈ ప్రాంతాలలో కొనసాగుతున్నది. శీతల మండలాలలో గొర్రెల ఉన్ని పొడవుగాను, ఉష్ణమండలంలో కురుచగాను పెరుగుతుంది. అందువల్ల మెట్ట తాలూకాలలోని గొర్రెల ఉన్నితో తయారైన ఊలు తివాసీలకు ఉపకరిస్తుంది.

ఈ పరిశ్రమను ప్రోత్సహించుటకై ఏలూరులో "ఏల్లూరు పెర్ల్ కార్పెట్ వీవర్సు కోపరేటివ్ పర్చేజ్ అండ్ సేల్ సొసైటి" అనునది 1937 లో స్థాపింపబడినది. ఈ సహకార సంఘమునకు చెందిన పనివారు కూడ వున్నారు. సంవత్సరానికి తివాసీల ఉత్పత్తి దాదాపు 2500 చదరపు గజములుండును. నాణ్యమును బట్టి వెల చ. గ 82.50 నుండి 40.00 వరకు వుంటుంది. వరంగల్లు, ఏలూరు తివాసీలకు విదేశాలలో మంచి డిమాండు.

ఈ పరిశ్రమను ప్రోత్సహించే వుద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం వరంగల్లులోని ఒక వ్యాపారసంస్థకు కేంద్ర ప్రభుత్వంతో 60 వేల రూపాయల నప్పుగా యిప్పించింది. ఈ సంస్థ ఆధ్వర్యాన 1955 నుంచి ఉత్పత్తి సాగుతోంది.

బొమ్మలు పిల్లలలో భావనాశక్తిని పెంపొందించటానికి, వారికి ఆనందోత్సాహాలను కల్గించటానికి తోడ్పడుతాయి. బొమ్మల పెళ్లిళ్లు, దసరా బొమ్మల కొలువులు మనకేమీ క్రొత్త కావు. భాగవతంలో రుక్మిణీదేవి "వేర్వేరు బొమ్మల పెండ్లిండ్లు సేయించు అబలలతోడ వియ్యంబు లందెడి"దట. దీనిని బట్టి ఆ నాటి మన సంప్రదాయాలు, ఆచారాలు తెలుస్తున్నాయి.

బొమ్మలు తయారు చేసే కేంద్రాలు ఆంధ్రప్రదేశంలో కృష్ణా జిల్లాలోని కొండపల్లి, తిరుపతి (తిరుచానూరు), ఏటికొప్పాక, నిర్మల గ్రామాలు ప్రసిద్ధి పొందాయి.

## కొండపల్లి బొమ్మలు

కొండపల్లి బొమ్మలు నేడు ప్రపంచ ప్రఖ్యాతి నందుకుంటున్నాయి. ఈ కొయ్యబొమ్మలోని శిల్ప నైపుణ్యం, పని వారి సృజనాత్మక శక్తి పని వారి కళాకౌశల్యాన్ని అభివ్యక్తం చేస్తాయి.

కొండపల్లిలోని సుమారు 15 కుటుంబాలవారు పూర్తిగా ఈ పరిశ్రమ యందే పని చేస్తున్నారు. వీరంతా "ఆర్యక్షత్రియులు, రాజస్థానం నుండి ఆంధ్రదేశానికి వలస వచ్చారు. వీరి నైపుణ్యం పెక్కు సంవత్సరాల క్రితమే జగత్ప్రసిద్ధమైంది. 1936లో ఈ పరిశ్రమకు గాను ఒక సహకార సంఘం నెలకొల్ప బడింది. రాను రాను, యీ పరిశ్రమకు ప్రజల సహకారం, ప్రభుత్వ ప్రోత్సాహం లభ్యం కావడం మొదలెట్టాయి. 1957 ఫిబ్రవరి నెలలో అఖిల భారత చేతి పరిశ్రమ సంఘం వారు కొండపల్లి కొయ్య బొమ్మల సంఘానికి ఐదు వేల రూపాయలు విరాళముగా ఇచ్చారు. అధునాతన పద్ధతిలో ఈ పరిశ్రమ యందు మంచి శిక్షణ నిచ్చుటకు సౌకర్యములు కలుగ జేస్తున్నారు.

ఈ కొండపల్లి కొయ్య బొమ్మలలో ప్రకృతిలోని వస్తువులు, మనుషులు, జంతువులు, పక్షులు, ఫలాలు, కూరగాయలు, వస్త్రములు, గృహాలు ఒకటేమిటి పనివాని చాతుర్యాన్ని బట్టి రమణీయాకృతి దాల్చు తున్నాయి. జీవకళ తొణికిస లాడుతున్నాయి.

## నక్కపల్లి లక్క బొమ్మలు

పూర్వం ఈ లక్కబొమ్మలు తెలుగునాట విశాఖపట్టణం జిల్లా నక్కపల్లిలోనే తయారు చేసేవారు. క్రమేణ ఈ పరిశ్రమ ఆ వూరికి పది మైళ్ల కైవారంలోని గ్రామాలన్నింటికీ ప్రాకింది. కాని నక్కపల్లి బొమ్మలనే ప్రసిద్ధి మాత్రం పోలేదు. నక్కపల్లి పరిసరాలలోని రామచంద్రపురం, దార్లపూడి, గోటివాడు, కైలాస పట్నం మున్నగు పల్లెలలో నేడు వందకుపైగా కుటుంబాలు ఈ వృత్తిలో బ్రతుకుతున్నాయి. ఈ పల్లెలు యలమంచిలి-నర్సీపట్నం రోడ్డుమీద, ఆ పరిసరాలలే లోను కొండల మధ్య వుంటున్నాయి.

ఈ ప్రాంతాల కొండలలోను, గ్రామ పరిసరాలలోను విశేషంగా పెరిగే అంకుడు చెట్ల కర్రలతో యీ బొమ్మలను తయారు చేస్తారు.

ఊయలలోని పాప కళ్ళప్పగించి చూచే పండ్లగుత్తుల్లాగ దోగాడే పాప నోట్లో దోబూచులాడే దొండకాయలు, గిలకలు,

ద్రాక్షగుత్తులు, చిలకలు, అరటిపండ్లు, అద్దం స్టాండులు-ఇంకా రకరకాల వస్తువులు ఎంతో చక్కగా మనోహరమైన రంగుల పొందికతో చేస్తారు.

ఆంధ్ర ప్రభుత్వం కూడ యీ నక్కపల్లి పరిశ్రమను ప్రోత్సహించింది. 1958 జూన్ 14వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం ఒక ఉపాధ్యాయునితో "ది ఉడెన్ టాయ్ వర్కర్స్ ఇండస్ట్రియల్ కో ఆపరేటివ్ సొసైటి" ని కోట ఉరట్లలో స్థాపించింది. దానికొక ఇన్‌స్పెక్టరును నియమించి, వేయి రూపాయలు సహాయ ధనం మంజూరు చేసింది. ఈ పరిశ్రమను వృత్తిగా చేపట్టిన వారి కుటుంబాల పిల్లలకు విద్యార్థి వేతనమిచ్చి ప్రోత్సహిస్తున్నది.

## ఏటికొప్పాక

స్థానికంగా దొరికే తేలికయిన మెత్తని కర్రతో జంతువులు, రైల్వే ఇంజనులు, గ్రామ ఫోనులు, పండ్లు యిత్యాది ఆట వస్తువులను చేసేరు. ఈ పరిశ్రమ ఒకప్పుడు ఉన్నత దశలో ఉండేది. క్రమంగా క్షీణించిపోతున్నది.

ఆదిలాబాదు జిల్లా నిర్మల్‌లో బూరుగు, పునుకు కర్రతో బొమ్మలు, ఆటవస్తువులు తయారు చేయబడుచున్నవి. పరిశ్రమ అభివృద్ధి "ఇండస్ట్రియల్ ట్రస్టు ఫండ్" వారిచ్చిన లక్ష రూపాలయతో "నిర్మల్ పరిశ్రమలు" అను సంస్థ స్థాపించబడినది.

నిర్మల్‌లో మంచి కత్తులు కూడా తయారుచేయబడుతున్నాయి.

పుణ్యక్షేత్రమగు తిరుపతి కూడ యీ పరిశ్రమ కొక ముఖ్య కేంద్రము. తిరుపతి ప్రాంతపు అడవులలో లభ్యమయ్యే ఎఱ్ఱని చందనపు కఱ్ఱతో వేంకటేశ్వరస్వామి, అలివేలుమంగ మొదలైన దేవతా మూర్తులను చేసారు. విగ్రహమంతా ఒకే దిమ్మతో చెక్కడం దీని ప్రత్యేకత.

ప్రభుత్వము పరిశ్రమలోని వారికి తగు సహాయ మొసగి దీని నభివృద్ధిచేయుటకు కృషిచేయుచున్నది. ఈ బొమ్మలకు కెనడా, అమెరికా సంయుక్త రాష్ట్రములలో కూడ మంచి గిరాకీ వున్నది.

## విలాస వస్తువులు : అలంకరణ సామగ్రి

## వెండి నగిషీ పరిశ్రమ

కరీంనగరు యీ పరిశ్రమకు పేరు పొందింది. ఈనాడు ఇది అరుదైన చేతివృత్తి. అతిసన్నని వెండితీగతో యీ పని వాళ్ళు చేయుదురు. సాలెగూడులో వుండే అందం, ఆకర్షణ ఫిలిగ్రీ పనితనంతో ద్యోతకమవుతుంది.

ఈ పరిశ్రమలో వస్తువులను తయారుచేయటానికి చాల నేర్పరితనం, ఓర్పువుండాలి. గాజులు, తమలపాకుల పెట్టెలు, బొత్తాములు, ఫోటో ఫ్రేములు, సున్నితమైన ఆభరణాలు మున్నగు అనేక రకాల వస్తువులు ఫిలిగ్రీలో తయారవుతాయి.

1925లో అఖిల భారత బొంబాయి వస్తు ప్రదర్శనశాలలో ప్రత్యేకంగా వెండి ఫిలిగ్రీ వస్తువులు ప్రదర్శింపబడ్డాయి. ఇవి ప్రజలను బాగా ఆకర్షించాయి. అఖిల భారత వస్తు ప్రదర్శనలో ఈ వస్తువులకు బంగారు బహుమతులు, ప్రశంసా పత్రాలు లభించాయి.

ఈ పరిశ్రమకు ప్రభుత్వం కూడ తగిన చేయూత నిస్తోంది.

## షీట్ మెటల్‌తో అలంకార సామగ్రి

మన రాష్ట్రంలో ఈ కళాత్మకమైన షీట్‌మెటల్ పనులు హైద్రాబాదులోను, వరంగల్లు జిల్లాలోని పెంబర్తి గ్రామంలో జరుగుతున్నాయి. ఈ పనివారు మన ప్రాచీన సంప్రదాయాన్ని, సంస్కృతిని ప్రస్ఫుటింప జేసే ఎన్నో కళారీతులను మేళవించి ఎన్నో అలంకరణ వస్తువులను తయారు చేస్తున్నారు.

పెంబర్తి గ్రామంలో సుమారు పది కుటుంబాల వారికి యిది జీవనోపాధి. ఈ కళాత్మకమైన అలంకరణ సామగ్రికి ఆస్ట్రేలియాలో మంచి గిరాకీ వుంది. ఈ పరిశ్రమను అభివృద్ధి చేయడానికి ఆల్ ఇండియా హ్యాండిక్రాఫ్ట్స్ బోర్డ్ మినిస్ట్రి ఆఫ్ కామర్సు, మద్రాసు ప్రభుత్వం షీట్ మెటల్ ట్రెయినింగ్ సెంటరును ఏర్పాటు చేసింది. సుమారు 3 సం॥ల క్రితం యీ ట్రెయినింగ్ సెంటర్ ఏర్పాటు చేయబడింది.

ఈ పరిశ్రమ విదేశీయుల దృష్టిని బాగా ఆకర్షించి మన్ననలు, ప్రశంసలు పొందింది. అయినా యీ కళకు తగిన ఆదరణ లేక క్షీణిస్తోంది. ప్రజలే ప్రోత్సహించి, ఆదరించాలి.

## కొమ్ము, దంతపు చెక్కడము

ఇది రాష్ట్రములో మరొక ప్రధాన పరిశ్రమ. ఈ పరిశ్రమ విశాఖపట్టణం, సికింద్రాబాద్‌లలో ఉన్నది. 1859-1862 సం॥కాలంలో యీ ప్రాంతంలో కలెక్టరుగా పనిచేసిన "ఫాన్" అనే అయన ఈ పరిశ్రమను ప్రారంభింప చేసినట్లు చెప్పబడుతున్నది.

పారిశ్రామికుని హస్తకౌశలము అభివ్యక్తమయ్యేది యీ పరిశ్రమలోనే. ఏనుగు దంతాలతో దీపస్తంభాలు, దంతపు ఆభరణాలు, దేవతల బొమ్మలు దువ్వెనలు, టాయ్‌లెట్ పౌడర్ వేసుకునే చిన్నచిన్న పెట్టెలు, సిగరెట్‌కేసులు, ఫొటో ఫ్రేములు, జంతువుల ప్రతిరూపాల వంటి నగిషీ వస్తువులు చేయబడుతున్నాయి. ఇవి స్వదేశీ, విదేశీ మార్కెట్లలో మంచి పేరు పొందాయి. వీటికి డిమాండు క్రమంగా అధిక మవుతుంది.

## బీదరీ వస్తువులు

తుత్తునాగము, రాగి, మరికొన్ని ధాతువులు కలిసిన మిశ్రమలోహపు వస్తువులు తయారుచేసి, వానిపై చిత్రాలు వేసే పరిశ్రమను

బీదరీ పరిశ్రమ అందురు. హైదరాబాదు నగరంలో యీ పనిచేయు వారికి సహకార సంఘము లున్నాయి.

బీదరీ వస్తువులపై వేయబడు చిత్రాలు సాధారణముగా బీదరు కోటచిత్తరువుల నుండి, అజంతా చిత్రముల నుండి గ్రహింపబడు చున్నవి. ఇప్పుడిప్పుడు సరిక్రొత్త ఆకృతులను కూడ చిత్రించు చున్నారు. పళ్లెములు, నీళ్ల కూజాలు, హుక్కాలు మొదలగు సామగ్రిని, సిగరేటు పెట్టెలు మొదలగు విలాస వస్తువులను యీ పనివారు తయారుచేయుచున్నారు.

## గాజుల, గాజు పూసల పరిశ్రమ

హైందవ స్త్రీ యొక్క లాంఛనంగా ధరించే నల్ల పూసలు మొదలు వివిధాలంకరణలకు ఉపయోగించేరంగుల పూసలకు చిత్తూరు జిల్లాలోని పాపానాయుడు పేట అనాది నుండి పేరు గాంచినది. ఆ జిల్లాలోనిదే యగు కాళహస్తి, అనంతపురం జిల్లాలోని గుట్టూరు, విశాఖపట్టణం జిల్లాలోని సింహాచలం, మహబూబ్ నగర్ జిల్లాలోని గాజులపేట కూడ యీ పరిశ్రమకు ప్రసిద్ధి చెందినవి. ఆధునిక యంత్రాలతో దీనిని నడుపుటకు శిక్షణాకేంద్రములు పాపానాయుడు పేట, గుట్టూరు, సింహాచలం, మహబూబ్‌నగర్, గూడూరులలో నడుపబడుతున్నాయి.

## రాతి పాత్రలు—బొమ్మలు

మన రాష్ట్రంలో లభించే స్టీటైట్ ఖనిజానికి సంబంధించిన సబ్బురాయితో రాతి పాత్రలు విగ్రహాలు, ఆటవస్తువులు, సిరా బుడ్లు, నస్యంకాయలు చేయబడుతున్నాయి. ఇది మెత్తగా వుండటం వల్ల కావలసిన రూపానికి మలవటం సులభం.

ఈ పరిశ్రమ నెల్లూరు జిల్లా రాపూరు తాలుకాలోని సైదాపేట, గుంటూరు జిల్లా వినుకొండ తాలుకాలోని కొప్పుకొండ, పల్నాడు తాలుకాలోని దుర్గి గ్రామంలో వున్నది.

## వడ్రంగం: గృహపరిశ్రమ

వ్యవసాయంలో ఉపయోగించే పరికరాలు, నేత పరికరాలు, మన గృహోపయోగ పరికరాలన్ని వడ్రంగి తయారు చేస్తున్నాడు. పనివాడు తన కళాకౌశలాన్ని ప్రదర్శిస్తానికి యీ పరిశ్రమలో ఎంతైనా అవకాశముంది. అనంతపురం జిల్లా ధర్మవరంలో నాణ్యమైన టాంగాలు, ఎడ్లబండ్లు తయారు చేయబడుతున్నాయి.

## పలకలు—బలపాలు

కర్నూలు జిల్లాలోని కంభం, మార్కాపూరులలో పలకలు తయారవుతున్నాయి. శ్రేష్ఠమయిన బలపాలు కూడ యిచ్చట తయారవుతున్నాయి.


## వీణలు

వీటిని తయారు చేయడంలో ప్రత్యేక నైపుణ్యం గలవారు బొబ్బిలి, పిఠాపురం ప్రాంతాలలో వున్నారు. పనస మాను దొలిచి వీణ బుర్ర తయారుచేసి దానిని దండమునకు అమర్చుతారు. దీనిపైన దంతం పనిచేసిన రేకులు అతుకుతారు, దండం చివర వంపులు తిరిగిన సింహపు బుర్ర దాని క్రింద ఆనపకాయ బుర్ర వ్రేలాడుతూ వుంటుంది. వీణా దండంమీద 24 మెట్లు 7 తీగలు, నాదానుసంధానానికి అనుకూలంగా తయారు చేస్తారు.

ఈ విధంగా ప్రత్యేక కళాకౌశలాన్ని ప్రస్ఫుటింప జేసే చేతి పనులే గాక నిత్యోపయోగములైన వస్తువులు తయారు చేసే చేతి పనులున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లాలోని యన్గొండ గ్రామంలో తుంగతో సుందరమైన చాపలు అల్లుతారు. హైద్రాబాద్‌లో సుందరమైన చాపలు అల్లుతారు హైదరాబాద్‌లో మట్టితో అందమైన పాత్రలను తయారుచేసి దానిపై రకరకాల డిజైన్లు వేసి సుందరంగా రూపొందిస్తున్నారు.

తోళ్లను బాగుచేయుట, జోళ్లు, మనిపర్సులు చేయటం, సామర్లకోట, ఏలూరు, మహబూబ్‌నగర్, జాల్‌నా, ముషీరాబాద్ లలో వున్నాయి. ఏలూరు ప్రాంతంలో తాటి చాపతో చేతి కర్రలు తయారుచేస్తారు.

ఈ విధంగా ఆంధ్రదేశం అనేక చేతి పరిశ్రమలతో అలరారుతోంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారు యీ చేతి వృత్తుల వారి యెడ మరింత శ్రద్ధ తీసుకొనవలసిన అవసరం నేడెంతో వుంది. అసలే నిరుద్యోగ సమస్య గుండెలపై కుంపటిగా వున్నది. ప్రభుత్వానికి, వీటి నాదరించని యెడల మరింత నిరుద్యోగ సమస్య ప్రబలమయ్యే ప్రమాదముంది. ఇప్పటికి ప్రభుత్వం చేనేత పరిశ్రమల వారికి రిబేటు రూపంగాను, తదితర పరిశ్రమల వారికి సబ్సిడి రూపంగాను సహాయం చేస్తున్నా యీ సహాయం మరింతగా పెంచి చేతి వృత్తుల వారి దారిద్ర్యాన్ని తొలగించాలి. ఆ వృత్తి యెడల వారికి గౌరవభావం కలుగజేయాల్సిన అవసరం ఎంతైనా వుంది.





Reg. No. H. 133